




GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 225 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 బుధవారం 26 నవంబర్ 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్







# రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేటితో పూర్ణాహుతి

- భారతీయ సాంస్కృతిక చైతన్యానికి సాక్షి అయోధ్య
- ధర్మ ధ్వజం భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నం
- ధ్వజారోహణతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయాయి
- అయోధ్య రామాలయ ధ్వజారోహణ కార్యక్రమంలో ప్రధాని మోడీ

## బీహార్ ప్రయోగాలు మా వద్ద పనిచేయవు

బెంగాల్‌ను టచ్ చేస్తే అగ్నిగుండమే

సర్ ప్రక్రియపై కేంద్రానికి మమత హెచ్చరికలు



**కోల్‌కతా,నవంబర్25(సమయజ్యోతి):**

బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ ఫలితంగానే ఎన్డీయే విజయం సాధించిందని, బీజేపీ 'గేమ్'ను అర్థం చేసుకోవడంలో విపక్షాలు విఫలమయ్యాయని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. ఎన్నికల కమిషన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు వ్యతిరేకంగా బనగావ్ లో మంగళవారంనాడు భారీ ర్యాలీని నిర్వహించారు.

## మోగిన స్థానిక ఎన్నికల నగారా

మూడు విడతల్లో ఎన్నికల నిర్వహణ

డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్

అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడి

**హైదరాబాద్,నవంబర్25(సమయజ్యోతి):**

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకునోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. మంగళవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మొత్తం మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించబోతున్నట్లు చెప్పారు.

## 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు హిల్ట్ పాలసీ



నగరంలో ఉన్న విలువైన భూములు హాంఫట్

రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తాకట్టు పెడుతున్న సిఎం రేవంత్

రాత్రికి రాత్రే బిలియనీర్ కావాలన్న లక్ష్యంతో కదుపుతున్న పావులు

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,నవంబర్25(సమయజ్యోతి):**

సిఎం రేవంత్ రెడ్డి అవినీతి కోసమే హిల్ట్ పాలసీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు హిల్ట్ పాలసీ అని అన్నారు. విద్యార్థులు, రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తాకట్టు పెడుతూ రేవంత్ సర్కార్ హిల్ట్ పాలసీకి నిర్ణయం తీసుకుందని కేటీఆర్ అన్నారు. ఒకప్పుడు పరిశ్రమలు, ప్రజల ఉపాధి కోసం ఇచ్చిన భూములను ప్రైవేటు వ్యక్తులు అపార్ట్‌మెంట్లు కడతామంటే ప్రభుత్వం అనుమతినిస్తోందని తెలిపారు.

## హసీనాకు 'ఉరి' చట్టవిరుద్ధం..

దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చిన అవామీ లీగ్..!



: మాజీ ప్రధాని షేక్ హసీనా కు ఉరిశిక్ష విధించడంపై ఆమె మద్దతుదారులు భగ్గుమంటున్నారు. తమ పార్టీ అధినేత్రికి నవంబర్ 17న విధించిన మరణ శిక్ష చట్ట విరుద్ధమని మండిపడుతున్నారు. బంగ్లాదేశ్ ముఖ్య సలహాదారు యూనుస్‌ను హంతకుడితో పోలుస్తున్న బంగ్లాదేశ్ అవామీ లీగ్ మంగళవారం దేశవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చింది. అంతేకాదు ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు అవామీ లీగ్ నేతలు.

## ఈస్టన్ ఇండియా టెక్ హబ్‌గా బీహార్

రాష్ట్ర యువతకు కోటి ఉద్యోగాల కల్పన

నితీశ్ తొలి కేబినేట్‌లో కీలక నిర్ణయాలు



**పాట్నా,నవంబర్25(సమయజ్యోతి):**

ఈస్టన్ ఇండియా టెక్ హబ్'గా బీహార్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని సిఎం నితీశ్ కుమార్ నిర్ణయించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం అనంతరం నితీశ్ కుమార్ మంత్రివర్గం మంగళవారంనాడు తొలిసారి సమావేశమైంది. నితీశ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాబోయే ఐదేళ్లలో రాష్ట్ర యువతకు కోటి ఉద్యోగాలు కల్పించాలని, 'సమావేశానంతరం బిహార్ చీఫ్ సెక్రటరీ ప్రత్యయ్ అమ్రిత్ ఆ వివరాలను మీడియాకు తెలిపారు. విస్తృత ఉద్యోగావకాశాల కల్పన, పారిశ్రామిక అభివృద్ధిపై సమావేశంలో కీలకంగా చర్చ జరిగినట్టు ఆయన చెప్పారు.



## అసెంబ్లీలో నేనే సీనియర్..

### కేసీఆర్ అక్కడ ఓడిపోయారు..

మీడియా చిట్‌చాట్‌లో రాష్ట్ర ఇరిగేషన్, సివిల్ సప్లై శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఒకేపార్టీ నుంచి వరుసగా ఏడు సార్లు గెలిచానని గుర్తు చేశారు. అసెంబ్లీలో కేసీఆర్ తర్వాత తానే సీనియర్ అని చెప్పారు. అయితే కేసీఆర్ వివిధ పార్టీల నుంచి గెలిచారని.. అలాగే కేసీఆర్ కామారెడ్డిలో ఓడిపోయారని గుర్తు చేశారు. తాను మాత్రం ఎప్పుడూ ఓడిపోలేదని చెప్పారు. కొదాడలో జరిగింది లాక్ అప్ డెత్ కాదని.. ఆయనపై %జవీ=ఖీ% చెక్స్ ఫ్రాడ్ కేసు ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన %ణజజ% అధ్యక్ష పదవులు వచ్చిన వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. సూర్యపేట %ణజజ% పదవి తమకు ఇస్తామన్నారని, అయితే తామే ఆ పదవిని వద్దనుకున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.



## చెక్ డ్యామ్ కూల్చివేత ఇసుక మాఫియా పనే

గుంపుల వద్ద డ్యామ్‌ను పరిశీలించిన హరీష్ రావు

**పెద్దపల్లి,నవంబర్25(సమయజ్యోతి):**

కెసిఆర్ హయాంలో ప్రాజెక్టుల గురించి మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డిమల్లన్న సాగర్ ఎవరు కట్టారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల వద్ద పేల్చిన చెక్ డ్యామ్‌ను పార్టీ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, దాసరి మనోహర్ రెడ్డి, రసమయి బాలకిషన్, నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానేరు నదిపై నిర్మించిన చెక్ డ్యామ్‌ను కూల్చివేసింది కాంగ్రెస్ నేతలేనన్నారు.



## ఓఆర్ఆర్ లోపలా, బయట ఉన్న మున్సిపాలిటీల విలీనం

- జిహెచ్ఎంసి పరిధి మరింత విస్తరణ
- మొత్తం 27 మున్సిపాలిటీలను జిహెచ్ఎంసిలో విలీనం
- కొత్తగా మరో విద్యుత్ డిస్కమ్ ఏర్పాటుకు నిర్ణయం
- ఎన్‌టిపిసి ఆధ్వర్యంలో రామగుండంలో పవర్ ప్లాంట్ ఏర్పాటు
- పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ విభాగంలో పెట్టుబడులకు ఆహ్వానం
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు

**హైదరాబాద్,నవంబర్25(సమయజ్యోతి):**

జీహెచ్ఎంసీని విస్తరించేందుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్నా 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం సుమారు 4 గంటలకుపైగా వివిధ అంశాలపై చర్చించింది. రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాలను డిప్యూటి సిఎం,మంత్రి శ్రీధర్‌బాబు,జూపల్లి కృష్ణారావులు మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్ తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లన్నీ జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఔటర్ రింగ్ రోడ్ లోపల, బయట, ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఉన్న 27 అర్బన్ లోకల్ బాడీస్ (మున్సిపాలిటీ, కార్పొరేషన్లను) జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పెద్ద అంబర్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, మేడ్చల్, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, తుక్కుగూడ, కొంపల్లి, దుండిగల్, బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట, బోడుప్పల్, నిజాంపేట్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేటితో పూర్ణాహుతి

**అయోధ్య,నవంబర్25(సమయజ్యోతి):**

భారతీయ సాంస్కృతిక చైతన్యానికి సాక్షిగా అయోధ్య నిలిచిందని దేశ ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. అయోధ్య రామాలయం శిఖరంపై జెండాను ఎగురవేసిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. జై శ్రీరామ్ నినాదంతో ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. రామభక్తుల సంకల్పం సిద్ధించిందన్నారు. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేడు పూర్ణాహుతి జరిగిందని చెప్పారు. ధర్మ ధ్వజం కేవలం జెండా కాదని..భారత సంస్కృతి పునర్వికాసానికి చిహ్నమని ప్రధాని మోదీ అభివర్ణించారు. సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం చిహ్నమని పేర్కొన్నారు. ధర్మ ధ్వజం శ్రీరాముడి సిద్దాంతాలను ప్రపంచానికి చాటుతుందన్నారు. ధర్మ ధ్వజం ప్రపంచానికి ఒక స్ఫూర్తి, ప్రేరణ ఇస్తుందని స్పష్టం చేశారు. కర్మ,కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మ ధ్వజం వివరిస్తుందన్నారు. పేదలు, దుఃఖితులు లేని సమాజాన్ని మనం ఆకాంక్షిస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. ఈ ధ్వజారోహణ కార్యక్రమంతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయాయన్నారు. ఒక వ్యక్తి పురుషోత్తముడిగా ఎలా ఎదిగారో అయోధ్య చెబుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయోధ్యలో ధ్వజారోహణ కార్యక్రమంతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతీయ సాంస్కృతిక చైతన్యానికి అయోధ్య సాక్షిగా నిలిచిందన్నారు. రామభక్తుల సంకల్పం సిద్ధించింది. కోట్లాది మంది కల సాకారమైంది. శతాబ్దాల నాటి గాయాలు, బాధల నుంచి నేడు ఉపశమనం లభించింది. 500 ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారమైంది. ఈ ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నమస్కరిస్తున్నా. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేడు పూర్ణాహుతి జరిగింది. ధర్మధ్వజం కేవలం జెండా కాదు.. భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నం. సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం ప్రతీక. శ్రీరాముడి సిద్దాంతాలను ఈ జెండా ప్రపంచానికి చాటుతుంది. స్ఫూర్తి, ప్రేరణను ఇస్తుంది. కర్మ, కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మధ్వజం చెబుతుందని మోదీ పేర్కొన్నారు. రాముడు కులం చూడడు.. కేవలం భక్తి మాత్రమే చూస్తాడు. ధర్మధ్వజంపై కోవిదార్ వృక్షం మన ఇతిహాసాల వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని ప్రధాని తెలిపారు. అయితే మన చుట్టూ కొందరు ఇంకా బానిస భావజాలంతో ఉన్నారు. రాముడు ఓ కాల్పనిక వ్యక్తి అని వారు అంటున్నారు. అలాంటి బానిస భావజాలం ఉన్న వ్యక్తులకు చోటు ఇవ్వొద్దు. భారత్‌లో ప్రతి ఇంట్లో, ప్రతి మనసులో రాముడు ఉన్నాడు. ప్రజాస్వామ్యానికి భారత్ పుట్టినిల్లు. ఇది మన డీఎన్ఏలోనే ఉంది. శతాబ్దాల క్రితమే భారత్‌లో ప్రజాస్వామ్య విధానం ఉంది. తమిళనాడులోని ఉత్తర మేరూర్ శాసనం ప్రజాస్వామ్యం గురించి చెబుతోంది. వచ్చే వెయ్యేళ్లు భారత్ తన శక్తిని ప్రపంచానికి చాటాలి. మానవ వికాసానికి అయోధ్య కొత్త నమూనా ఇస్తుందని మోదీ వ్యాఖ్యానించారు. కాషాయ జెండా సూర్యవంశానికి చిహ్నమని, ఓం అక్షరం.. కోవింద వృక్షం .. రామరాజ్యానికి సంకేతంగా నిలుస్తుందన్నారు. సంకల్పానికి, సక్సెస్‌కు ఈ జెండా చిహ్నమన్నారు. వందేళ్ల పోరాటానికి.. రాబోయే వేల శతాబ్దాలకు ఈ జెండా రాముడి విలువలను చాటుతుందన్నారు. సత్యమే ధర్మం అని ప్రధాని మోదీ అన్నారు. వివక్ష, బాధ ఉండకూడదని, శాంతి.. సంతోషం ఉండాలన్నారు. పేదరికం ఉండకూడదని, ఎవరూ నిస్సహాయంగా ఉండరాదన్నారు. గుడికి రాలేని వారు, గుడిపై ఎగురుతున్న జెండాను చూసినా.. వారికి అంతే పుణ్యం దక్కుతుందని మన గ్రంధాలు చెబుతాయని, చాలా దూరం నుంచి కూడా జెండాను చూసి రామ్‌లల్లా పుట్టిన ప్రదేశం ఇదే అన్న ప్రేరణ పొందవచ్చు అన్నారు. ఈ అద్భుతమైన సందర్భంలో కోట్లాది మంది రామ భక్తులకు హృదయ పూర్వక గ్రీటింగ్స్ చెబుతున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. రామాలయ నిర్మాణం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రామాలయ నిర్మాణంలో పాల్గొన్న ప్రతి ఒక్క కార్మికుడు, కళాకారుడు, ప్లానర్, ఆర్కిటెక్ట్, వర్కర్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

## భారతీయులు 500 ఏళ్ల కల నెరవేరింది

### అయోధ్య కోసం ఎందరో త్యాగాలు ..బలిదానాలు

### వారి ఆత్మలకు నేటితో శాంతి చేకూరుతుంది

### ధ్వజారోహణ్ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

**అయోధ్య,నవంబర్25(సమయజ్యోతి):**

అయోధ్య రామాలయ నిర్మాణం కోసం ఎందరో త్యాగాలు చేశారని, వారి ఆత్మలు ఈరోజు సంతోషంగా ఉంటాయని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. అయోధ్యలో బాలరాముడి ఆలయ శిఖరంపై ప్రధానమంత్రి మోదీతో కలిసి కాషాయ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, ఈరోజు ఎంతో శుభదినమని, ఈ క్షణాల కోసం, రామాలయ నిర్మాణం కోసం ఎందరో త్యాగాలు చేశారని, వారి ఆత్మలకు నేటితో శాంతి చేకూరిందని అన్నారు. 'మహంత్ రాజచంద్ర దాస్ మహరాజ్, దాల్మియా, అశోక్ సింఘాల్ సహా అనేక మంది సాధువులు, విద్యార్థులు, అన్నిరంగాలకు చెందిన ప్రజలు ప్రాణత్యాగాలు చేశారు. ఆలయ నిర్మాణం కోసం వారు కన్న కలలు నేటికి ఫలించాయి' అని మోహన్ భాగవత్ అన్నారు. ఈరోజుతో ఆలయ శాస్త్రీయ పక్రియ పూర్తయిందని, ధ్వజారోహణ నిర్వహించుకున్నామని పేర్కొన్నారు. రామాలయ నిర్మాణం కోసం 500 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం కాషాయ జెండా, భగవధ్వజం, ధర్మధ్వజం ఈరోజు ఆలయ శిఖరంపై ఆవిష్కృతమైందని మోహన్ భాగవత్ అన్నారు. హిందువులు తమ సత్వగుణాన్ని 500 ఏళ్లుగా చాటుకుంటూ వచ్చారని, ఎట్టకేలకు రామ్‌లల్లా మందిర నిర్మాణం జరిగి బాలరాముడు మన కళ్లముందు ఉన్నారని అన్నారు. సత్యం, ధర్మానికి రామాలయం ప్రతీక అని పేర్కొన్నారు. మన పూర్వీకులు మనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు చెప్పుకునే రోజు ఇదని అన్నారు. ఈదేశంలో పుట్టిన వారంతా మన పెద్దసోదరులని, ఎన్నో అంచనాలతో ప్రపంచం మనవైపు చూస్తోందని, వాటిని సాకారం చేయాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. ఈ నిర్మాణం కోసం ఎంతో మంది ఆశతో ఎదురుచూశారని.. వారి సంకల్పం నేటితో నెరవేరిందని చెప్పుకొచ్చారు. ప్రపంచానికి శాంతి, శ్రేయస్సును వ్యాపింపజేసిన రామరాజ్య 'ధ్వజం' ఇప్పుడు శిఖరంపై కూర్చుందని తెలిపారు. ధ్వజం అనేది ఒక చిహ్నం అని చెప్పారు. 500 సంవత్సరాల కల ఇన్నాళ్లకు నెరవేరిందని తెలిపారు.ఇక ధ్వజారోహణ కార్యక్రమానికి ముందు ప్రధాని మోడీ, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రత్యేక పూజలు చేశారు. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, గవర్నర్ ఆనందిబెన్ పటేల్ హాజరయ్యారు.రామ జన్మభూమి ట్రస్ట్ సభ్యుల సమక్షంలో జెండా ఆవిష్కరణ జరిగింది. సాధువులు, ప్రముఖులు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరయ్యారు.'ధ్వజ్ ఆరోహణ్' కార్యక్రమంలో భాగంగా జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ జెండా లంబకోణ త్రిభుజాకారంలో సూర్యుని చిహ్నాన్ని కలిగి ఉంది. శాశ్వత శక్తి, దైవిక తేజస్సు, ధర్మం, జ్ఞానోదయాన్ని సూచిస్తుంది. శ్రీరాముడితో సంబంధం ఉన్న అన్ని లక్షణాలు ఈ జెండాలో కనిపిస్తాయి. 'ఓం' చిహ్నంతో చెక్కబడిన జెండాను ఆలయ 'శిఖర్' పైన ఉంచారు.

మొదటిపేజీ తరువాయి

## ఓఆర్ఆర్ లోపలా, బయట ఉన్న మున్సిపాలిటీల విలీనం

దీంతో హైదరాబాద్ పరిధి మరింత పెరుగుతందన్నారు. అంతేకాకుండా మరో విద్యుత్ డిస్కమ్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రులు తెలిపారు. కొత్త డిస్కమ్ పరిధిలోకి లిఫ్ట్ ఇరిగేషన్ కనెక్షన్లు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై, వ్యవసాయ కనెక్షన్లు, మిషన్ భగీరథ కనెక్షన్లు వస్తాయన్నారు. వచ్చే పదేళ్లలో విద్యుత్ డిమాండ్‌కు అవసరమైన ఏర్పాట్లపై చర్చినట్లు వివరించారు. ఈ క్రమంలోనే 3వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలు చేయాలని, ఈ మేరకు త్వరలోనే టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ క్రమంలో 2 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్



కొనుగోలుకు కేబినేట్ ఆమోదించింది. పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ విభాగంలో పెట్టుబడుల ఆహ్వానించాలన ఇనిర్ణయించారు. రాష్ట్రంలో పలు చోట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలున్నాయి. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ముందుకొచ్చే కంపెనీలు, పెట్టుబడిదారులకు అనుమతి ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటికే డిస్కమ్‌ల వద్ద ఉన్న ఎంవోయూలను కూడా పరిశీలించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 10 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి ప్రదర్శించే కంపెనీలకు ప్రభుత్వమే అవసరమైన భూమిని కేటాయించి, నీళ్లను అందిస్తుంది. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి చేసే విద్యుత్‌ను ముందుగా మన డిస్కమ్‌లకే అమ్మాలనే షరతుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుంది.కొత్త పరిశ్రమలకు సొంతగా విద్యుత్ తయారీ చేసుకునేందుకు అనుమతి ఇవ్వనున్నారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రామగుండంలో 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం కోసం కేబినేట్ ఆమోదించింది. పాల్వంచ, మక్తల్‌లోనూ ప్లాంట్ల నిర్మాణ అవకాశాలపై పరిశీలన చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్‌ను 3 సర్కిళ్లుగా విభజించి భూగర్భ కేబుల్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయించారు. భూగర్భ విద్యుత్ వ్యవస్థతోపాటు టీ ఫైబర్ కేబుళ్ల ఏర్పాటు చేయనున్నారు. భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం పెద్దనల్లవెల్లిలో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటుకు 20 ఎకరాల స్థలం కేటాయింపునకు ఆమోదించారు. అలాగే ములుగు జిల్లా జగ్గన్నపేటలో స్పోర్ట్స్ స్కూల్‌కు 40 ఎకరాలు కేటాయింపు ఇవ్వనున్నారు. జూబ్లీహిల్స్‌తోపాటు రాష్ట్రంలో మరికొన్ని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల ఏర్పాటుకు నిర్ణయించారు.

మొదటిపేజీ తరువాయి

## ఈస్టర్న్ ఇండియా టెక్ హబ్‌గా బీహార్

డిఫెన్స్ కారిడార్, సెమీకండక్టర్ తయారీ పార్క్, గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు, మెగా టెక్ సిటీ, ఫిట్‌నెస్ సిటీ ఏర్పాటుతో బీహార్‌ను ఈస్టర్న్ ఇండియా టెక్ హబ్‌గా తయారు చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు సీఎస్ తెలిపారు. న్యూఏజ్ ఎకానమీ కింద రాబోయే ఐదేళ్లలో గ్లోబల్ వర్క్‌ప్లేస్‌గా బీహార్‌ను అభివృద్ధి చేయనున్నామని, ఈ లక్ష్య సాధనకు డెడికేటెడ్ కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

స్టార్టప్ డొమైన్‌లో రాష్ట్రంలోని ప్రతిభా వంతులు, యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా ప్రణాళికలు రూపొందించేందుకు ఒక కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేశామని తెలిపారు. ఏఐ డొమైన్‌లో కూడా బీహార్‌ను లీడింగ్ స్టేట్‌గా తీర్చిదిద్ద నున్నామని, ఇందుకు అవసరమైన ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ మిషన్‌కు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపిందని సీఎస్ తెలిపారు. సోనెపూర్, సీతామర్హితో సహా 12 సిటీల్లో గ్రీన్‌ఫీల్డ్ టౌన్‌షిప్ ప్రాజెక్టులను ప్రారంభించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మూతపడిన 9 చక్కెర మిల్లులను పునరుద్ధరించాలని, 25 కొత్త మిల్లలను ఏర్పాటు చేయాలని కూడా క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని చీఫ్ సెక్రటరీ వివరించారు.

## మోగిన స్థానిక ఎన్నికల నగారా

### మూడు విడతల్లో ఎన్నికల నిర్వహణ

### డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్

### అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్

### రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడి

**హైదరాబాద్,నవంబర్25(సమయజ్యోతి):**

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకునోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. మంగళవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మొత్తం మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించబోతున్నట్లు చెప్పారు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్ నిర్వహించబోతున్నట్లు చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ నేటి నుంచే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 29న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాం. కొన్ని కారణాల వల్ల అక్టోబర్ 9న షెడ్యూల్‌పై స్టే విధించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ ఓటర్లు 1.66 కోట్ల మంది ఉన్నారు. 4,200 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు తొలి దశలో ఎన్నికలు నిర్వహిస్తాం అని ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. గురువారం నుంచి తొలి విడత పోలింగ్‌కు సంబంధించిన నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడత ఎన్నికలకు ఈ నెల 30 నుంచి, మూడో విడత ఎన్నికలకు డిసెంబర్ 3 నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడతలో 4,333 సర్పంచ్ స్థానాలు, 38,350 వార్డులకు పోలింగ్ జరగనుండగా.. మూడో విడతలో 4,159 సర్పంచ్ స్థానాలు, 36,452 వార్డులకు పోలింగ్ నిర్వహించనున్నారు.

## చెక్ డ్యామ్ కూల్చివేత ఇసుక మాఫియా పనే

కాంగ్రెస్ హయంలో చెరువులు, చెక్ డ్యామ్‌ల పేల్చివేత నిత్య చర్యగా మారిందన్నారు. గతంలో పెద్దపల్లి భోజన్న పేట వద్ద హుస్సేన్ మియావాగుపై కూడా చెక్ డ్యామ్ పేల్చివేశారని ఆరోపించారు. గుంపుల వద్ద చెక్ డ్యామ్ కూడా కులలేదని.. పేల్చారని ఇక్కడి రైతులే చెప్తున్నారన్నారు. ఇసుక మాఫియానే కూల్చివేసిందని, కాంగ్రెస్ పాలనలో వేల కొద్ది లారీల్లో ఇసుక తరలిస్తున్నారన్నారు. రాత్రికి రాత్రి చెక్ డ్యామ్ పేల్చేశారని.. భోజన్నపేటలో హుస్సేన్ మియావాగుపై చెక్ డ్యామ్ పేల్చివేస్తుంటే రైతులే పట్టుకున్నారన్నారు. అప్పుడు రైతులే కేసులు పెట్టారని.. పోలీసులు ఇప్పటివరకు దోషులను పట్టుకోలేదని ఆరోపించారు. తాజాగా మరో చెక్ డ్యామ్ పేల్చారని.. అప్పుడే పోలీసులు దోషులను శిక్షిస్తే.. ఈ రోజు గుంపుల చెక్ డ్యామ్‌కు ఈ పరిస్థితి రాకుండేదన్నారు. ఈరోజు వరకు పోలీసులు వాళ్లను పట్టుకోలేదని.. మూడు రోజులు అయిన ఇక్కడి పేల్చువేత దోషులను పోలీసులు పట్టుకోలేకపోయారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ వాళ్లను కాపాడుతుందని.. ఆనాడు గుండాలను అరెస్ట్ చేస్తే ఈ రోజు ఇక్కడి చెక్ డ్యామ్ పేల్చకపోయేవాళ్లని.. హైదరాబాద్‌లో ఇండ్లు, ఇక్కడ చెరువులు, చెక్ డ్యామ్‌లు కూలగొడుతున్నారన్నారు. కేసీఆర్ కట్టుడు.. కాంగ్రెసోళ్ల కూలగొట్టుడని.. మానేరు నది మీద చెక్ డ్యామ్‌లు కట్టి సస్యశ్యామలం చేశామన్నారు. పొంగులేటి శ్రీనివాస్‌కు చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ కట్టిందని.. చర్యలు తీసుకోవాలంటే పొంగులేటిపై తీసుకోవాలన్నారు. రాఘవ కంపెనీని బ్లాక్ చేయాలన్నారు. పొంగులేటి నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఏడాదికి 6 లక్షల ఎకరాలు నీళ్లు ఇస్తామని ఉత్తమ్ కుమార్ చెప్పిండని.. ఎక్కడ ఇచ్చారో చెప్పాలన్నారు. కమిషన్ల పేరిట కాలయాపన చేస్తున్నారని.. రెండేళ్లు అయిన కాళేశ్వరం రిపేర్ చేయడం లేదని.. కాళేశ్వరం కింద ఉన్న కాలువలు తవ్వడం లేదన్నారు. కాలువలు తవ్వితే కేసీఆర్‌కు పేరు వస్తుందని రైతును గోసపెడుతున్నారన్నారు. కాళేశ్వరం కూలిందని రేవంత్ రెడ్డి అంటున్నాడని.. మల్లన్న సాగర్ నుంచి హైదరాబాద్‌కు తీసుకుపోతున్న నీళ్లు కాళేశ్వరంవికావా అంటూ ప్రశ్నించారు. ఈ బ్లాస్టింగ్స్ చూస్తే కాళేశ్వరం కూడా పేల్చారని అనుమానం వస్తుందన్నారు. పెద్దపల్లిలో జిలిటెన్ స్టిక్స్‌తో కాంగ్రెస్ నాయకులు రెడ్ హ్యాండెడ్‌గా దొరికారని.. ఇసుక మాఫియాతో రూ.24 కోట్లు రికవరీ చేయాలన్నారు. ఎండాకాలం లోపే చెక్ డ్యామ్ నిర్మించాలని.. ఇసుక మాఫియాలో మంత్రుల వాటా ఉందని.. రాత్రిపూట పెద్దశబ్దం వినపడిందని అని మత్స్యకారులు చెప్తున్నారన్నారు. లక్ష క్యూసెక్కుల వరద వస్తే కూడా ఈ చెక్ డ్యామ్ చెక్కు చెదరలేదన్నారు. కూలితే రాత్రే ఎందుకు కూలింది? కూలలేదు కూల్చారు అంటూ ఆరోపించారు. కాంగ్రెస్‌కు రైతుల కన్నా ఇసుక మాఫియా ముఖ్యమన్నారు. టెర్రరిస్టులు కూడా ఇలాంటి పనులు చేయరని, టెర్రరిస్టులకు మించిపోయారని.. ఇసుక మాఫియా దోషులను శిక్షించకుంటే రాష్ట్రంలో మరిన్ని చెక్ డ్యామ్‌లు పేలుస్తారన్నారు. కేసీఆర్‌పై కోపంతో రాష్ట్ర రైతుల నోట్లో మట్టికొడుతున్నారని.. కాళేశ్వరం కూలిందని రేవంత్‌రెడ్డి అంటున్నాడని.. కాళేశ్వరంలో భాగంగా కట్టిన మల్లన్న సాగర్ నుంచి రూ.8వేల కోట్లతో హైదరాబాద్‌కు పైపులైన్ వేస్తా అంటున్నాడన్న హరీశ్‌రావు.. మల్లన్న సాగర్ ఎవరు కట్టారు నీ తాత కట్టిండా..? కేసీఆర్ కాదా? అంటూ ప్రశ్నించారు. ఇసుక మాఫియాపై ఉన్నత స్థాయి విచారణ జరగాల్సిందేనన్నారు. నిందితులు ఎవరైనా వారి నుంచి రూ.24కోట్లు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

మొదటిపేజీ తరువాయి

### 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు

## హిల్ట్ పాలసీ

దాదాపు 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు హిల్ట్ పాలసీని తీసుకొస్తున్నారని కేటీఆర్ తెలిపారు. దాదాపు ఆ భూములన్నింటికీ రేవంత్ సోదరులు, అనుయాయులు ఒప్పందాలు చేసుకున్నారని పేర్కొన్నారు. లక్షన్నర గజం విలువ చేసే భూమికి 10 వేలు కడితే చాలని పాలసీ తెచ్చారని తెలిపారు. పారిశ్రామిక వాడల భూములను అమ్మి 4-5లక్షల కోట్ల కుంభకోణం చేయాలని చూస్తున్నాడని అన్నారు. అంబానీ, అదానీలను ఒకే దెబ్బకు క్రాస్ చేయాలని రేవంత్ రెడ్డి స్కెచ్ వేశారని తెలిపారు. రేవంత్ రెడ్డి మనుమలు, మునిమలు కూర్చొని తిన్నా కూడా అరిగిపోని ఆస్తిని వెనకేసుకోవాలని ఈ స్కామ్‌కు తెరతీశాడని చెప్పారు. 50-60 ఏళ్లుగా హైదరాబాద్‌లో 21 పారిశ్రామికవాడలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ప్రజల భూములు తీసుకుని ప్రభుత్వం పరిశ్రమలకు ఇచ్చిందని చెప్పారు. నగరం విస్తరిస్తున్న కొద్దీ పరిశ్రమలు మధ్యలోకి వచ్చాయని తెలిపారు. మేం అధికారంలో ఉన్నప్పుడు కూడా పారిశ్రామిక భూముల రెగ్యులరైజేషన్ ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. కాలుష్యం లేని పరిశ్రమలు లేదా కంపెనీలు ఏర్పాటు చేయాలని సూచించామని చెప్పారు. అందుకే మేం గ్రిడ్ పాలసీ తీసుకొచ్చామని చెప్పారు. గతంలో 50 శాతం ఐటీ ఆఫీసులకు, 50 శాతం ఇతర అవసరాల కోసం ప్రభుత్వానికి తగిన ఫీజులు కట్టినంకనే అవకాశం ఇచ్చామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రైవేటు వ్యక్తుల లాభం కోసం ధారాదత్తం చేస్తోందని అన్నారు. భూదందాపై విద్యార్థి నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. హిల్ట్ పాలసీపై కౌన్సిల్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు నిలదీశారని కేటీఆర్ గుర్తుచేశారు.తెలంగాణ వనరులను కాపాడుకునే బాధ్యత విద్యార్థులకు కూడా ఉందని తెలిపారు. విద్య, ఉపాధి, కాంట్రాక్టులు, రాజకీయాల్లో 42 శాతం కోటా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు కాంగ్రెస్ అనేక హామీలిచ్చిందని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల పెంపు కోర్టు ఆపింది.. మిగతావి ఎవరు ఆపారని ప్రశ్నించారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే ముస్లింలందరికీ న్యాయం జరుగుతుందా అని ప్రశ్నించారు. ముస్లింలకు 4 వేల కోట్లు బడ్జెట్‌లో పెడతామని.. పెట్టలేదని మండిపడ్డారు.తెలంగాణపై బీఆర్ఎస్‌కు ఉన్న ప్రేమ ఏ పార్టీకి ఉండదని కేటీఆర్ అన్నారు. తెచ్చిన తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే అని పేర్కొన్నారు. తెలంగాణ వనరులను కాపాడుకునే బాధ్యత విద్యార్థులకు కూడా ఉందని తెలిపారు. కాంగ్రెస్ అరాచకాలపై విద్యార్థి రణభేరీ మోగించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. నాయకులు సమాజం నుంచి వస్తారు.. నాయకుల చుట్టూ తిరిగితే నాయకులు కారని వ్యాఖ్యానించారు.

మొదటిపేజీ తరువాయి

## బీహార్ ప్రయోగాలు మా వద్ద పనిచేయవు

### బెంగాల్‌ను టచ్ చేస్తే అగ్నిగుండమే

### సర్ ప్రక్రియపై కేంద్రానికి మమత హెచ్చరికలు

**కోల్‌కతా,నవంబర్25(సమయజ్యోతి):**

బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ ఫలితంగానే ఎన్డీయే విజయం సాధించిందని, బీజేపీ 'గేమ్'ను అర్థం చేసుకోవడంలో విపక్షాలు విఫలమయ్యాయని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. ఎన్నికల కమిషన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు వ్యతిరేకంగా బనగావ్ లో మంగళవారంనాడు భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బెంగాల్‌లో బీజేపీ గేమ్‌లు చెల్లవని అన్నారు. 'బిహార్‌లో ఎన్నికలు జరిగాయి. పాపం..అక్కడి ప్రతిపక్ష నాయకులు బీజేపీ గేమ్‌ను గ్రహించలేకపోయారు. కానీ మాకు వాళ్ల గేమ్‌లు ఏమిటో బాగా తెలుసు. వాళ్ల ఆటలు బెంగాల్‌లో ఎంతమాత్రం సాగవు. బెంగాల్‌ను టచ్ చేయాలని చూస్తే మేము యావద్దేశాన్ని కుదిపేస్తాం' అని సీఎం తీవ్ర స్వరంతో అన్నారు. ఎస్ఐఆర్ పక్రియతో బంగ్లాదేశీ హిందువులకు సమస్యలు సృష్టించాలని అనుకుంటున్నారని, ఎస్ఐఆర్ కారణంగా 35 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. డూప్లికేట్ ఓటర్లను సృష్టించేందుకు కృత్రిమ మేధస్సును వాడుతున్నారని, ఇది బీజేపీ ప్లాన్ అని ఆరోపించారు. ఎస్ఐఆర్ పక్రియను ఇంత హడావిడిగా చేపట్టడాన్ని మమతా బెనర్జీ తప్పుపట్టారు. హడావిడి వ్యవహారంతో ఓటర్ల జాబితా నుంచి ప్రజలను తప్పించాలని చూస్తే బీజేపీని విడిచిపెట్టేది లేదని అన్నారు. ఇప్పటి ఓటర్ల జాబితాతోనే 2024లో ప్రధాని ఓట్లు సంపాదించారని, ఇప్పుడు అదే ఓటర్లను తప్పిస్తే.. కేంద్ర ప్రభుత్వాన్ని కూడా తప్పించాలని అన్నారు. తాను ఇక్కడ ఉన్నంత వరకూ ప్రజలను ఓటర్ల జాబితా నుంచి ఎవరూ తప్పించలేరని స్పష్టం చేశారు. దేశంలో చొరబాటుదార్ల ప్రవేశంపై మమతా బెనర్జీ మాట్లాడుతూ, ఈ విషయంపై తనను ప్రశ్నించాల్సిన పనే లేదని, కేంద్ర ఏజెన్సీలే సరిహద్దులను నిర్వహిస్తున్నాయని అన్నారు. రైల్లు, విమానాలు, సరిహద్దుల భద్రత సెంట్రల్ ఏజెన్సీలే చూసుకుంటాయని, పాస్‌పోర్టులు, కస్టమ్స్, ఎక్సైజ్ జాగ్రత్తలు తీసుకునేది కేంద్ర ప్రభుత్వమేనని అన్నారు.

## బీజేపీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులను ఏకగ్రీవం చేస్తే....

# 10 లక్షల ప్రోత్సాహక నిధులిస్తా

## కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నజరానా

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బంపర్ ఆఫర్ ప్రకటించారు. పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే... ఆ గ్రామాభివృద్ధి కోసం ప్రత్యేకంగా రూ.10 లక్షల నిధులను అందజేస్తానని కేంద్ర మంత్రి ప్రకటించారు. తాను ఒక్కసారి మాట ఇస్తే తప్పే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ ప్రజలను ఏకం చేసి అభివృద్ధి వైపు దృష్టి సారించేలా ప్రోత్సహించేందుకే ఈ నిధులను ప్రకటించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు బండి సంజయ్ ఈరోజు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటన సారాంశం ఇలా ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు రూ.5 లక్షల ప్రోత్సాహక నిధులిస్తామని హామీ ఇవ్వడంతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో దాదాపు 70 గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థులను ఏకగ్రీవం చేశారు. కానీ ఐదేళ్లయినా ఆయా గ్రామాలకు కేసీఆర్ ప్రభుత్వం నయాపైసా ఇవ్వకుండా మొండి చేయి చూపింది. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సైతం ఏకగ్రీవం పేరుతో నజరానా ప్రకటించి మోసం చేసింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకుల మాటలు నమ్మి ఏకగ్రీవం చేసిన పంచాయతీల ప్రజలు ఆర్థికంగా నష్టపోయారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. దయచేసి ఈ ఎన్నికల్లో మరోసారి మోసం చేసేందుకు ఆ రెండు పార్టీలు మళ్లీ ప్రలోభ పెట్టేందుకు సిద్ధమవుతున్నాయి. మాయ మాటలు నమ్మి మోసపోవద్దని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలను కోరుతున్నా. బిజెపి మాట ఇస్తే తప్పదు. మీ బండి సంజయ్ ఎన్నడూ చేసేదే చెబుతాడు. చెప్పేదే చేస్తాడు. ఇచ్చిన మాట ప్రకారం ఈ పంచాయతీ ఎన్నికల్లో బిజెపి బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులుగా ఏకగ్రీవం చేస్తే ఆ గ్రామాలకు రూ.10 లక్షల చొప్పున ప్రోత్సాహక నిధులిస్తానని మాట ఇస్తున్నా. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ప్రజల ముందు కొన్ని వాస్తవాలు ఉంచుతున్నా. కాంగ్రెస్ 2 ఏళ్ల పాలనలో గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నయాపైసా ఇయ్యలేదు. "రాష్ట్ర ప్రభుత్వం దగ్గర పైసల్లేవు. నన్ను కోసినా నయాపైసా రాదు"అని సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడమే ఇందుకు నిదర్శనం. అట్లాగే బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలోనూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి పైసా ఇయ్యలేదు. అప్పులు తెచ్చి అభివృద్ధి చేసిన సర్పంచులకు బిల్లులు రాక అప్పులపాలై ఆత్మహత్య చేసుకునే దుస్థితి ఏర్పడటమే నిదర్శనం. గ్రామాల అభివృద్ధి నిధులు ఇస్తోంది నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రమే. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ కేంద్ర నిధులతో కొనసాగుతున్నవే. భవిష్యత్తులోనూ గ్రామాలకు నిధులిచ్చేది కేంద్ర ప్రభుత్వమే. అసలు పంచాయతీ ఎన్నికలు నిర్వహించేది కూడా కేంద్ర నిధుల కోసమేననే వాస్తవాన్ని ప్రజలు గుర్తించాలని కోరుతున్నా. పంచాయతీ ఎన్నికలు జరగకపోతే కేంద్ర నిధులు రావనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తోందే తప్ప వాస్తవానికి స్తానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే చిత్తశుద్దే లేదు. ఇక ఎమ్మెల్యే, ఎంపీల విషయానికొస్తే.... ఎమ్మెల్యేలకు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసు కునేందుకు ప్రత్యేకంగా నిధులు లేవు.



గతంలో ఇచ్చిన నియోజకవర్గ అభివృద్ధి నిధులను ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. ఫలితంగా ఎమ్మెల్యేగా గెలిచినా పంచాయతీలకు నయా పైసా కూడా ఇయ్యలేని పరిస్థితి. కానీ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న నాకు ఎంపీ లాడ్స్ నిధులు ఉన్నాయి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బుల్ (సీఎస్సార్) ఫండ్ రూపంలో పెద్ద ఎత్తున కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చి ఇప్పటికే విద్య, వైద్య రంగాలను అభివృద్ధిచేసేందుకు ఖర్చు చేస్తున్న విషయం మీకు తెలిసిందే. ఈ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులను ఏకగ్రీవం చేసినట్లయితే... ఆయా గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తా. పూర్తిస్థాయిలో ఆ గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా. దీంతోపాటు కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నందున కేంద్రాన్ని ఒప్పించి మరిన్ని నిధులు తెచ్చి పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తా. చివరగా ఒక్కమాట.... నిధులు ఇచ్చేది, తెచ్చేది బీజేపీ మాత్రమే. మరి అట్లాంటప్పుడు ఇతర పార్టీలు బలపర్చిన అభ్యర్థులకు ఓటేసి ఏం లాభం? పొరపాటున కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపిస్తే కొత్తగా నిధులు రాకపోగా, కేంద్రం నుండి వచ్చే నిధులను కూడా దారి మళ్లించే ప్రమాదముంది. అందుకే మాయ మాటలు నమ్మకండి. ప్రలోభాలకు మోస పోకండి. పొరపాటు చేస్తే 5 ఏళ్ల పాటు నరక యాతన తప్పదు. అందుకే ఆలోచించి నిర్ణయం తీసుకోండి. బీజేపీ బలపర్చిన అభ్యర్థులకు ఓటేసి గెలిపిద్దాం. మన గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందాం.

## గోపాలకృష్ణ మఠ రథోత్సవంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

గోపాలకృష్ణ మఠం నుండి ప్రారంభమైన రథోత్సవంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు.మంగళవారం పట్టణంలో ప్రారంభమైన ఉత్సవ రథానికి ఆయన కొబ్బరికాయ,పూలమాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



## ప్రభుత్వ వడ్డీ లేని రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.

### - ఎమ్మెల్యే పాయల్ శంకర్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ప్రభుత్వ వడ్డీలేని రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పిలుపునిచ్చారు.మంగళవారం ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జి) మహిళలకు వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి,రాజేశ్వర్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,మహిళలను వ్యాపారాల వైపు దారితీసి కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందిస్తున్నదని తెలిపారు.జిల్లాకు కేటాయించిన 3.03 కోట్లు విలువైన రుణాలకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.రుణాలను వ్యక్తిగత అవసరాల కోసం కాకుండా వ్యాపారం కోసం వినియోగించాలని సంఘాలకు సూచించారు.ఎస్ హెచ్ జి లను దత్తత తీసుకుని వ్యాపారాభివృద్ధికి మార్గనిర్దేశం చేస్తానని ఆయన పేర్కొన్నారు.అదనపు కలెక్టర్ శ్యామలాదేవి మాట్లాడుతూ,కుటుంబం,సమాజం అభివృద్ధి మహిళ ఆర్థిక స్థితిపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.ఎస్ హెచ్ జి మహిళలు బస్సులు,పెట్రోల్ పంపులు వంటి రంగాల్లో కూడా యజమానులు అయ్యే అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని తెలిపారు.మహిళలు ప్రతి రంగంలో రాణించాలని,పొదుపు అలవాటు పెంపొందించుకోవాలని అదనపు కలెక్టర్ రాజేశ్వర్ సూచించారు.అనంతరం ఎమ్మెల్యే,అధికారులు కలిసి 3.03 కోట్ల విలువైన వడ్డీ లేని రుణాల చెక్కులను మహిళా సంఘాలకు అందజేశారు.ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్,ఎంపీడీవో వంశీ కృష్ణ,మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పాత పద్ధతి ప్రకారమే ఎస్సీలకు రెండు సీట్లు కేటాయించాలి...

### మంత్రి వాకిటి శ్రీహరిని కోరిన మండల ఎస్సీ నాయకులు

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ..... నారాయణ పేట జిల్లా**

తెలంగాణ ప్రభుత్వం 2025 గ్రామపంచాయతీ యెక్క స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ను విడుదల చేయడానికి రిజర్వేషన్ ప్రక్రియ ప్రారంభించడం జరిగింది. ఇట్టి ఎలక్షన్ కమిషనర్ మరియు ప్రభుత్వం 2019 ఎన్నికలు పాత పద్ధతి ప్రకారం రిజర్వేషన్ అమలు చేసి 2025 గ్రామపంచాయతీ స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహిస్తామని గెజిట్ విడుదల చేసింది. కృష్ణ మండలంలోని 13 గ్రామపంచాయతీలకు గాను ఇట్టి రిజర్వేషన్ ప్రకారం 2019 సంవత్సరంలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో కృష్ణ మండలానికి 2 స్థానాలను ఎస్సీలకు కేటాయించి జరిగింది. ప్రస్తుత 2025 స్థానిక సంస్థల ఎన్నికల్లో 13 గ్రామ పంచాయతీలకు గాను ఎస్సీలకు 1 స్థానాని మాత్రమే కేటాయించి మిగత 12 స్థానాలను మిగతా కులాలకు కేటాయించడం జరిగింది. పక్కన ఉన్న మాగనూర్ మండలంలోని 2019 స్థానిక గ్రామపంచాయతీ ఎన్నికల్లో 3 స్థానాలను కేటాయించారు. ప్రస్తుత 2025 స్థానిక గ్రామపంచాయతీ ఎన్నికల్లో కూడా 3స్థానాలను కేటాయించడం జరిగింది.కానీ కృష్ణ మండలంలో ఉన్న ఎస్సీలకు 2 స్థానాలను తీసేసి 1 స్థానాన్ని కేటాయించి అన్యాయం చేశారని కృష్ణ మండల ఎస్సీ నాయకులు మంగళవారం హైదరాబాద్ లోని మంత్రి వాకిటి శ్రీహరి నివాసంలో కృష్ణ మండల ఎస్సీ నాయకులు కలిసి మంత్రి గారికి వివరించి తమ గొడును వెల్లబోసుకున్నారు. అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ఈరోజు శాసనసభలో చర్చించి,ఎలక్షన్ కమిషనర్ తో మాట్లాడుతానన్నారు.2 స్థానాలు కేటాయించే విధంగా అధికారులతో మాట్లాడుతనాని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీపీ లింగప్ప, పల్లె సురేష్, కర్కు బస్వారాజ్, ఉషేనప్ప, డీలర్ శ్రీను,చందు పాల్గొన్నారు.



## పిన్నంచర్ల గ్రామంలో ఇందిరమ్మ చీరల పంపిణీచేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం. డి. రహమాతుల్లా.

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆత్మకూరు వనపర్తి జిల్లా.**

పిన్నంచర్ల గ్రామంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.డి. రహమతుల్లా పంపిణీ చేశారు.ఈ సందర్బంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి అయన మాట్లాడుతూ ప్రజాపాలన భాగంగా మహిళలకు సంబంధించిన అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో మండలంలోని అన్ని గ్రామాలలో చీరల పంపిణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ప్రతి మహిళ ఆర్థికంగా బలోపేతం చేయడానికి, వడ్డీ లోని మహిళా సంఘాలకు బ్యాంకు లోన్లు, ప్రత్యేకంగా మహిళ పెట్రోల్ బంకులను, మహిళ సమైక్యలకు సోలార్ ప్లాంట్లు, బస్సులు, అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశ పెడుతూ, మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి మీరందరూ అండగా ఉండాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుర్వ జంగన్న, మున్నూరు శ్రీనివాసులు, విజయలక్ష్మి, ఖాజన్న,కుర్వ విష్ణు, కుర్వ సత్తన్న,జగన్మోహన్, వడ్ల రాములు, ఉపేందర్ గౌడ్, శ్రీకాంత్, వెంకటన్న, వెంకటేష్, బుక్ కీపర్ ఇంద్రావతి, రవి, పంచాయతి కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ కు సన్మానం

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా సంగీతం శ్రీనివాస్ నియామకం కాగా, జిల్లా మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ముస్తాబాద్ మండల పోతుగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి నర్సింహులు, డిసిసి అధ్యక్షులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



## ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

### : ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్ఓ), అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్(ఏఆర్ఓ)లకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ హాజరై మాట్లాడారు. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ స్వీకరణ, పరిశీలన, స్క్రూటినీ, అప్పీళ్ళ పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా అవసరమైన మార్గదర్శకాల ప్రకారం చేయాలని సూచించారు. శిక్షణలో డీపీఓ శర్ఫుద్దిన్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## అవార్డు పొందినందుకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను అభినందించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో నవంబర్ 25.**

జలసంచాయ్%-%జనభాగీదారీ అవార్డును జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఇటీవల న్యూఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ చేతుల మీదుగా స్వీకరించిన సందర్భంగా, గురువారం సాయంత్రం కలెక్టరేట్ చాంబర్‌లో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌ను కూడా ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కేక్ కట్ చేయించి అభినందనలు తెలిపారు. జిల్లాకు ఇలాంటి ప్రతిష్టాత్మక అవార్డు లభించడం పట్ల ఎస్పీ సంతోషాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ"జిల్లా అభివృద్ధి దిశగా ఇటువంటి విజయాలు మరింత వేగం తీసుకొస్తాయి. మున్ముందు ఇంకా రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తూ, జిల్లా ప్రతిష్టను మరింత ఎత్తుకు తీసుకెళ్లేందుకు పోలీసు శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తాం" అని తెలిపారు.




## సంపాదకీయం

### తెలంగాణలో
# మొదలవుతున్న పంచాయితీ !

పంచాయితీ ఎన్నికలే లక్ష్యంగా అధికార పార్టీల పావులు కదుపుతోంది. రెండుమూడు రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కొడంగల్ సభలో స్వయంగా ప్రకటించారు. ఇప్పటికే ఇందిరమ్మ చీరల పంపిణీ మొదలయ్యింది. ఊరూవాడా ఈ జాతర సాగుతోంది. మంగళవారం నుంచి మహిళలకు వడ్డీరహిత రుణాల జాతర మొదలయ్యింది. నియోజకవర్గాల వారీగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ పనిలో పడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల వ్యవహారం మరోవైపు సాగుతోంది. ఇదంతా కేవలం పంచాయితీ ఎన్నికల కోసమే అని వేరుగా చెప్పనక్కరలేదు. ఈ క్రమంలో బిసి రిజర్వేషన్లు వెనక్కి పోయాయి. పార్టీపరంగా 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించారు. ఉరిమురిమి మంగళం మీద పడ్డట్లు రిజర్వేషన్లు అమలు కాకపోవ డానికి బిజెపి కారణమని తప్పించుకోజూస్తున్నారు. 42శాతం రిజర్వేషన్ల హామీ కాంగ్రెస్ పార్టీ ఇచ్చింది. దానిని ఎలా అమలు చేస్తారో కూడా తెలియకుండా నానా రకాల ఫీట్లు చేసి, చివరకు కోర్టుల్లో భంగపాటుకు గురయ్యారు. కేంద్రం ఆమోదించకపోవడం వల్లనే ఇలా జరిగిందని సాకులు చూపారు. నిజంగానే రిజర్వేషన్ల వ్యవహారం ఎలా ఉంటుందో తెలియంది కాదు. 50 శాతంనకు మించి రిజర్వేషన్లు అమలు చేయడం కుదరదు. దీనికి నిబంధనలు ఉన్నాయి. అవన్నీ పక్కన పెట్టి లాయర్లకు, కోర్టులకు డబ్బులు తగలేసి, చివరకు ఎన్నికలు ఆసల్యంగా జరపడానికి సిద్ధం అయ్యారు. అదికూడా నిధులు రాకపోతే ఎలా అన్న మీమాంసలో ముందుకు వెళ్లడం తప్ప చిత్తశుద్ధితో కాదు. పంచాయితీల పాలన ముగిసి దాదాపు రెండేళ్లు కావస్తోంది. ఈ క్రమంలో బిసి రిజర్వేషన్ల పేరిట నానా హంగామా చేసి, ఇప్పుడు మళ్లీ పాతపద్దతి లోనే పంచాయితీ ఎన్నికలకు సిద్ధం అయ్యారు. మొత్తంగా ఇదంతా ఊహించినట్టే జరిగింది. 42 శాతం కోటా పేరిట ఊదరగొట్టి.. చివరికి పాత పద్ధతిలో 25 శాతానికి బీసీ కోటాను పరిమితం చేసి ఎన్నికలకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. ఇకపోతే బిసి కులగణన పేరుతోనూ నానా విధాలుగా వక్రీకరణలు జరిగాయి. అసలు సర్వే సంపూర్ణంగా సాగలేదు. 1948 చట్టం ప్రకారం జనాభా గణన చేపట్టే అధికారం కేంద్రానికి మాత్రమే ఉన్నది. ఎలాంటి జనగణన నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు లేవు. ఒకవేళ చేసినా ఆ గణాంకాలకు చట్టబద్ధత ఉండకపోవడమేగాక, అమలు చేసే అవకాశం కూడా లేదు. మరోవైపు, కేంద్ర ప్రభుత్వమే గణాంకాల సేకరణ చట్టం–2008 ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు డాటా సేకరణకు కొన్ని పరిమిత అధికారాలను బదలాయించింది. ఒకవేళ రాష్ట్రం నిర్వహించాలని భావించినా అందుకు కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. అంతేకాదు, సేకరించిన డాటా వెల్లడిపై కూడా అనేక ఆంక్షలను విధించింది. రాష్ట్ర ప్రభుత్వం పేరుకు ఇంటింటి సర్వే అని చెప్పి రాష్ట్రవ్యాప్తంగా జనాభాగణననే నిర్వహించి అందరినీ మభ్యపెట్టిందని విపక్షాలు ఇప్పటికే ఆరోపించాయి. కేంద్రం సర్వేకు అంగీకరించడంతో అదీ తమ ఘనతే అని చెప్పు కున్నారు. కేంద్రం మెడలు వంచామని బుకాయించారు. రాహుల్ నామ జపంతో సమస్యలు పక్కదారి పట్టిస్తున్నారు. మొత్తంగా ఇప్పుడు గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాల రిజర్వేషన్ల ఖరారులో పూర్తి గందరగోళం నెలకొన్నది. సర్కారు జారీచేసిన మార్గదర్శ కాలకు విరుద్ధంగా జిల్లాల్లో ఎక్కడికక్కడ అధికారులు ఇష్టారీతిన రిజర్వేషన్లను ఖరారు చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. తొలిదశలో నోటిఫికేషన్ జారీ చేసినప్పుడు ఎస్సీ, ఎస్టీలు ఒక్కరూ లేనిచోట కూడా ఆ వర్గాలకు స్థానాలను రిజర్వ్ చేయడం, పూర్తిగా ఎస్టీలే ఉన్నచోట ఇతర వర్గాలకు రిజర్వ్ చేయడం చూశాం. ఇప్పుడు కూడా అలాంటి విమర్శలే వస్తున్నాయి. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 50 శాతానికి మించకుండా ఎస్టీ, ఎస్సీ, బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీవో–46ను విడుదల చేసింది. సర్పంచ్ స్థానాలకు ఆర్డీవోలు, వార్డు మెంబర్ల స్థానాలకు ఎంపీడీవోలు రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉన్నది. రిజర్వేషన్లను ఏప్రాతిపదికగా నిర్ణయించాలో సర్కారు మార్గదర్శ కాల్లో పేర్కొన్నది. జనాభా దామాషా ప్రకారం తొలుత ఎస్టీ, ఎస్సీ, బీసీ, తదుపరి మహిళా స్థానాలను ఖరారు చేయాల్సి ఉన్నది. ఆయా స్థానాలకు అనుగుణంగా గ్రామం, మండలం, జిల్లా, ఆపై రాష్ట్రం యూనిట్‌గా నిర్దేశిత కోటా ప్రకారం స్థానాలను రిజర్వ్ చేయాల్సి ఉంటుంది. సగం కంటే ఎక్కువ ఏ జనాభా ఉంటే ఆ వర్గానికి మొదటి ప్రాధాన్యంగా స్థానాలను రిజర్వ్ చేస్తూ వెళ్తుంటారు. ఇదీ ఆయా స్థానాల రిజర్వేషన్లకు అనుసరించే పక్రియ. ఎప్పుడూ ఇదే పద్ధతిని అవలంబిస్తున్నారు. షెడ్యూల్డ్ ఏరియాలోనూ ఎస్టీలకు మొత్తం స్థానాల్లో సగానికి తగ్గకుండా ఉండాలి. వందశాతం ఎస్టీ జనాభా ఉన్నచోట మొత్తంగా వారికే కేటాయించాల్సి ఉంటుంది.ఇదిలా ఉంటే వార్డు మెంబర్ స్థానాలకు ఇంటింటి సర్వే–2024 లెక్కలను, సర్పంచ్ స్థానాలకు 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకొని ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఖరారు చేయాలని, ఇంటింటి సర్వే–2024 లెక్కలను పరిగణనలోకి తీసుకుని బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేయాలని ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది. దీంతో రిజర్వేషన్ల కేటాయింపు మొత్తంగా గందర గోళంగా మారిందని తెలుస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా సీట్లను అలాట్ చేశారనే విమర్శలొస్తున్నాయి. అనేకచోట్ల గందరగోళంగా జరిగిందంటూ ఆశావహులు ఇప్పటికే అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు. ÷జర్వేషన్లలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతున్నదని బీసీ సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే పలు జిల్లాల్లో సర్పంచ్, వార్డుమెంబర్ స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. అన్ని జిల్లాల్లో బీసీ కోటాను తగ్గించి జనరల్ కోటను పెంచారని బీసీ సంఘాలు చెప్తున్నాయి. రొటేషన్ ముసుగులో బీసీలకు రావాల్సిన సర్పంచ్ స్థానాలను అగ్రకులాలకు కట్టబెడుతున్నారని మండిపడుతున్నాయి. మొత్తంగా ఇప్పుడు వస్తున్న విమర్శలు, ఆందోళనలకు ప్రభుత్వం సమాధానం ఇచ్చుకోవాలి. అలాగే పారదర్శకంగా రిజర్వేషన్ల అమలు, ఎన్నికల నిర్వహణ జరగాలి. అప్పుడే ప్రభుత్వ నిజాయితీ కనిపిస్తుంది.

### ప్రజాస్వామ్య మనుగడకు
# వెన్నెముక రాజ్యాంగం




సమయజ్యోతి ప్రత్యేకం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు దశ, దిశా,నిర్దేశాలు, విధి విధానాలు, ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక విధులు, హక్కుల గురించి తెలియజేసే లిఖిత మైన మహత్తర గ్రంథమే భారత రాజ్యాంగం. ప్రభుత్వ పరిపాలన ఎలా ఉండాలో, ప్రజలకు పాలకులు ఏ విధమైన పరిపాలన చేయాలో తెలియజేసే శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థల సమన్వయం ఎలా ఉండాలో తెలిపేదే భారత రాజ్యాంగం. మన రాజ్యాంగం ప్రపంచంలో కెల్లా అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా చెప్తారు. ఇది దేశ ప్రజలకు ఒక భగవద్గీత, ఖురాను, ఒక బైబిల్ లాంటిదని చెప్పవచ్చును. రాజ్యాంగంలో 448 అధికరణాలు, 12 షెడ్యూల్ కలవు. భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందే రాజ్యాంగ ముసాయిదాను రూపకల్పన చేశారు. అందుకు ఒక కమిటీగా రాజ్యాంగ పరిషత్ ను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో సభ్యులను పరోక్ష ఎన్నిక ద్వారా, భారత్ సంస్థానాల నుండి 93 మంది, రాష్ట్ర శాసనసభల ద్వారా 292 మంది, చీఫ్ కమిషనర్ ప్రావిన్స్ ప్రతినిధుల నుండి నలుగురిని, ఇలా 389 మంది సభ్యులతో రాజ్యాంగ పరిషత్ నిర్మాణం జరిగింది. దీనిని రాజ్యాంగ సభ గా చెప్పుకుంటారు. 1947 జూన్ మాసంలో అప్పటి గవర్నర్ జనరల్ లార్డ్ మౌంట్ బాటెన్ ఆధ్వర్యంలో దేశ విభజన జరిగింది. ఆయన సూచన మేరకు రాజ్యాంగ పరిషత్ (రాజ్యాంగ సభ) సభ్యుల సంఖ్యను 299 మందికి కుదించారు. ఈ రాజ్యాంగ సభ మొట్టమొదటి సమావేశం 1946 డిసెంబర్ 9న ఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్లో 211 మందితో సమావేశం జరిగింది. దీనికి డాక్టర్ సచ్చిదానంద సిన్హా ను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, మౌలానాఅబుల్ కలాం ఆజాద్, జేబీ కృపలానీ, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, సరోజినీ నాయుడు, టంగుటూరి ప్రకాశం పంతులు మొదలైనవారు ఈ సభలో సభ్యునిగా ఎన్నుకోబడ్డారు. వారి నేతృత్వంలో స్వతంత్ర భారత రాజ్యాంగం ముసాయిదాను తయారు చేశారు. ఈ ముసాయిదా కమిటీ (డ్రాఫ్ట్ కమిటీ) అధ్యక్షుడిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను 1947 ఆగస్టు 29న ఎన్నుకున్నారు.

రాజ్యాంగ నిర్మాణం: స్వతంత్ర భారత దేశానికి వెన్నుముకగా చెప్పుకునే భారత రాజ్యాంగం నిర్మాణానికి 2 సంవత్సరాల,11 నెలల, 18 రోజులు పట్టింది. రాజ్యాంగ రాతప్రతిని తయారు చేయుటకు రాజ్యాంగ సభ 11 సార్లు, సుమారు 165 రోజులు సమావేశమైంది. రాతప్రతిని తయారుచేసే క్రమంలో 2473 ప్రతిపాదనలు రాగా వాటిని పరిశీలించి 7635 సవరణలు చేసి రాతప్రతిని తయారు చేయడం జరిగింది. ఈ రాత ప్రతిని 1949 నవంబర్ 26 న రాజ్యాంగ ఆమోదించారు. 1950 జనవరి 24న రాజ్యాంగ ప్రతి పై సంతకాలు చేశారు. ఆ తరవాత రోజున రాజ్యాంగ సభ రద్దయి జనవరి 26, 1950 న భారత రాజ్యాంగాన్ని అమలు లోకి తీసుక రావడం జరిగింది. మన రాజ్యాంగాన్ని రూపొందించడానికి సుమారు 64 లక్షలు ఖర్చు కావడం జరిగింది. రాజ్యాంగాన్ని ప్రేమ్ బిహారీ నారాయణ్ రాయ్ జాదా ఇటాలిక్ కాలిగ్రఫి లో చేతి తో రాశారు . ప్రతి పేజీని అందంగా తీర్చి దిద్ది ఇంగ్లీష్,హిందీ భాషల్లో సైతం రాయడం జరిగింది దీనిని పార్లమెంట్ భవన్ లోని గ్రంథాలయం లో హీలియం వాయువు నింపిన పెట్టెలో భద్రపరిచారు. ఈ రాజ్యాంగాన్ని పరిపాలన సౌలభ్యం కోసం కొన్ని సందర్భాలలో సవరణలు చేస్తుంటారు. మన రాజ్యాంగం భారతీయుల స్వేచ్ఛ,సమానత్వ, సౌభ్రాతృత్వం పట్ల నిబద్ధతను తెలుపుతుంది. మొదటగా భారతదేశాన్ని సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాంగా పేర్కొన్నారు. ఆ తర్వాత 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సర్వసత్తాక, సౌమ్య వాద, లౌకిక, ప్రజాస్వామ్య , గణతంత్ర రాజ్యంగా అవతరించింది. భారత రాజ్యాంగం ఐక్యత, సమగ్రత, వైవిధ్యత ల సమాహారం అని , దేశాన్ని ముందుకు నడిపే చోదక శక్తి రాజ్యాంగానికి ఉంటుందని గత సంవత్సరం రాజ్యాంగ సభ చారిత్రక 250 వసంతాల సమావేశాల సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ ఉద్ఘాటించారు. 2015 లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 వ జయంతి సందర్భంగా రాజ్యాంగ దినోత్సవం చరిత్ర, ప్రాముఖ్యత గూర్చి నేటితరం యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని గుర్తించి నరేంద్ర మోడీ నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం గా జరుపుకోవాలని ప్రకటన చేశారు. రాజ్యాంగ దినోత్సవాన్ని గతంలో న్యాయ దినోత్సవంగా, సంవిధాన్ దివాస్ గా పిలుస్తారు. ఆ సందర్భంగా ముంబై లోని హిందూ మిల్స్ కంపౌండ్ లో అంబేద్కర్ స్మారక చిహ్నానికి పునాదిరాయి వేశారు. దేశం గర్వించే విధంగా స్మారక చిహ్నాన్ని నిర్మించడం జరిగింది. ఇది భారతీయులందరికీ గర్వకారణం. రాజ్యాంగం అనేది దేశ పరిపాలన వ్యవస్థకు ఒక అద్దం అలాంటిది. ఒక దిక్సూచి, ఒక వెన్నెముకగా చెప్పు కోవచ్చును. పాలకులు రాజ్యాంగానికి లోబడి నడుచుకోవాలి తప్ప దాని పరిధి దాటి పోకూడదు. కానీ కొన్ని సందర్భాల్లో అనుభవం లేని పాలకులు ప్రాతినిధ్య సభలలో అడుగు పెట్టడం వల్ల ప్రజాస్వామ్య విలువలు అడుగంటి పోతున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్య విలువలు సమాజంలో గొప్పగా అమలు కావాలంటే ముందుగా మన గ్రంథమైన "రాజ్యాంగం 'విలువలు, ఆదర్శాలు, చట్టసభల నిర్మాణం, న్యాయపరమైన సలహాలు , సూచనలు ఇలా అనేక అంశాలపై పాలకులకు అవగాహన కలిగినప్పుడే అంబేద్కర్ ఆశయాలు, ఆదర్శాలు అమలు అవుతాయని చెప్పవచ్చు. గతంలో రాజ్యాంగ దినం గూర్చి పాఠశాల ,కళాశాల, విశ్వవిద్యాలయాల స్థాయిలో వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ , డిబేట్, లాంటివి నిర్వహిస్తూ, రాజ్యాంగ ప్రవేశిక, ప్రతిజ్ఞ, రాజ్యాంగ నిర్మాణం పై అవగాహన కల్పించడం జరిగింది . కాబట్టి ఆ దిశగా రాజ్యాంగం నిర్మాణం విలువలు, రాజ్యాంగ చరిత్ర గురించి ముఖ్యంగా ప్రాతినిధ్య సభలోని ప్రతినిధులు,యువత, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, అవగాహన చేసుకున్నప్పుడే సుపరిపాలన ప్రజలకు చేరువ అవుతుందని చెప్పవచ్చును.

**కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా**

**(నవంబర్ 26, భారత రాజ్యాంగ దినం సందర్భంగ) 9848445134.**

**తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు**

### విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులు
# పెంపొందించాలి

**సమయజ్యోతి ప్రతినిధి భూపాల్ పల్లి**

విద్యార్థుల్లో ఉపాధ్యాయులు శాస్త్రీయ వైఖరులు పెంపొందించాలని మహా దేవ్ పూర్ ఎం ఈ ఓ ప్రకాష్ బాబు మరియు బాలుర స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆర్ అనిల్ కుమార్ అన్నారు బయాలజీ టీచర్ల ఒక రోజు శిక్షణ కార్యక్రమం మహదేవు పూర్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగింది శిక్షణ కార్యక్రమము లో వారు మాట్లాడుతూ తరగతులేవారిగా ల్యాబ్ ఆక్టివిటీ మాడ్యూల్స్ ను విద్యార్థులకు సులభంగా అర్థవంతంగా గుర్తిండి ప్రయోగాలు ద్వారా పాఠాలు రూపొందించినది అని నేర్చుకున్న అంశాలను తరగతి గదుల్లో అమలు చేయాలని అన్నారు బయాలజీ టీచర్లు ఆయా పాఠశాలల్లో అంకిత భావం తో పనిచేసి విద్యా ప్రమాణాలు పెంచాలని అన్నారు పరాఖ్ సర్వే గూర్చి తెలిపారు, ఈ కార్యక్రమం లో రిసోర్స్ పర్సన్స్ బయాలజీ ఫోరం జిల్లా అధ్యక్షులు బి ప్రభాకర్ రెడ్డి కుర్రి శ్రీనివాస్ పలు విషయాల మీద అవగాహన కల్పించారు బయాలజీ టీచర్లు బొమ్మన తిరుపతి రెడ్డి కామిడి సతీష్ రెడ్డి కుసుమ వెంకటేశ్వర్లు పాకాల శ్రీనివాస్ రెడ్డి రవీందర్ ధార వెంకటేశ్వర్లు దయానంద స్వామి భాస్కర్ డా వసుధ ప్రియ కొమ్మ జ్యోతి మేరీ బాయి సువర్ణ సంధ్య జై రాజ్ శ్రీనివాస్ గోపి నాయక్ రాజు పాల్గొన్నారు



# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 4 రోజుల సాధారణ జైలు శిక్ష

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో మారుతి నాగో రావు (27) అనే వ్యక్తికి ఆర్మూర్ కోర్టు న్యాయమూర్తి గట్టు గంగాధర్, నాలుగు రోజుల సాధారణ జైలు శిక్ష విధించారని మంగళవారం బాల్కొండ ఎస్సై కే శైలేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.



# సమాజ భద్రతలో నేర నియంత్రణ ముఖ్యమైనది.

## - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

## ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ తనిఖీ

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

సమాజ భద్రతలో నేర నియంత్రణ ముఖ్యమైనదని,ప్రజలలో పోలీసు కీర్తి ప్రతిష్టలు పెంచే విధంగా విధుల నిర్వహణ చేపట్టాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.వార్షిక తనిఖీలలో భాగంగా ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ తనిఖీ నిర్వహించారు.మొదటగా పూల మొక్కతో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి మరియు వన్ టౌన్ సిఐ బి సునీల్ కుమార్ జిల్లా ఎస్పీ ని సాదరంగా ఆహ్వానించారు.పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతతో ఉంచుకోవాలన్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న వాహనాలను పరిశీలించి వాటి స్థితిగతులపై విచారించారు.రిసెప్షన్ సెంటర్ కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ వార్డు పోలీస్ ఆఫీసర్ కు కేటాయించి విచారణ చేపట్టాలన్నారు.పట్టణంలో వార్డు పోలీస్ ఆఫీసర్ ప్రతిరోజు సంచరిస్తూ అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని రాబట్టాలన్నారు.పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధ్యతల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ,బాధితులకు తగ్గ న్యాయం చేయాలన్నారు.పోలీస్ స్టేషన్ సిబ్బందిచే పరేడ్ నిర్వర్తించి పరేడ్ ద్వారా శారీరక మానసిక దృఢత్వం లభిస్తుందన్నారు.పోలీస్ స్టేషన్లో లో ఉన్న శివాలయం వద్ద పూజ కార్యక్రమాలు నిర్వహించారు.సిబ్బందితో మాట్లాడుతూ విధులలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని తెలిపారు.ప్రజలతో నీతి నిజాయితీతో నడుచుకోవాలని,విధులలో సమయపాలన,క్రమశిక్షణ ను అలవర్చుకోవాలని,పై అధికారి ఆదేశించిన ఆదేశాలను తుచాతప్పకుండా పాటించాలని తెలిపారు.పట్టణంలో రాత్రి సమయాలలో ఓపెన్ డ్రింకింగ్ డ్రంక్ అండ్ డ్రైవ్ జరగకుండా పటిష్టమైన చర్యలను తీసుకోవాలన్నారు.గంజాయి లభ్యం కాకుండా,గంజాయి రహిత జిల్లా ను సృష్టించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.గంజాయి పండించిన సేవించిన రవాణా చేసిన,వ్యాపారం చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటూనే ఉండాలన్నారు.వర్టికల్ విధానం ద్వారా ఎవరికి కేటాయించిన విధులు వారు సక్రమంగా నిర్వర్తించాలన్నారు.పోలీసు పరువు ప్రతిష్టలకు భంగం వాటిల్లకుండా విధుల నిర్వర్తన ఉండాలని,పోలీసు ను కించపరిచే విధంగా ప్రవర్తించిన వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు.రౌడీలను సస్పెక్ట్ లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ,వారి




కదలికలను కట్టడి చేస్తూ ఉండాలన్నారు.న్యాయస్థానం నందు నేరస్తులకు శిక్షలు పడినప్పుడు,సమాజం మంచి ప్రవర్తన కై అడుగులు పడతాయన్నారు.పోలీస్ స్టేషన్లో నమోదైన కేసుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి కేసు పూర్వపరాలు దర్యాప్తు పరిశోధన పై వివరాలను సమీక్షించారు.ఎలాంటి పెండెన్సీ లేకుండా దర్యాప్తు చేసి నేరస్తులకు శిక్షలు పడే విధంగా విచారణ చేపట్టాలన్నారు.విధులను ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి నగదు రివార్డులను ప్రశంస పత్రాలను అందజేసి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు.గస్తీ నిర్వహిస్తున్న సమయంలో దొంగలను పట్టుకుంటూ,ఆర్థిక నేరాల అరికట్టడంలో డైల్ హండ్రెడ్ మరియు పెట్రో కార్ సిబ్బంది చురుకుగా విధులను నిర్వర్తించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి,సీఐ బి సునీల్ కుమార్,ఎస్సైలు నాగనాథ్, అశోక్,రమ్య,ఇసాక్ అలీ,హారుణ్ అలీ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 26న జరిగే నిరసనలను విజయవంతం చేయాలి.

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

26 న, జరిగే నిరసనలను విజయంతం చేయాలని తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శి ఎస్. అజయ్, మేకల ఆంజనేయులు అన్నారు. వనపర్తి వ్యవసాయ మార్కెట్ లో వరి కొనుగులు కేంద్రం ను మంగళవారం నాడు సందర్శించిన అనంతరం వారు మాట్లాడుతూ 4 లేబర్ కోడ్లను అమలును నిరసిస్తూ వరి ధాన్యంకు కనీస మద్దతు ధర కల్పించాలని డీమాండ్ చేశారు. మార్కెట్ లో దళారులు, ఏజెంట్లు రైతులు వరి ధాన్యం లోపలికి రాకుండా అడ్డుకుంటున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల ఖాతాలో మద్దతు ధర తో పాటు బోనస్ 500నగదు జమ చేయాలని డీమాండ్ చేశారు. స్వామి నాథన్ కమిషన్ సిపార్స్ లకు అనుగుణంగా పెట్టుబడి కి అయిన వ్యయం తో పాటు వాటికి అదనంగా 50%ఎక్కువగా ధర ఇవ్వాలని కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకి ఎకరం పొలంకు 80 బస్తాలు వచ్చే దిగుబడి కేవలం 40నుంచి 50లోపే దిగుబడి తగ్గడం తో రైతులు ఆర్థికంగా నష్టం పోతున్నారని ఆవేదన వ్యక్తం. ఉపాది హామీ పథకం లో ఆధార్ సీడింగ్ బయోమెట్రిక్ ద్వారా లక్షల మంది జాబ్ కార్డులు తొలగించి వారి ఉపాధి అవకాశాలను తగ్గిస్తున్నారని అన్నారు. ఉపాదికి బడ్జెట్ పెంచడం తో పాటు సిబ్బంది కి 6నెలలు పెండింగ్ లో ఉన్న వేతనాలను ఇవ్వాలని డీమాండ్ చేశారు. 26న,జరిగే నిరసన కార్యక్రమం లో కూలీలు, రైతులు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలనీ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో చిన్నయ్య, రమేష్ నాయక్, బాలస్వామి, భాగ్యమ్మ, దేవమ్మ, సుజాత, రాధమ్మ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# 8 కోట్ల 12 లక్షల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపు ఇచ్చారు. ఇందిరా మహిళా శక్తి కింద 8871 ఎస్ హెచ్ జీలకు రూ.8 కోట్ల 12 లక్షల చెక్కులను వేములవాడ పట్టణంలోని ఫంక్షన్ హాల్, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని వివరించారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో ఎస్ హెచ్ జీలకు వడ్డీ రుణాలు పంపిణీ చేశామని తెలిపారు. జిల్లాలోని స్వయం సహాయక మహిళా సంఘాలు 8871 లకు దాదాపు రూ.8 కోట్ల 12 లక్షలు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం మొదటి విడతలో 7802 ఎస్ హెచ్ జీ లకు రూ. 7 కోట్ల 40 లక్షలు, రెండో విడతలో 8552 ఎస్ హెచ్ జీ లకు రూ. 11 కోట్ల 78 లక్షల వడ్డీలేని రుణాలు పంపిణీ చేసిందని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇండ్లకు రూ. 100 కోట్ల చెల్లింపులుజిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇప్పటిదాకా రూ. 100 కోట్ల 10 లక్షల ఆర్థిక సహాయం రాష్ట్ర ప్రభుత్వం చేసిందని వెల్లడించారు. మహిళా ఉన్నతి – తెలంగాణ ప్రగతి కింద ఇందిరా మహిళా శక్తి చీరలు జిల్లాలో ఇప్పటి దాకా 1,14,000 చీరలు పంపిణీ చేశామని తెలిపారు. మిగతా మహిళలకు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. జిల్లాలో కొత్త రేషన్ కార్డులు జారీ చేసి, వారి కుటుంబ సభ్యుల పేర్లను చేర్చామని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేద ప్రజలకు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రజాప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ పథకంలో భాగంగా 2025 ఏప్రిల్ నెల నుంచి జిల్లాలోని 1 లక్షా 94 వేల మంది లబ్ధిదారులకు ప్రతినెలా 3 వేల 696 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయడం చేస్తున్నామని వెల్లడించారు.

అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ కింద 200 యూనిట్ల అందిస్తుండగా, జిల్లాలో ఇప్పటిదాకా మొత్తం 20 లక్షల 59 వేల 816 బిల్లులు జారీ చేసి, రూ. 84 కోట్ల 80 లక్షల బిల్లులు మాఫీ చేశామని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన రెండవ రోజు నుండే రాష్ట్రంలోని మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు మహాలక్ష్మి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని, జిల్లాలో 3 కోట్ల 42 లక్షల జీరో టికెట్లపై మహిళలు ప్రయాణం చేయగా 131 కోట్ల 83 లక్షల రూ.లు మహిళలకు ఆదా అయిందని విప్ వెల్లడించారు. వేములవాడ శ్రీ రాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రూ. 150 కోట్లతో ఆలయ విస్తరణ పనులు మొదలు పెట్టామని, జిల్లాలో దాదాపు రూ. 700 కోట్లకు పైగా నిధులతో సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు శంకుస్థాపన చేశారని వెల్లడించారు. మూలవాగు పై బ్రిడ్జి, ఆలయం నుంచి రోడ్డు విస్తరణ పనులు వేగంగా



జరుగుతున్నాయని తెలిపారు. భీమేశ్వర ఆలయంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయిస్తున్నామని విప్ పేర్కొన్నారు.

**మహిళల ఆర్థిక ప్రగతితో..**

మహిళల ఆర్థిక ఉన్నతితో రాష్ట్ర ప్రగతి సాధ్యమనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ పథకంలో వారిని భాగస్వామ్యులను రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, మరమ్మత్తుల పనులు అమ్మ ఆదర్శ పాఠశాల కింద మహిళా సంఘాలకు అందించామని, ఇందిరమ్మ ఇండ్లు మహిళల పేరిట ఇస్తుందని, కొనుగోలు కేంద్రాలు, ఇతర వ్యాపారాలకు అవకాశం కల్పించిందని తెలిపారు. ఎస్ హెచ్ జీ ల్లో ప్రస్తుతం 18- 59 ఏండ్ల వారికి అవకాశం ఉందని, ప్రభుత్వం ఇప్పుడు 15-18 ఏండ్ల కిశోర బాలికలకు, 60 ఏండ్ల వయసు పైబడిన వారికి కూడా సంఘాలు ఏర్పాటు చేసే అవకాశం కల్పించిందని తెలిపారు. సంఘాల్లోని మహిళలకు రుణ బీమా, ప్రమాద బీమా అమలు చేస్తుందని, ఇప్పటిదాకా 112 మందికి రూ. రెండు లక్షల వరకు రుణ బీమా, ఐదుగురికి రూ. 10 లక్షల చొప్పున ప్రమాద బీమా మంజూరు చేసిందని వెల్లడించారు. జిల్లాలో కొత్తగా 5560 మంది ఎస్ హెచ్ జీల్లో చేరారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా వృద్ధి చెంది ఉన్నత స్థానాలకు ఎదగాలని, మిగతా వారికి ఆదర్శంగా నిలవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్లు స్వరూపారెడ్డి, విజయ, సాబేర బేగం, రాణి, చైర్మెన్ రాములు నాయక్, తిరుపతి, రాజు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, ఆర్డీఓ రాధాభాయ్, డీఆర్డీఓ శేషాద్రి, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు పాల్గొన్నారు.

# సుపరిపాలన లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ రామాచాద్రాపురం**

పటాన్చెరు నియోజకవర్గంలో సుపరిపాలన లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు మంగళవారం సాయంత్రం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో 23 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత మురుగునీటి కాలువలు అంతర్గత రహదారుల మరమ్మత్తు పనులకు శంకుస్థాపన చేశారు అనంతరం పటాన్చెరు మండలం క్యాసారం గ్రామంలో 50 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భువన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు కిర్బీ పరిశ్రమ నుండి క్యాసారం మీదుగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ వరకు వెళ్లే రహదారిలో రెండు కోట్ల 75 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన హై లెవెల్ బ్రిడ్జిని ప్రారంభించారు అనంతరం ఏర్పాటుచేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే జి ఎం ఆర్ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తూ నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు నూతనంగా ఏర్పడిన ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని కాలనీలతో పాటు విలీన గ్రామాలలో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమాల్లో పటాన్చెరు ఎంపీడీవో యాదగిరి ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్ పంచాయతీరాజ్ విభాగం డిఈ సురేష్ మాజీ సర్పంచులు వెంకట్ రెడ్డి గడ్డం శ్రీశైలం మల్లారెడ్డి సీనియర్ నాయకులు దశరథరెడ్డి వెంకట్ రెడ్డి ప్రభాకర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు



## ప్రభుత్వ విప్, కలెక్టర్.. నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ల పరిశీలనకు వెళ్లగా

# కుంగిన ఫ్లోరింగ్.. తప్పిన ప్రమాదం

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు, అది శ్రీనివాస్ లకు ప్రమాదం తప్పింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ ఆర్టీసీ బస్సు డిపో చేరువలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం నిర్మాణాలు పరిశీలించడానికి మంగళవారం ప్రభుత్వ విప్, కలెక్టర్, అధికారులతో కలిసి వెళ్లగా, ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సందర్భంగా త్రుటిలో ప్రమాదం తప్పింది. నాణ్యతా లోపంతోనే ఫ్లోరింగ్ కుంగింది. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.



# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టి బొమ్మలను దగ్ధం చేసిన బీసీలు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి**




పట్టణ అంబేద్కర్ చౌరస్తా లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేక నిరసన తెలియజేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దగ్ధం చేసిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు సకినాలశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నేరెళ్ల వెంకటేష్ లు మాట్లాడుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం పిలుపుమేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహన కార్యక్రమం నిర్వహించామని, నాటి నుండి నేటి వరకు బీసీలకు అన్యాయం జరుగుతూనే ఉందని, రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు నిలబెట్టుకో లేక పోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కుంటి సాకులు చెబుతూ బీసీలకు అన్యాయం చేస్తున్నాదని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని, బీసీలకు వ్యతిరేకంగా ఇచ్చిన జీవో 46ను వెంటనే రద్దు చేయాలని, జరగబోయే స్థానిక ఎన్నికలలో బీసీలకు తగిన స్థానాలు కల్పించాలని, లేనిపక్షంలో బీసీల పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు గంగరాజుల రామచందర్, రామసాని శేఖర్, వేణుగోపాలరావు, గట్ల సారంగపాణి, దేవులపల్లి ప్రభాకర్, పారుపల్లి శివరామకృష్ణ, సాగర్, ఏదులాపురం రాజు, మద్ది వేణుగోపాల్, జమాల్పురి నర్సోజి, మునిశెట్టి సత్యనారాయణ, మాడగొని శంకర్, పోలు కుమారస్వామి, చింతల రమేష్, మహేందర్, ఎండి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాలకు చీరల పంపిణీ

**వీణవంక, నవంబర్ 25సమయజ్యోతి**

ఇందిరా మహిళ శక్తి కార్యక్రమం లో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు అందజేశారు. మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్ మాట్లాడుతూ...కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ మాదాసు సునీల్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఒరేం రాజ్ కుమార్, లోకిని రాజయ్య, దాసారపు రమేష్,మోటం శ్రీనివాస్,సీసీ ఆనంద్,తిరుపతి, పద్మ, శ్యామ్,సి ఏలు మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



# పీహెచ్డీ పట్టా సాధించిన గండు ప్రవంతి ని అభినదించిన పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి...

**పెద్దపల్లి, నవంబర్25సమయజ్యోతి.**

పెద్దపల్లి పట్టణంలోని సుభాష్ నగర్ కు చెందిన గండు రంగన్న విజయ దంపతుల కూతురు, పెద్దపల్లి ట్రినిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్ పూర్వ విద్యార్థిని గండు ప్రవంతి హైదరాబాదులోని హిమాయత్ నగర్ లో గల చైతన్య డీమేడ్ టూ బి యూనివర్సిటీ లో పీహెచ్డీ పూర్తి చేశారు. బయో అనాలిటికెల్ మెథడ్ డెవలప్మెంట్ అండ్ వాలిడేషన్ ఫర్ ది డిటర్మినషన్ ఆఫ్ సమ్ సెలెక్టెడ్ ఆంటీ-హై పర్ టెన్సివ్ అండ్ ఆంటీ-వైరల్ డ్రగ్స్ అండ్ దేర్ ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్స్ బై యూ పి ఎల్ సి అండ్ ఎమ్ ఎస్/ఎమ్ ఎస్ విభాగంలో గండు ప్రవంతి చేసిన పరిశోధనకు పీహెచ్డీ డిగ్రీ లభించింది. ఇటీవల నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వి. సి మరియు వ్యవస్థాపకులు డాక్టర్ సి హెచ్. వి. పురుషోత్తం, పీహెచ్డీ డిగ్రీని గండు ప్రవంతికి ప్రధానం చేశారు. పిహెచ్డి పొందిన గండు ప్రవంతిని ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అభినందించారు. తమ కళాశాల పూర్వ విద్యార్థిని పిహెచ్డి సాధించడం గర్వకారణం అని అన్నారు. గండు ప్రవంతి కృషి, నిబద్ధత ఫార్మసీ రంగంలోని విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గండు ప్రవంతి మాట్లాడుతూ తన తల్లిదండ్రుల ప్రోత్సాహం, పెద్దపల్లి ట్రినిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాసిటికల్ సైన్సెస్ వ్యవస్థాపకులు,



మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, ఉపాధ్యాయుల ఆశీర్వాదం వల్లనే పీహెచ్డీ సాధించినట్లు తెలిపారు.

# కొనసాగుతున్న మావోయిస్టు లొంగుబాట్లు... తాజాగా 28 మంది సరెండర్

**ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు ఉద్యమానికి గట్టి ఎదురుదెబ్బ**

**లొంగిపోయిన వారిలో 19 మంది మహిళలు**

**వీరిపై రూ. 89 లక్షల రివార్డు ఉన్నట్లు వెల్లడి**

**'పున మర్గం' కార్యక్రమం సత్ఫలితాలనిస్తున్నాయన్న అధికారులు**

**ఆయుధాలతో సహా పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోలు**

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ రేంజ్‌లో మావోయిస్టు ఉద్యమానికి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వం నిర్వహిస్తున్న 'పున మర్గం'(పునరావాసం నుంచి పునరుజ్జీవనం) కార్యక్రమంలో భాగంగా, మంగళవారం నారాయణ్‌పూర్ జిల్లాలో 28 మంది మావోయిస్టులు లొంగి పోయారు. వీరిలో 19 మంది మహిళలు ఉండగా, అందరిపైనా కలిపి మొత్తం రూ. 89 లక్షల రివార్డు ఉందని అధికారులు వెల్లడించారు. హింసను వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు వీరు ఈ నిర్ణయం తీసుకున్నారు.కేంద్రం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం, బస్తర్ పోలీసులు, స్థానిక యంత్రాంగం, భద్రతా దళాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి. ఈ ప్రాంతంలో శాంతి స్థాపన, అభివృద్ధి లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. లొంగిపోయిన వారిలో మాద్ డివిజన్ డీవీసీఎం, పీఎల్‌జీఏ కంపెనీ నెం. 06 మిలిటరీ సభ్యుడు, ఏరియా కమిటీ సభ్యుడు, టెక్నికల్ టీమ్ సభ్యుడు, మిలిటరీ ప్లాటూన్ సభ్యులు, సప్లై టీమ్ సభ్యులు వంటి పలు స్థాయిలకు చెందిన వారు ఉన్నారు.లొంగిపోయిన వారిలో ముగ్గురు



ఒక ఎస్‌ఎల్‌ఆర్, ఒక ఇన్సాస్, ఒక .303 రైఫిల్‌తో సహా ఆయుధాలను భద్రతా దళాలకు అప్పగించారు. ఈ పరిణామంతో 2025లో ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 287 మంది మావోయిస్టు క్యాడర్లు లొంగిపోయారని నారాయణ్‌పూర్ ఎస్పీ రాబిన్సన్ గుడియా తెలిపారు.గత 50 రోజుల్లోనే బస్తర్ వ్యాప్తంగా 512 మంది మావోయిస్టు క్యాడర్లు హింసను వీడి జనజీవన స్రవంతిలో చేరారని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పత్తిలింగం పేర్కొన్నారు. మావోయిస్టు అగ్ర నాయకులు దేవ్‌జీ, రామ్‌దర్‌లకు కూడా లొంగిపోవడం తప్ప మరో మార్గం లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిష్ఠా మామ్‌గయ్, ఐటీబీపీ, బీఎస్‌ఎఫ్ కమాండర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పి.సి.పి.యన్.డి.టి. అడ్వైజరి కమిటి సమావేశం...

**పెద్దపల్లి, నవంబర్25 సమయజ్యోతి.**

మంగళవారం రోజున జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో పి.సి.పి.యన్.డి.టి. అడ్వైజరి కమిటి సమావేశంను డా. వి. వాణిశ్రీ , జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 32 స్కానింగ్ కేంద్రాలు రిజిస్ట్రేషన్ అయినాయి అన్నారు. వీటిలో ప్రతి నెల 8 నుండి10 కేంద్రాలను తనిఖీ చేస్తూ, అన్నీ కేంద్రాలు తనిఖీ అయ్యేలా చూస్తున్నాము అని అన్నారు. ఈ నెల కూడా తనిఖీ నిర్వహించాము అని అన్నారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం -1994 (పి. సి. పి. ఎన్.డి.టి.) ప్రకారం పుట్ట బోయే బిడ్డ అడ, మగ అని చెప్పడం నేరం. లింగ నిర్ధారణ చేసిన వారికి, చేయుమని అడిగిన వారికి మూడు సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ.10,000/-ల జరిమానా విదించడం జరుగుతుందని అన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం ను పకడ్బందిగా అమలు చేయుచున్నాము అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో గర్భిణులకు చేసే స్కానింగ్ వివరాలను కూడా ఫారం ఎఫ్ నింపడం ద్వారా వారి వివరాలను పొందుపరిచాలని కమిటీ సభ్యులు అన్నారు. ఈ సమావేశంలో డా.రవీందర్, పిల్లల వైద్య నిపుణులు, డా. స్రవంతి గైనకాలజిస్ట్,శ్రీ కె. రాజగోపాల్, రెడ్ క్రాస్ సోసైటి, అద్యక్షులు, స్నేహ శ్రీపతి, జిల్లా సమైక్య అధ్యక్షురాలు, జగన్ డి. పి.ఆర్.ఓ., ఎస్.వెంకటేశ్వర్లు , జిల్లా మాస్ మీడియా ఉప అధికారి పాల్గొన్నారు.




# ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు తప్పిన ప్రమాదం

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. వేములవాడ మున్సిపల్ పరిధిలో ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్లను పరిశీలించేందుకు మంగళవారం ఉదయం అధికారులతో కలిసి ఆది శ్రీనివాస్ వెళ్లారు.ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్, కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి గృహ సముదాయం వద్ద బేస్‌మెంట్‌పై నిల్చొని పరిశీలిస్తున్న క్రమంలో ఒక్కసారిగా ఫ్లోరింగ్ కుంగిపోయింది. ఈ ఘటనతో అధికారులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన కాంగ్రెస్ నేతలు ఆది శ్రీనివాస్ కింద పడిపోకుండా పట్టుకున్నారు.



# ఎల్లుండే పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్.. సాయంత్రం 6 గంటలకు షెడ్యూల్ విడుదల చేయనున్న ఈసీ

తెలంగాణ పంచాయతీ ఎన్నికలకు ముహూర్తం ఖరారైంది. ఎల్లుండి (గురువారం) సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేయనుంది. ఈ మేరకు ఇవాళ సాయంత్రం ఆరు గంటలకు ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేయనున్నట్లు సమాచారం.తాజా సమాచారం ప్రకారం.. డిసెంబర్ 11వ తేదీన తొలి విడతలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ప్రారంభించి, ఫలితాలను విడుదల చేయనున్నట్లు సమాచారం. నాలుగు రోజుల తేడాతో రెండు, మూడో విడత ఎన్నికలు నిర్వహించి, ఫలితాలను ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.




# కాళీమాత అనుగ్రహం అందరికీ ఉండాలి

## - మంచిర్యాల డిసిపి ఎగెన భాస్కర్

**మంచిర్యాల, నవంబర్ 25 (గోల్కొండ ):**

లోక పావని, సర్వజనని, జగన్మాత కాళీమాత అనుగ్రహం అందరిపై ఉండాలని మంచిర్యాల డిసిపి ఎగెన భాస్కర్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ లో నూతనంగా నిర్మించిన కాళీమాత మందిరాన్ని సందర్శించారు. అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ నిర్మాణాన్ని చేపట్టి, ఆలయాన్ని సుందరంగా తీర్చి దిద్దిన నల్ల కోటమ్మ లక్ష్మయ్య ట్రస్ట్ చైర్మన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నల్ల శంకర్, సహాయకులు పెట్టం తిరుపతి తదితరులు అభినందించారు. అనంతరం నల్ల శంకర్ డీసీపీని శాలువాతో సన్మానించారు. అర్చకులు సంతోష్ శర్మ ఆధ్వర్యంలో జరిగే మహా చండీ హోమం 108 కలశాల ప్రత్యేక పూజలను తిలకించారు. ఈ కార్యక్రమంలో అఘోర అయ్యగార్లతో, భూ విరాళాధాత అర్కాల విజయ, హిందూ ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు దబ్బెట తిరుపతి , మల్లేష్, సంపత్, రవి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



# మంచిర్యాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దగ్ధం

## - 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్

**మంచిర్యాల, నవంబర్ 25 సమయజ్యోతి:**

42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. పెద్ద పెట్టిన బీసీల హక్కుల సాధనకు ఉద్యమిస్తామని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నేరెళ్ల వెంకటేష్ జిల్లా నాయకులుఎల్లయ్య, రాజేశం గౌడ్, మందమరి శంకర్లు మాట్లాడుతూ ఉవ్వెత్తున బీసీ ఉద్యమం సాగుతున్నప్పటికీ స్థానిక ఎన్నికల పేరిట అన్యాయం చేయడం తగదన్నారు. గతంలో జిల్లాలో 306 చోట్ల సర్పంచులు ఉంటే గతంలో 22 శాతంగా 66 మంది సర్పంచులు బీసీల నుండి ఎంపికయ్యారని ప్రస్తుతం ప్రభుత్వం 22 శాతాన్ని సైతం తగ్గిస్తూ 66 లో 21కె పరిమితం చేయడం దారుణం అన్నారు. ఇలాంటి తరుణంలో ఉద్యమ బాటే తమకు శరణ్యం అని ప్రభుత్వాలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించి రాజకీయంగా విద్యా ,వైద్య ,ఉపాధి ,ఉద్యోగ తమకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరుబాటతో హక్కుల సాధన చేసేందుకు సిద్ధమని హెచ్చరించారు.



# ఎంపీ వంశీని కలిసిన డిసిసి అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి

**మంచిర్యాల, నవంబర్ 26 సమయజ్యోతి:**

మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ డిసిసి అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి మంగళవారం పెద్దపల్లి ఎంపీ వంశీ నీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వంశీ రఘునాథ్ రెడ్డి ను శాలువాతో సన్మానించారు. అనంతరం ఒకరికి ఒకరు మిఠాయిలు తినిపించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ బాధ్యులుగా మంచిర్యాల జిల్లా మూడు నియోజకవర్గాల్లో పూర్తి బాధ్యతగా వ్యవహరించడమే కాకుండా ప్రభుత్వ పథకాలు, సంక్షేమ ఫలాలు పేదలకు అందాల అందేలా చూడాల్సిన ప్రక్రియ వై దృష్టి పెట్టి పార్టీ బలోపేతంపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండి సదానందం, తదితరులు పాల్గొన్నారు.



# రిజర్వేషన్లలో బిసిలకు న్యాయం దక్కేనా

## పంచాయితీల్లో బిసిల కోటాపై సర్వత్రా అనుమానాలు

## పలుచోట్ల తప్పుల తడకగా సాగిందంటూ నిరసనలు

హైదరాబాద్,నవంబర్25(సమయజ్యోతి):

పంచాయితీ ఎన్నికలుకు సంబంధించి బిసి రిజర్వేషన్ల కేటాయింపులో గందరగోళం నెలకొన్నదని పలు బిసి సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీసీ కోటా గతం కంటే తగ్గిపోయింది. అన్ని జిల్లాల వివరాలను సేకరించి త్వరలోనే సీఎస్‌ను కలిసి ఫిర్యాదుచేస్తాం అని అంటున్నారు. న్యాయం చేయకుంటే కోర్టుల ద్వారా పోరాటం చేసేందుకైనా సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీలోని బీసీ మంత్రులు, ప్రజాప్రతినిధులు ఈ అన్యాయంపై తక్షణం స్పందించాలని వారు కోరుతున్నారు. కోటా తగ్గింపునకు వ్యతిరేకంగా 30న చలో హైదరాబాద్ నిర్వహిస్తాం అని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. చాలా జిల్లాల్లో గతంలో కంటే బీసీ కోటా తగ్గిపోయినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయన్నారు. 42 శాతం రిజర్వేషన్లు దేవుడెరుగు కనీసం ఇప్పటికే ఉన్న బీసీ రిజర్వేషన్లకే రాష్ట్ర ప్రభుత్వం గండి కొడుతున్నదని మండిపడ్డారు. వాస్తవంగా 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 18శాతం నుంచి 22.79 వరకు రిజర్వ్ అయ్యాయి.కానీ, ప్రస్తుతం రాష్ట్రంలో అనేక కొత్త పంచాయతీలు ఏర్పడినప్పటికీ, ప్రస్తుతం బీసీలకు 16 నుంచి 20 శాతానికి మించి రిజర్వేషన్లు దక్కడంలేదని వివరిస్తున్నారు. అనేక డివిజన్లు, మండలాల్లో బీసీలకు ఒకటి కూడా సర్పంచ్ సీటు రిజర్వు కాలేదని, గత ఎన్నికల్లో కంటే కనీసం రెండు మూడు స్థానాల వరకు బీసీ కోటాను తగ్గించారని ఆందోళన వ్యక్తం చేసారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ఖరారు చేసేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేస్తూ జీవో-46 విడుదల చేసింది. సర్పంచ్ స్థానాలకు 2011 జనాభా లెక్కలను, వార్డు మెంబర్ స్థానాలకు 2024 ఇంటింటి సర్వే లెక్కలను పరిగణన లోకి తీసుకోవాలని స్పష్టంచేసింది. అయితే, రాష్ట్రాలు నిర్వహించిన కులగణన సర్వేలకు చట్టబద్ధత లేదని, పారదర్శకత ఉండబోదని, ఆ సర్వే గణాంకాలు చెల్లబోవని కేంద్రం ఇప్పటికే అనేకసార్లు స్పష్టంచేసింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇంటింటి సర్వే గణాంకాలను ప్రామాణికంగా తీసుకోవాలని చెప్పడం చర్చనీయాంశంగా మారింది. జనాభాగణన అంశం 7వ షెడ్యూల్‌లో కేంద్ర జాబితాలోని అంశం. గణాంకాల సేకరణ చట్టం-2008 ప్రకారం సర్వే నిర్వహించాలన్నా కొన్ని నిబంధనలను పాటించాల్సి ఉన్నది. స్వయం ప్రతిపత్తి కలిగిన కమిషన్‌ను ఏర్పాటు చేయడంతోపాటు గణాంకాల సేకరణకు ఒక ప్రభుత్వ శాఖను నోడల్ డిపార్ట్‌మెంట్‌గా నియమించాలి. నేషనల్ ప్లానింగ్ అండ్ ఇంప్లిమెంటేషన్ డిపార్ట్‌మెంట్, స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్, ఎన్‌ఎస్‌ఎస్‌వో తదితర విభాగాల నుంచి రాష్ట్రానికి చెందిన తాజా ఇండ్ల జాబితాను, బ్లాక్‌వారీ గా రూపొందించిన హౌసింగ్ మ్యాపులను కూడా తీసుకోవాల్సి ఉంటుంది. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలకు సంబంధించిన స్థితిగతులను తులనాత్మక అధ్యయనం చేయాల్సి ఉంటుంది. తుదకు అన్నింటినీ క్రోడీకరించి, విశ్లేషించి తుదకు కేంద్రం ఆమోదంతో ఆ గణాంకాలను ప్రామాణికంగా పరిగణనలోకి తీసుకునే అవకాశముంటుంది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రూ.160 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో 2024 నవంబర్‌లో ఇంటింటి సర్వే నిర్వహించింది. రాష్ట్రంలో మొత్తంగా 3.7 కోట్ల మంది జనాభా ఉండగా, అందులో 96.9శాతం మందిని సర్వే చేసి వివరాలను సేకరించిందని అంటున్నారు. ఆ లెక్కనే 100 శాతం కరెక్టని కాంగ్రెస్ చెప్పుకుం టోందని అంటున్నారు. అయితే స్థూలంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీ వర్గాల గణాంకాలనే బయటపెట్టింది. కులాలు, ఉపకులాల వారీగా వివరాలను మాత్రం గోప్యంగా దాచిపెట్టింది. పూర్తిస్థాయి నివేదికను వెల్లడించకపోవడం, అభ్యంతరాలను స్వీకరించకపోవడంతో సర్వే గణాంకాలకు సాధికారత లేకుండా పోయిందని పలు బిసి నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కానీ, తాజాగా ఆ గణాంకాలనే ప్రామాణికంగా తీసుకుని స్థానిక రిజర్వేషన్లు ఖరారు చేయాలని మార్గదర్శకాలు జారీచేయడంపై చర్చ కొనసాగుతున్నది. కులగణన అంశం పూర్తిగా కేంద్రం పరిధిలోనిదేనని కేంద్రం గతంలోనే స్పష్టంచేసింది. దేశవ్యాప్తంగా చేపట్టబోయే జనాభా గణనలో కులగణనను కూడా నిర్వహించా లని ఆ కమిటీ నిర్ణయించింది. అందుకు సంబంధించి షెడ్యూల్ ను కూడా ఇప్పటికే ప్రకటించింది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 2024 ఇంటింటి సర్వే గణాంకాలను ప్రామాణికంగా తీసుకోవడం ఇప్పుడు అనేక వివాదాలకు తావిస్తున్నది. ఈ క్రమంలో యా స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్ల రొటేషన్ పక్రియను సైతం నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారనే ఆరోపణలొస్తున్నాయి. 2019కి ముందు ఏర్పడిన పంచాయతీలు, మండలాలు, జిల్లాలకు మాత్రమే రొటేషన్ వర్తిస్తుంది. 2019 తరువాత ఏర్పడిన నూతన పంచాయితీలు, మండలాలు, జిల్లాలకు రొటేషన్ వర్తించదు. మొదటినుంచి రోస్టర్‌ను తీసుకోవాల్సి ఉంటుంది. రొటేషన్ ఎలా చేయాలంటే తొలుత ఎస్టీ జనరల్, మహిళలు, ఎస్సీ జనరల్, ఎస్సీ మహిళలు, బీసీ జనరల్, బీసీ మహిళలు, జనరల్ స్థానాలుగా మార్చాలి. ఈ రొటేషన్ క్రమాన్ని కూడా పాటించలేదని తెలుస్తున్నది. అంతే కాకుండా, కొన్ని స్థానాలకు 2011 జనాభాల లెక్కలను, మరికొన్ని స్థానాలకు 2024 ఇంటింటి సర్వే జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవడం కూడా గందరగోళానికి దారితీసిందని పలువురు వివరిస్తున్నారు. కొన్ని స్థానాల రిజర్వేషన్‌ను మార్పు చేయకుండా యథా తథంగా కొనసాగించారని అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రొటేషన్ క్రమం వల్ల ఎక్కువగా బీసీలకు అన్యాయం జరిగిందనే విమర్శలున్నాయి.

# జిహెచ్ఎంసి సమావేశంలో గందరగోళం

## వందేమాతరం గీతానికి అవమానం -సీట్లలోంచి లేవని..ఎంఐఎం సభ్యులు

## బిజెపి అభ్యంతరంతో తీవ్ర వాదోపవాదాలు

హైదరాబాద్,నవంబర్25(సమయజ్యోతి):

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో మంగళవారం తీవ్ర గందర గోళం నెలకొంది. వందేమాతరం, జయ జయహే తెలంగాణ గీతాల ఆలాపన సమయంలో మజ్లిస్ కార్పొరేటర్లు కుర్చీలో నుంచి లేవలేదు. దీంతో బీజేపీ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వందేమాతర గీతం పాడితేనే దేశంలో ఉండాలంటూ వారు బిగ్గరగా నినాదాలు చేశారు. దాంతో బీజేపీకి వ్యతిరేకంగా ఎంఐఎం కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. ఇరు పార్టీల కార్పొరేటర్లు.. ఈ సమావేశంలో టేబుల్స్ ఎక్కి హంగామా చేశారు. దాంతో మార్షల్స్ రంగంలోకి దిగి.. వారిని బయటకు తీసుకు వెళ్లే ప్రయత్నం చేశారు. సభ సజావుగా జరిగేలా సహకరించాలంటూ కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఈ రెండు పార్టీల కార్పొరేటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ రోజు జరుగుతున్న జీహెచ్ఎంసీ పాలక మండలి తుది సమావేశం. మరో రెండున్నర నెలల్లో ప్రస్తుత పాలక వర్గం గడువు ముగియనుంది. ఈ సమావేశంలో 95 ప్రశ్నలు, 45 అజెండ అంశాలపై చర్చించాల్సి ఉంది. ఈ తుది సమావేశానికి జీహెచ్ఎంసీ కార్పొరేటర్లతోపాటు సిటీలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ క్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం ప్రారంభానికి ముందై రభస మొదలైంది. పారిశ్రామిక వాడల భూములను అమ్మేలా రూపొందించిన పాలసీని రద్దు చేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు నిరసన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ కార్యాలయానికి నిరసన తెలుపుతూ ర్యాలీగా వెళ్లారు. రూ.5 లక్షల కోట్ల విలువైన 9,292 ఎకరాల భూములను అమ్మేస్తూ.. రేవంత్ రెడ్డి సర్కార్ దేశంలోనే అతిపెద్ద స్కామ్‌కు తెరలేపిందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని ఇండస్ట్రియల్ కారిడార్ భూములను అమ్ముతున్న పాలసీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు..

# జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశంలో గలాభా

## కౌన్సిలర్ల తీరుపై

## ఆగ్రహం వ్యక్తం చేసిన మేయర్

## ఏకవచన సంబోధన

## ఏంటంటూ ప్రశ్న

హైదరాబాద్,నవంబర్25(సమయజ్యోతి):

జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్‌లో అంశాలపై చర్చ కంటే.. నేతల మధ్య వాగ్వాదమే ఎక్కువగా జరుగుతుంటుంది. ఈ విషయంలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కొంత మంది కార్పొరేటర్లు అగౌరవంగా మాట్లాడుతున్నారంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడిన ఆమె.. కొంతమంది కార్పొరేటర్లు అగౌరవంగా మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్‌లో హుందాగా, గౌరవంగా మాట్లాడాలని సభ్యులకు సూచించారు. మేయర్‌ను 'నువ్వు, నిన్ను, నీతో' అంటూ ఏకవచనంతో సంభోదించడం ఏంటని ప్రశ్నించారు. కౌన్సిల్ సమావేశంలో కొత్త వారికి మాట్లాడే అవకాశం ఇద్దామన్న మేయర్.. మాట్లాడే అవకాశం ఎవరికి ఇవ్వాలో మేయర్‌గా తానే నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు. ఎవరికి మైక్ ఇవ్వాలో నాకు ఎవరూ చెప్పాల్సిన అవసం లేదన్నారు. ప్రజలు ఈ సమావేశాన్ని ప్రత్యక్షంగా వీక్షిస్తున్నారని.. సభలో అందరూ హుందాగా మెలుగుతూ ఆదర్శంగా నిలవాలని ఆమె సూచించారు. ఎవరికి వారు స్వతహాగా మాట్లాడుతారని.. పక్క వాళ్లు డైరెక్షన్లు ఇవ్వడం మానుకోవాలన్నారు. కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లతో మేయర్ ఎంత గౌరవంగా వ్యవహరిస్తారో.. కార్పొరేటర్లు కూడా అంతే గౌరవంగా వ్యవహరించాలని సూచించారు.కౌన్సిల్ సమావేశంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, బీఆర్ఎస్ కార్పొరేటర్ సామల హేమ మధ్య మాటల యుద్ధం నడించింది. మేయర్ కుర్చీకి గౌరవాన్ని ఎలా ఆశిస్తున్నారో.. కార్పొరేటర్లకు కూడా అదే విధమైన గౌరవం ఇవ్వాలని హేమ విజ్ఞప్తి చేశారు. గతంలో ఆఫ్టాల్ కార్పొరేటర్లు అని మేయర్ సంభోదించారంటూ హేమ గుర్తు చేశారు.


# చెక్‌డ్యామ్‌లు కుప్పకూలడంపై అనుమానం

## లోతైన దర్యాప్తు జరిపించాలన్న బండి

## సిఎం రేవంత్ రెడ్డికి లేఖ

హైదరాబాద్,నవంబర్25(సమయజ్యోతి):

తెలంగాణలో చెక్ డ్యామ్‌లు కూలిపోవడంపై అనుమానాలున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. వీటిపై విచారణ జరగాలని అన్నారు. ఎందుకు ఇలా జరుగుతున్నాయో తేల్చాలన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మానేరు నదిపై కట్టిన చెక్ డ్యామ్‌లు కూలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తనుగుల- గుంపుల వద్ద చెక్ డ్యామ్ కూలడమే ఇందుకు నిదర్శనమన్నారు. బిఆర్ఎస్ పాలనతో కమీషన్లకు కక్కుర్తి పడి నాణ్యతను గాలికొదిలేయడం వల్లే ఈ దుస్థితి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం హయాంలో చెక్ డ్యామ్‌లను నిర్మించిన కాంట్రాక్టర్లు కాంగ్రెస్ వాళ్లేనని అన్నారు. చెక్ డ్యామ్‌ల నిర్మాణం, నిధుల చెల్లింపులపై మీరు ఆదేశించిన విజిలెన్స్ విచారణ ఏమైందని బండి ప్రశ్నించారు. ఆనాడు బాధ్యులపై చర్యలు తీసుకొని దిద్దుబాటు చర్యలు తీసుకొని ఉంటే తనుగుల-గుంపుల చెక్ డ్యామ్ కూలేది కాదన్నారు. తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేస్తూ డ్రామాలాడుతున్నాయి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే చెక్ డ్యామ్‌ల నిర్మాణాల్లో అక్రమాలు, కూలిపోవడంపై విచారణ జరిపించాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారి ఆస్తులు జప్తు చేసి ఆ సొమ్ముతోనే మళ్లీ డ్యామ్‌లు నిర్మించాలని బండి సంజయ్ లేఖలో పేర్కొన్నారు.



# ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం

వేములవాడ,నవంబర్25(సమయజ్యోతి):

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. కాంగ్రెస్ నేతలు, అధికారులతో కలిసి వేములవాడ మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంగళవారం ఉదయం ఆయన పరిశీలించారు. ఇన్‌ఛార్జ్ కలెక్టర్ గరీమ అగర్వాల్, పార్టీ నేతలతో కలిసి గృహ సముదాయం వద్ద బేస్‌మెంట్‌పై నిల్చొని పరిశీలిస్తున్న క్రమంలో ఒక్కసారిగా అది కుంగింది. ఈ ఘటనతో అధికారులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన కాంగ్రెస్ నేతలు.. ఆది శ్రీనివాస్ కింద పడిపోకుండా పట్టుకోవడంతో ప్రమాదం తప్పింది.

# శాలిబండ ఎలక్ట్రానిక్స్ షాపు అగ్నిప్రమాదం

## అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

హైదరాబాద్,నవంబర్25(సమయజ్యోతి):

శాలిబండ గోమతి ఎలక్ట్రానిక్స్‌లో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంపై మొగల్‌పురా పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మణికంఠను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ క్రమంలో కారు డ్రైవర్ సంచలన విషయాలు బయటపెట్టారు. రాత్రి 10:30 గంటలకు ఏదో పెద్ద బ్లాస్ట్ అయినట్టుగా ఒక్కసారిగా శబ్దం వినిపించిందని.. శబ్దం రావడంతో తన కారు పల్టీ కొట్టిందని తెలిపారు. కారుకు సంబంధించిన గ్లాస్ మొత్తం కూడా ధ్వంసం అయిపోయిందన్నారు.కార్‌లో తాను ఒక్కడినే ఉన్నానని.. కార్ ముందు అద్దాలను పగలగొట్టి బయటపడినట్లు తెలిపారు. కారు నుంచి బయటకు వచ్చిన వెంటనే పూర్తిగా కాలిపోయిందని చెప్పారు. కారులో సీఎన్జీ సిలిండర్ ఏమి పేలలేదని స్పష్టం చేశారు. ఎవరెస్ట్ ఫ్లీట్ కంపెనీ ప్రైవేటు లిమిటెడ్ అనే కంపెనీ పేరుతో ఉబర్ డ్రైవర్‌గా ఉబర్ నడుపుతున్నట్లు వెల్లడించారు. చార్మినార్ దగ్గర ప్యాసింజర్స్‌ను డ్రాప్ చేశానని... మరో పికప్ శాలిబండ సైడ్ పడిందని అందుకే అక్కడికి బయలుదేరినట్లు తెలిపారు. ఈ క్రమంలో గోమతి ఎలక్ట్రానిక్ షాప్ దగ్గర భారీ శబ్దం వచ్చిందని.. ఎలా వచ్చిందో తెలియదని.. వెంటనే తన కారు కూడా బోల్తా పడిందని డ్రైవర్ మణికంఠ పేర్కొన్నారు. అయితే.. ప్రమాదంపై డ్రైవర్ కొత్త అంశం చెప్పడంతో షాప్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగి ప్రమాదం చోటు చేసుకుందా అనే కోణంలో ప్రస్తుతం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అసలు ప్రమాదంపై ఎలాంటి క్లారిటీ లేని పరిస్థితి. దీంతో అన్ని కోణాల్లోనూ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

మంచిర్యాల,నవంబర్25(సమయజ్యోతి):

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాలలో గల టీ కన్వెన్షన్ హాల్ ఎదురుగా ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన కుంబాల రాజేష్ (32) అనే వ్యక్తి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం వారు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేష్ తన భార్య మౌనిక కూతురు అద్విక, కుమారుడు మణివర్షిత్ లతో కలిసి ద్విచక్రవాహనం పై లక్షేటిపేటలో జరిగిన ఓ వివాహానికి హాజరై తిరిగి వస్తున్న క్రమంలో పాత మంచిర్యాలకు రాగానే ఎదురుగా వస్తున్న గుడిపేటకు చెందిన దుర్గం సంతోష్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంతో బలంగా ఢీ కొట్టినట్లు తెలిపారు.ఈ ప్రమాదంలో తీవ్రగాయలపాలైన రాజేష్, తన కూతురు అద్వికలను మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకి తరలించి చికిత్స అందించారు. వైద్యుల సూచనమేరకు మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స ను అందించినట్లు పేర్కొన్నారు. కాగా చికిత్స పొందుతూ మంగళవారం రాజేశ్ ఉదయం మృతి చెందినట్లు వివరించారు.

# మహిళలను ఆర్థికంగా బలోపేతమే లక్ష్యం

## పెగడపల్లిలో వడ్డీలేని రుణాలు పంపిణీ చేసిన మంత్రి

జగిత్యాల,నవంబర్25(సమయజ్యోతి):

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలంలోని మహిళా సంఘ సభ్యులకు రూ.2కోట్ల 19 లక్షల 95 వేల 800 వడ్డీ లేని రుణాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు వ్యాపారంలో రాణించేందుకు గాను వారికి ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ ఎ÷-లాంట్లను ప్రభుత్వం కేటాయిస్తోందన్నారు. దీనికి తోడు వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు కూడా అందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూధన్ గౌడ్, డీఆర్డీవో రఘువరన్, ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములుగౌడ్, తహసీల్దార్ ఆనంద కుమార్, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఆరఐ శ్రీనివాస్, ఏపీఎంలు రవివర్మ, రమాదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, సీసీలు స్వామి, తిరుపతి, శశికుమార్, మండల సమాఖ్య సభ్యులు కవిత, రూపకళ తదితరులున్నారు.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025

## ముఖ్యమంత్రి సమీక్ష సమావేశాలు ప్రారంభం

హైదరాబాద్,నవంబర్25(సమయజ్యోతి):

డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 నిర్వహణ, సంబంధిత ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వివిధ విభాగాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ కు తుది మెరుగులు దిద్దుతున్నారు. మంగళవారం నుంచి నవంబర్ 30 వరకు కమాండ్ కంట్రోల్ సెంటర్లో వరుసగా ఈ సమీక్ష సమావేశాలు జరుగుతాయి. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్బాబు వరుసగా జరిగే అన్ని సమావేశాల్లో పాల్గొంటారు. ఆయా విభాగాల సమీక్షలో సంబంధిత మంత్రులు పాల్గొంటారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ నిర్వహణ ఏర్పాట్లు తదితర అంశాలపై మంగళవారం సీఎంతో పాటు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ఆయా విభాగాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు. బుధవారం మౌలిక వసతులు, అభివృద్ధిపై సీఎంతో పాటు మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, సీతక్క, మోహమ్మద్ అజరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. సంబంధిత విభాగాల అధికారులు పాల్గొంటారు. నవంబర్ 28న విద్య, యువజన సంక్షేమంపై సాయంత్రం 4 గంటలకు సీఎంతో పాటు మంత్రులు వాకాటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, సంబంధిత విభాగాల అధికారులతో సమీక్షిస్తారు.

# సింగర్ జుబీన్ గార్గ్‌ది ముమ్మాటికీ హత్యే

## అసెంబ్లీలో అసోం సీఎం బిస్వశర్మ వ్యాఖ్య

గౌహతి,నవంబర్25(సమయజ్యోతి):

ప్రముఖ సింగర్ జుబీన్ గార్గ్ మరణంపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ సంచలన వ్యాఖ్యలు చేశారు. జుబీన్ గార్గ్ ప్రమాదవశాత్తూ చనిపోలేదని.. అతడిని హత్య చేశారంటూ అసెంబ్లీ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో కూడా ఆయన మీడియా ముందు ఈ తరహా వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ సారి శాసన సభ వేదికగా జుబీన్ మరణంపై సీఎం హిమంత ఈ సంచలన కామెంట్స్ చేయడం సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. మంగళవారం అస్సాం అసెంబ్లీలో గార్గ్ మరణం గురించి చర్చించడానికి ప్రతిపక్షాలు వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఈ సందర్భంగా సీఎం హిమంత బిస్వా శర్మ మాట్లాడుతూ.. జుబీన్ గార్గ్ ది ప్రమాదం కాదని, ఆయన్ను చంపేశారని ఆరోపించారు. మరోవైపు గార్గ్ మరణంపై దర్యాప్తు చేస్తున్న ఏకసభ్య కమిషన్ వాంగ్మూలాలు నమోదు చేయడానికి, సాక్ష్యాలను సమర్పించడానికి గడువును డిసెంబర్ 12 వరకు పొడిగించింది. గౌహతి హైకోర్టు సిట్టింగ్ జడ్జి జస్టిస్ సౌమిత్ర సైకియా నేతృత్వంలోని కమిషన్ నవంబర్ 3 నుంచి విచారణను ప్రారంభించింది. దీనికి సంబంధించిన నివేదికను సమర్పించే గడువు నవంబర్ 21తో ముగిసింది. దీంతో గడువును డిసెంబర్ 12 వరకు పొడిగిస్తూ ఏకసభ్య కమిషన్ సోమవారం నిర్ణయం తీసుకుంది. గార్గ్ మరణంపై అసలు విషయాలు తెలుసుకునేందుకు అస్సాం ప్రభుత్వం ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ప్రముఖ సింగర్ జుబీన్ గార్గ్ సెప్టెంబర్ 19న మరణించిన విషయం తెలిసిందే. సింగపూర్ వెళ్లిన జుబీన్ అక్కడ ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయారు. అయితే, ఆయన మరణంపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో సీఎం హిమంత బిశ్వ శర్మ ఆదేశాల మేరకు జుబీన్ మృతిపై ఏకసభ్య కమిషన్ దర్యాప్తు ముమ్మరం చేసింది.

# అంగరంగ వైభవంగా ధ్వజారోహణ కార్యక్రమం

## 22 అడుగుల కాషాయ జెండా ఆవిష్కరణ

అయోధ్య,నవంబర్25(సమయజ్యోతి):

అయోధ్యలో కాషాయ ధ్వజారోహణ కార్యక్రమం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ.. అయోధ్యకు చేరుకున్నారు. రామ మందిర నిర్మాణ పనుల్లో భాగంగా ఆలయ శిఖరంపై కాషాయ ధ్వజాన్ని ప్రధాని మోదీ ఆవిష్కరించారు. ఆలయ పనులు పూర్తయ్యాయనడానికి గుర్తుగా ఈ ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. అయోధ్య శ్రీరామ్‌లల్లా ప్రధాన ఆలయంలో ధ్వజారోహణం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రామాలయంపై 22 అడుగుల కాషాయ జెండాను మోడీ ఆవిష్కరించారు. రామ జన్మభూమి ట్రస్ట్ సభ్యుల సమక్షంలో జెండా ఆవిష్కరణ జరిగింది. సాధువులు, ప్రముఖులు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరయ్యారు.'ధ్వజ్ ఆరోహణ్' కార్యక్రమంలో భాగంగా జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ జెండా లంబకోణ త్రిభుజాకారంలో సూర్యుని చిహ్నాన్ని కలిగి ఉంది. శాశ్వత శక్తి, దైవిక తేజస్సు, ధర్మం, జ్ఞానోదయాన్ని సూచిస్తుంది. శ్రీరాముడితో సంబంధం ఉన్న అన్ని లక్షణాలు ఈ జెండాలో కనిపిస్తాయి. 'ఓం' చిహ్నంతో చెక్కబడిన జెండాను ఆలయ 'శిఖర్' పైన ఉంచారు.

# ఐ బొమ్మ రవిని మేమే పట్టుకున్నాం

## ఆయన భార్య ఎలాంటి సమాచరం ఇవ్వలేదు

## సీసీఎస్ అడిషినల్ సీపీ శ్రీనివాస్

హైదరాబాద్,నవంబర్25(సమయజ్యోతి):

ఐబొమ్మ రవి కేసుకు సంబంధించి అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. కీలక సమాచారాన్ని రాబడుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఐబొమ్మ రవి కేసుపై సీసీఎస్ అడిషినల్ సీపీ శ్రీనివాస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రవికి బెట్టింగ్, గేమింగ్ యాప్స్ ద్వారా డబ్బులు వచ్చేవని అన్నారు. యాడ్ బుల్ కంపెనీ రవికి చెందినదేనని తెలిపారు. యాడ్స్ ద్వారా వచ్చిన డబ్బుల్ని యాడ్ బుల్ కంపెనీకి మళ్లించారని చెప్పారు. ఇమంది రవి ఇప్పటి వరకు 20 కోట్ల రూపాయల వరకు సంపాదించాడని వెల్లడించారు. . 'ఐబొమ్మ, బప్పం సైట్లను రవి స్నేహితుడు నిఖిల్ డిజైన్ చేశాడు. ఐబొమ్మ రవి ఓవర్ కాన్ఫిడెన్స్‌తోనే దొరికాడు. రవి భార్య మాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. మరికొన్ని పైరసీ వెబ్‌సైట్లు నడుస్తూనే ఉన్నాయి. మూవీరూల్జ్, తమిళ్‌ఎంవీ లాంటి పైరసీ సైట్లు ఇంకా నడుస్తున్నాయి. పైరసీ సైట్ల నిర్వాహకులను పట్టుకునే పనిలోనే ఉన్నాం. ఐబొమ్మ పాపులర్ అయ్యాక.. దానిపేరును చాలామంది వాడుకుంటున్నారు. సినిమా సమీక్షలకు కూడా ఐబొమ్మ సైట్ పేరు వాడుకుంటున్నారు. భవిష్యత్‌లో వెబ్-3 టెక్నాలజీ కూడా రాబోతుంది. వెబ్-3 టెక్నాలజీతో పైరసీ చేస్తే పట్టుకోవడం కష్టం' అని అన్నారు. కాగా, నిన్న(సోమవారం) సాయంత్రంతో ఐబొమ్మ రవి కస్టడీ ముగిసింది. చివరి రోజు కస్టడీలో అధికారులు 3 గంటల పాటు అతడ్ని విచారించారు. విచారణలో రవి నుంచి పోలీసులు ఎలాంటి సమాధానాలు రాబట్టలేకపోయారని తెలుస్తోంది.

# ఎన్నికల కోసమే ఇందిరమ్మ చీరలు

## అరకొరగా మహిళలకు పంపణీ-మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

సిద్దిపేట,నవంబర్25(సమయజ్యోతి):

కేసీఆర్ ప్రతి బతుకమ్మ పండగకి 18 ఏళ్లు నిండిన 1.30కోట్ల మంది మహిళలకు చీరలు అందిస్తే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లో ఉన్న 46లక్షల మందికే చీరలు ఇస్తున్నారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు విమర్శించారు. కేవలం ఎన్నికల కోసమే ఇదంతా చేస్తున్నారని అన్నారు. సిద్దిపేట జిల్లాలో 3.83లక్షల మంది మహిళలుంటే 1.99లక్షల మందికే చీరలు ఇచ్చారని చెప్పారు. జిల్లా కలెక్టరేట్‌లో స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పించారు. కేసీఆర్ పండగ.. పండగకి సంక్షేమ పథకాలు ఇస్తే రేవంత్‌రెడ్డి ఓట్ల ఓట్లకు సంక్షేమ పథకాలు ఇస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. ఒక్క ఏడాదికి మాత్రమే చీర ఇచ్చి సారె పెట్టానని రేవంత్‌రెడ్డి అంటున్నారు. చీర ఇచ్చాను సర్పంచ్ ఎన్నికల్లో మహిళలంతా ఓట్లు వేయండని చెబుతున్నారని మండిపడ్డారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఇస్తానన్న నెలకు రూ.2,500 సంగతి ఏమైంది? రెండు చీరలు ఇస్తామని చెప్పి ఒక్కటే ఇచ్చిన మీకు మహిళలు ఎందుకు ఓటేయ్యాలి? పట్టణ ప్రాంతాల్లో ఎన్నికలు లేవు కాబట్టి చీరలు లేవు.. వడ్డీలేని రుణాలు లేవు. మహిళా సంఘాలు రూ.25వేల కోట్ల రుణాలు తీసుకుంటే రూ.5వేల కోట్లకు మాత్రమే వడ్డీలేని రుణం వస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం 20 పైసలు ఇస్తూ 80 పైసలు ఎగనామం పెడుతోంది. మొత్తం డబ్బులకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. గతంలో స్త్రీనిధి కింద వడ్డీలేని రుణాలు ఇచ్చాం. ఇప్పుడు



ఇవ్వట్లేదు. ప్రభుత్వం సిద్దిపేట జిల్లాలోని మహిళా సంఘాలకు ఒక్క ఆర్టీసీ బస్సు ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ఇస్తామని నేటికి రెండేళ్లు అయినా ఒక్క మెగావాట్ పవర్ కూడా పెట్టలేదన్నారు.

# నెతన్యాహు భారత పర్యటన రద్దు

## ఇటీవలి ఢిల్లీ పేలుళ్లతో నిర్ణయం

న్యూఢిల్లీ,నవంబర్25(సమయజ్యోతి):

ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు భారత్ పర్యటన మరోసారి రద్దయింది. ఇటీవల ఢిల్లీ ఎర్రకోట పేలుళ్లతో దేశంలో భద్రతా పరిస్థితులు సున్నితంగా మారిన నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ ఏడాది నెతన్యాహు పర్యటన రద్దవడం ఇది మూడో సందర్భం కావడం విశేషం. నెతన్యాహు ఈ సంవత్సరం చివరిలో భారత్‌ను సందర్శించాలని ప్రాథమికంగా నిర్ణయించినప్పటికీ, ఎర్రకోట బాంబు దాడి నేపథ్యంలో ఆయన షెడ్యూల్‌లో మార్పు చేశారు. అంతకుముందు సెప్టెంబర్ 19 న జరగాల్సిన ఒక రోజు పర్యటనను కూడా రద్దు చేసిన సంగతి విదితమే. అదేవిధంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో ముందుగా నిర్ణయించిన పర్యటన కూడా వాయిదా పడింది. బెంజమిన్ నెతన్యాహు భారత్‌కు చివరిసారిగా 2018లో వచ్చారు. అయితే 2026లో నెతన్యాహు భారత్‌కు చేరుకొని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో భేటీ అయ్యే అవకాశం ఉందని సమాచారం. ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు విస్ఫోటంలో 13 మంది మరణించగా, అనేక మంది గాయపడిన విషయం ఇప్పటికే వెలుగులోకి వచ్చింది.

# ఢాకాకు హసీనా అప్పగింత భారత నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి

ఢాకా,నవంబర్25(సమయజ్యోతి):

తమ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా, మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్‌ను తమకు అప్పగించాలని కోరుతు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం భారత్‌కు లేఖ పంపింది. ఈ క్రమంలో భారత్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది సర్వత్రా ఆసక్తిగా మారింది. ప్రపంచదేశాలు కూడా దీనిపై ఆసక్తిని కనబరుస్తున్నాయి. ఈ విషయాన్ని ఆ దేశ ప్రభుత్వ విదేశాంగ శాఖ సలహాదారు తౌహిద్ హుస్సేన్ వెల్లడించారు. బంగ్లాదేశ్‌లో అల్లర్ల నేపథ్యంలో హసీనా భారత్‌లో తలదాచుకుంటున్న సంగతి తెలిసిందే. హసీనా పదవీకాలంలో అనేక మంది రాజకీయ కార్యకర్తలు, విమర్శకులు అదృశ్యమయ్యారనే కేసులో బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ఐసిటి) ఆమెకు మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పు అమలులో భాగంగా భారత్‌కు బంగ్లాదేశ్ ఈ లేఖ పంపినట్లు హుస్సేన్ తెలిపారు. తీర్పు వివరాలు ఉన్న లేఖను కూడా భారత్‌కు పంపినట్లు ఆయన వెల్లడించారు. అసదుజ్జమాన్‌ను కూడా మరణ శిక్ష విధించినయ విషయాన్ని కూడా భారత్‌కు తెలిపామన్నారు.. 'ఈ ఇద్దర్నీ ఆలస్యం చేయకుండా బంగ్లాదేశ్ అధికారులకు అప్పగించాలని మేము భారత ప్రభుత్వాన్ని కోరుతున్నాము. ఇరుదేశాల మధ్య ఉన్న అప్పగింతల ఒప్పందం ప్రకారం ఇది భారతదేశంపై కూడా ఒక బాధ్యత' అని లేఖలో బంగ్లాదేశ్ పేర్కొంది. అయితే ఈ లేఖపై న్యూఢిల్లీలోని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇంకా స్పందించాల్సి ఉంది. కాగా ఐటిసి తీర్పును 'గమనించాము' అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ గతంలో వ్యాఖ్యానించింది.

# స్వల్పంగా తగ్గిన బంగారం,వెండి ధరలు

న్యూఢిల్లీ,నవంబర్25(సమయజ్యోతి):

అమెరికా కరెన్సీ డాలర్ బలపడుతున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు స్వల్పంగా దిగొచ్చాయి. భారత్‌లో కూడా బంగారం ధర చెప్పుకోదగ్గ స్థాయిలో తగ్గింది. పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతున్నా కూడా రేట్స్‌లో కోత పడింది. దేశంలో మంగళవారం ఉదయం సమయంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1,25,120. నిన్నటి ధరతో పోలిస్తే రూ.463 మేర తగ్గింది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర కూడా నిన్నటితో పోలిస్తే రూ.650 మేర తగ్గి రూ.1,14,690కు చేరుకుంది. వెండి ధరల్లో కూడా తగ్గుదల కనిపించింది. సోమవారం నాటి ధరతో పోలిస్తే ప్రస్తుతం వెండి రేటు రూ. వెయ్యి మేర తగ్గి రూ.1,62,900కు చేరింది. డాలర్ బలపడటంతో బంగారానికి డిమాండ్ కాస్త తగ్గిందని నిపుణులు చెబుతున్నారు. డాలర్ సూచీ ప్రస్తుతం 100 మార్కుకు పైనే కదలాడుతోంది. గత ఆరు నెలల్లో ఇదే అత్యధికం. దీంతో ఇన్వెస్టర్లకు కమోడిటీ మార్కెట్‌పై ఆసక్తి తగ్గింది. ఈ నేపథ్యంలో వచ్చే నెలలో జరగనున్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశాలపైనే అందరి దృష్టి నెలకొంది. ఈసారి అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత విధించే అవకాశం 70 శాతంగా ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదే జరిగితే సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడికి మళ్లీ డిమాండ్ పెరిగి ధరలకు రెక్కలొచ్చే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# పని ఒత్తిడితో బిఎల్‌వోల మృతి

## సుప్రీంను ఆశ్రయించిన పలు రాష్ట్రాలు

## నివేదిక కోరిన కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ,నవంబర్25(సమయజ్యోతి):

తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పక్రియ కొనసాగుతోంది. అయితే అధిక పనిభారం, ఒత్తిడి కారణంగా బూత్ లెవెల్ అధికారులు పలువురు మరణించినట్టు ఆరోపణలు వస్తుండటంపై భారత ఎన్నికల సంఘం దృష్టి సారించింది. దీనిపై వివరాలు కోరుతూ 12 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్య ఎన్నికల అధికారుల నుండి మంగళవారంనాడు నివేదికలను కోరింది. బీఎల్ఓలు పని ఒత్తిడి కారణంగా మరణిస్తున్నారని, ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలని పలు రాష్ట్రాలు ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ తాజా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణ విధుల్లో ఉన్న కొందరు బీఎల్ఓలు తీవ్రమైన పనిభారం, ఒత్తడిని ఎదుర్కొంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మూడు వారాల్లో 16 మంది బీఎల్ఓలు మరణించినట్టు కథనాలు రావడం కూడా రాజకీయ వినవాదానికి దారితీసింది. కేంద్ర ఎన్నికల సంఘం హడావిడి పక్రియపై పలు పార్టీలు విమర్శలు గుప్పించాయి. పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, రాజస్థాన్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ఈ మరణాలు నమోదైనట్టు కథనాలు వచ్చాయి. బీఎల్ఓల మరమాణాలపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇవి ఎస్ఐఆర్ సంస్కరణలు కావని, బలవంతంగా రుద్దుతున్న నిరంకుశత్వమని రాహుల్ విమర్శించారు. ఈ పక్రియతో ఇంకా ఎన్ని ప్రాణాలు కోల్పోవాలి? ఎన్ని మృతదేహాలు చూడాలని మమతాబెనర్జీ ప్రశ్నించారు. బీఎల్ఏలకు సరైన వనరులు కల్పించకుండా హడావిడిగా ఎస్ఐఆర్ పక్రియ నిర్వహించడమే ఈ మరణాలకు కారణమని అన్నారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్‌లోని బనగావ్‌లో మమతాబెనర్జీ మంగళవారంనాడు భారీ ర్యాలీ నిర్వహించారు.

# ఢిల్లీ పేలుడు ఘటనలో కీలక విషయాలు

## బర్హాన్ వని మృతికి ప్రతీకారంలో ఉమర్

న్యూఢిల్లీ,నవంబర్25(సమయజ్యోతి):

దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద నవంబర్ 10వ తేదీన కారు బాంబు దాడి జరిగిన ఘటనలో ఉమర్ ఉన్ నబీ అనే డాక్టర్ ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు. దర్యాప్తు అధికారులు ఇప్పటి వరకు అరెస్ట్ అయిన టెర్రరిస్టులను విచారించగా పలు సంచలన విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. 2016లో భద్రతా దళాల కాల్పుల్లో టెర్రరిస్ట్ బుర్హాన్ వని చనిపోయాడు. అతడి మరణానికి ప్రతీకారం తీర్చుకోవాలని ఉమర్ భావించినట్లు సమాచారం. అతడు ఆత్మాహుతి దాడికి పాల్పడటానికి ఇది ఫరీదాబాద్ అల్ ఫలా యూనివర్సిటీకి చెందిన టెర్రరిస్ట్ డాక్టర్ ముజమిల్ షకీల్.. ఉమర్‌కు 'ఎమిర్' అన్న బిరుదు ఇచ్చాడు. ఇక, అప్పటినుంచి ఉమర్ తనను తాను మిగిలిన టెర్రరిస్టులకు ఓ పరిపాలకుడిగా.. నాయకుడిగా.. యువరాజుగా చెప్పుకునే వాడని సమాచారం. పోలీసుల అదుపులో ఉన్న షాహీన్ సాయీద్ కూడా దర్యాప్తు అధికారులకు కీలక సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ముజమిల్ షకీల్ కూడా పోలీసుల అదుపులో ఉన్నాడు. ఉమర్‌కు తమ గ్రూపులో మంచి గౌరవం ఉందని, అతడి అనుభవం కూడా ఎక్కువేనని ముజమిల్ చెప్పినట్లు సమాచారం. ఉమర్‌తో పోల్చుకుంటే తాను ఓ సాధారణ కూలీలాంటి వాడినని ముజమిల్ చెప్పాడట. 'ఆపరేషన్ ఎమిర్' పేరుతోటే ఆత్మాహుతి దాడికి వ్యూహ రచన జరిగినట్లు ముజమిల్ వెల్లడించినట్లు తెలుస్తోంది. ముజమిల్ చెబుతున్న దాని ప్రకారం.. ఉమర్‌కు 9 భాషలు తెలుసు. టెర్రరిస్టుల గ్రూపులో అతడే తెలివైన వాడు. చనిపోయే వరకు తను మతం కోసమే ఇదంతా చేస్తున్నట్లు భావించేవాడు.

# ఢిల్లీ కాలుష్యంపై కేంద్రం సీరియస్

## కాలుష్య కారక వాహనాలపై చర్యకు ఆదేశం

న్యూఢిల్లీ,నవంబర్25(సమయజ్యోతి):

దేశ రాజధానిలో కాలుష్య తీవ్రత దృష్ట్యా ప్రధానమంత్రి కార్యాలయం రంగంలోకి దిగింది. నగరంలో కాలుష్యానికి కారణమయ్యే వాహనాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించింది. ఇదే సమయంలో విద్యుత్ వాహనాలను విస్తృతపరిచే చర్యలు ముమ్మరం చేయాలని సూచించినట్లు తెలిసింది. దిల్లీలో వాయునాణ్యత మరింత క్షీణిస్తోన్న వేళ ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దిల్లీలో ఇంకా 37శాతం పాత వాహనాలు ఉన్న విషయాన్ని ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఈవీ వాహనాలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని, ఇందుకు సంబంధించి సబ్సిడీలతోపాటు ఛార్జింగ్ స్టేషన్లు వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులకు సూచించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పెట్రోల్, డీజిల్ వాహనాలను గణనీయంగా తగ్గించాలని ఆదేశించినట్లు సమాచారం.

# కొత్త లేబర్ కోడ్‌తో జర్నలిస్టులకు మేలు

## అన్న రంగాల జర్నలిస్టులకు ఇందులో చోటు

## వర్కింగ్ జర్నలిస్ట్ష్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు సంజయ్

హైదరాబాద్,నవంబర్25(సమయజ్యోతి):

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల కారణంగా వర్కింగ్ జర్నలిస్టుల నిర్వచనం మారిపోయిందని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు సంజయ్ కుమార్ ఉపాధ్యాయ అన్నారు. ఇప్పటి వరకు కేవలం ప్రింట్ మీడియా జర్నలిస్టులు మాత్రమే వర్కింగ్ జర్నలిస్టుల చట్టం కింద ఉన్నారని, ఇప్పుడు టెలివిజన్, రేడియో, డిజిటల్ మీడియాలో పని చేసే వారంతా జర్నలిస్టుల సంక్షేమ చట్టం పరిధిలోకి, కార్మిక భద్రతా వలయంలోకి వచ్చారన్నారు. ఈ బృహత్తర నిర్ణయంలో వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా పాత్ర కూడా ఉండడం తమ యూనియన్‌కు గర్వకారణమని తెలిపారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ అధ్యక్షుడు రాణా ప్రతాప్ రజ్జాభయ్యా, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్‌తో కలిసి ఆయన సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ చట్టాలు అమలులోకి రావడానికి వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తూ వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో డబ్ల్యూజేఐ దీర్ఘకాల పోరాటం ఫలించినట్లయిందన్నారు. ఈ నిర్ణయంతో ప్రింట్ జర్నలిస్టులతో పాటూ డిజిటల్ మీడియా, టెలివిజన్, రేడియో జర్నలిస్టులూ అనేక ప్రయోజనాలు పొందుతారని తెలిపారు.కొత్త కార్మిక చట్టాలను వర్కింగ్ జర్నలిస్టుల కోణంలో స్వాగతిస్తున్నప్పటికీ.. పాత్రికేయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు ప్రభుత్వం నెరవేర్చాల్సిన బాధ్యతను మాత్రం ఎత్తిచూపుతామని సంజయ్ కుమార్ ఉపాధ్యాయ అన్నారు. తెలంగాణలో నూతన అక్రిడిటేషన్ పాలసీని వెంటనే ప్రకటించి అర్హులైన అందరికీ అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలనీ, రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రులలో హెల్త్ కార్డులను ఆమోదించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# వైకుంఠ ఏకాదశి దర్శనాలు డిసెంబర్ 30 నుంచి 8 వరకు దర్శన భాగ్యం

**తిరుమల,నవంబర్25(సమయజ్యోతి):**

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమలలో డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు వైకుంఠ ద్వారా దర్శనాలు కల్పించనున్నట్లు టిటిడి వెల్లడించింది. మొదటి మూడ్రోజులు ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా, ఆ తర్వాత ఏడు రోజులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2 ద్వారా సర్వదర్శనాలు ఉంటాయని పేర్కొంది. ఈ క్రమంలో తొలి మూడ్రోజులు ఎస్ఈడీ, శ్రీవాణి దర్శనాలు రద్దు చేయనున్నట్లు తెలిపింది. ప్రోటోకాల్ ప్రముఖులు మినహా వీఐపీ దర్శనాలు, ఇతర ప్రత్యేక దర్శనాలు, ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు తితిదే వెల్లడించింది. వైకుంఠ ద్వార దర్శన రోజులైన డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు తిరుపతిలో సర్వదర్శన టోకెన్ల జారీని నిలిపివేస్తున్నట్లు తెలిపింది. మొదటి మూడు రోజుల వైకుంఠ ద్వారా దర్శనాలకు నవంబర్ 27న ఉదయం 10 గంటల నుండి డిసెంబర్ 1న సాయంత్రం 5 గంటల వరకు తితిదే వెబ్‌సైట్ , తితిదే యాప్, వాట్సాప్‌లో ఏపీ గవర్నమెంట్ బాట్‌లో తితిదే ఆలయాల విభాగంలో ఎలక్ట్రానిక్ డిప్‌కు వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. డిసెంబర్ 2న మధ్యాహ్నం 2 గంటలకు ఎలక్ట్రానిక్ డిప్ వివరాలు వెల్లడిస్తారు.

# తిరుమల పరకామణ ఇచోరీ కేసు

## సిఐడి విచారణకు హాజరైన భూమన

**తిరుపతి,నవంబర్25(సమయజ్యోతి):**

తిరుమల పరకామణి చోరీ కేసులో వైకాపా నేత, తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి మండళవారం విచారణకు హాజరయ్యారు. విచారణకు రావాలని సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేయడంతో మంగళవారం సాయంత్రం తిరుపతి పద్మావతి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన సీఐడీ తాత్కాలిక కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. తిరుమల శ్రీవారి పరకామణిలో 920 అమెరికన్ డాలర్లను చోరీ చేస్తూ పట్టుబడిన పరకామణి ఉద్యోగి రవిపై 2023 ఏప్రిల్ 7న కేసు నమోదైంది. అప్పట్లో తితిదే ఏవీఎస్‌వోగా పనిచేసిన సతీశ్ కుమార్ ఫిర్యాదు మేరకు తిరుమల ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈకేసులో భాగంగానే భూమనను సీఐడీ అధికారులు విచారించారు.

# మదనపల్లె కిడ్నీ రాకెట్ వ్యవహారం కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

**మదనపల్లె,నవంబర్25(సమయజ్యోతి):**

అన్నమయ్య జిల్లా మదనపల్లె కిడ్నీ రాకెట్ వ్యవహారం కేసులో ఇద్దరు నిందితులను రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వారిని కడప జిల్లాకు చెందిన సుమన్, కొండయ్యలుగా గుర్తించి రిమాండ్‌కు తరలించారు. కిడ్నీ మార్పిడి చేస్తున్న బెంగళూరు వైద్యుడు పార్థసారథి రెడ్డికి వీరిద్దరూ అపరేషన్ థియేటర్ అసిస్టెంట్లుగా పని చేస్తారని డీఎస్పీ మహేందర్‌రెడ్డి వెల్లడించారు. మదనపల్లెలోని గ్లోబల్ ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స జరిగే సమయంలో వీరు ఆస్పత్రికి వచ్చి.. పార్థసారథికి సహకరిస్తారని తెలిపారు. ఇటీవల కిడ్నీ శస్త్ర చికిత్స చేయించుకున్న యమున అనే యువతి మృతి చెందడంతో ఆస్పత్రిని మూసివేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. విశాఖకు చెందిన యమున మదనపల్లెలోని గ్లోబల్ ఆసుపత్రిలో గుట్టుగా కిడ్నీ మార్పిడి చేస్తుండగా మృతి చెందింది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదుతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితులు తిరుపతి నుంచి 112కు ఫిర్యాదు చేయగా తిరుపతి పోలీసులు మదనపల్లెకు చేరుకొని విచారణ చేపట్టారు. ఈ వ్యవహారానికి సంబంధించి మదనపల్లె రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం విచారణ ప్రారంభించింది. ఆసుపత్రికి చెందిన పలువురిని అదుపులోకి తీసుకొని విచారించారు. అప్పటి నుంచి దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో తాజాగా ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు బాల్కొండ విద్యార్థి ఎంపిక

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ ఆదర్శ పాఠశాల 9వ తరగతి విద్యార్థి జీ.హర్షిత్, పెద్దపల్లి జిల్లాలో జరిగే అండర్-14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు మంగళవారం వ్యాయామ ఉపాధ్యాయుడు ముత్తేన్న తెలిపారు. హర్షిత్ ను ప్రిన్సిపల్ శ్రీనివాస్ ప్రసాద్, ఉపాధ్యాయులు గణేష్, సుకుమార్ విజయలక్ష్మి, శ్రావణి, శ్రీనివాస్, శ్రీకాంత్ రవి అభినందించారు.




# సర్పంచ్ ఎన్నికల్లో బిసిలకు మోసం

## ఎక్కడా సరైన విధంగా అమలు చేయని రిజర్వేషన్లు

## మాజీమంత్రి శ్రీనివాస గౌడ్ తీవ్ర విమర్శలు

**హైదరాబాద్,నవంబర్25(సమయజ్యోతి):**




సర్పంచ్ ఎన్నికలలో బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేశారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కొడంగల్ నియోజకవర్గం ఒక్కటే అభివృద్ధి కాదు.. పాలమూరు రంగారెడ్డి ఎక్కడకు పోయిందని ప్రశ్నించారు. పాలమూరు బిడ్డవే కదా ఏమైందని నిలదీశారు. ఒక్క నియోజకవర్గం అభివృద్ధి చెందితే అభివృద్ధి కాదు కదా అని అన్నారు. రాజ్యాధికారం ఎక్కడకు పోయిందని అడిగారు. కేంద్రంలో బీసీలకు ఒక్క మంత్రిత్వ శాఖ లేదని అన్నారు. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన వారికి ఓటు వేస్తే మరింత మోసమే జరుగుతుందని అన్నారు. ఏ పార్టీలో గెలిచినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిచాడని ప్రచారం చేసుకుంటారు కావచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చినచీర కట్టుకొని ఓట్లు వేయాలని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నా ఎన్నికల సంఘం ఏం చేస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ప్రజలకోసమే అయితే రెండు సంవత్సరాల నుంచి ఎందుకు చీరలు ఇవ్వలేదని నిలదీశారు. ప్రభుత్వం ఇచ్చిన చీర కట్టుకొని ఓటు వేయండని బహిరంగంగా ముఖ్యమంత్రి అంటున్నా ఎన్నికల కమిషన్ ఏం చేస్తుందన్నారు. ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ అన్నట్టు ఉంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీల వైఖరి ఉందని విమర్శించారు.రెండేళ్ల నుంచి ఎక్కడకు పోయారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు ఎక్కడకు పోయాయని నిలదీశారు. అవ్వ తాతకు ఇస్తానని చెప్పిన పెన్షన్ ఎక్కడకు పోయిందని అడిగారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బడుగులకు బీసీ రిజర్వేషన్ల పై మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఎన్నో రకాల మోసాలను ఈ కాంగ్రెస్ పార్టీ బీసీలకు చేసిందని విమర్శించారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలో ఒక్క బీసీ సర్పంచ్ లేడు అని.. మహబూబ్‌నగర్‌లో చాలా గ్రామాల్లో బీసీ సర్పంచ్‌లు లేరు, వార్డు మెంబర్లు లేరని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ లకు 2011 జనాభా లెక్కల ప్రకారం వార్డు మెంబర్లకు ఇస్తారని.. సర్పంచ్‌లకు మాత్రం అది ఇవ్వరని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై ఎక్కడ నియమ నిబంధనలు పాటించడం లేదని తెలిపారు.బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిట్టనిలువుగా ముంచిందని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ను తుంగలో తొక్కిందని విమర్శించారు. విద్యార్థుల్లారా మీ భవిష్యత్తు కోసం మా బీఆర్ఎస్ పార్టీ కొట్లాడుతుందని అన్నారు. అసెంబ్లీలో విద్య, ఉద్యోగాలు, రాజకీయ పదవుల గురించి బిల్లు పాస్ చేశారు కానీ ఇప్పుడు విద్య, ఉద్యోగాలు ఎక్కడకు పోయాయి. ఆ బిల్లును ఎందుకు రాష్ట్రపతికి పంపలేదని ప్రశ్నించారు. అనేక హామీలను ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదని అన్నారు. బీసీలకు మంత్రి పదవులు కూడా ఇవ్వలేదని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్తామని పీసీసీ అధ్యక్షుడు అన్నారని.. ఆ మాట ఎక్కడికి పోయిందని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ నోట కూడా అబద్దాలు చెప్పించారని మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉన్నది బీఆర్ఎస్ పార్టీనే అని ఆయన స్పష్టం చేశారు. రెండు సంవత్సరాల క్రితం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏంటి? ఇప్పుడు ఉన్న ఆర్థిక పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. బీఫామ్ లేని ఎన్నికలు ఇవి అని.. అలాంటిది పార్టీ నుంచి గెలిపిస్తామని అనడం ఏంటని అన్నారు.బీజేపీ, కాంగ్రెస్ రెండూ ఒక్కటే అని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రూ.3వేల కోట్లు వెనక్కిపోతాయని కిషన్ రెడ్డి అనగానే.. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలకు వెళ్తున్నాడని తెలిపారు. రూ.3వేల కోట్లకు చూసుకుంటే బీసీలు నిలువునా మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 2014కు ముందు ఏముంది.. ఇప్పుడు ఏముంది ఆలోచన చేయాలని ప్రజలకు సూచించారు. ఏ ఎన్నిక వచ్చిన ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఇప్పటికీ మోసపోయి గోసపడుతున్నామని తెలిపారు. ఈ రాష్ట్రానికి కేసీఆర్ మాత్రమే శ్రీరామ రక్ష అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రేవంత్ రెడ్డికి బుద్ధి చెబుతారని అన్నారు.

# రాజన్న ఆలయ విస్తరణ పనులు పరిశీలించిన ప్రభుత్వ విప్, ఇంచార్జి కలెక్టర్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

వేములవాడ శ్రీ రాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఆలయ దక్షిణ భాగంలో భారీ యంత్రాలతో చేస్తున్న పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు వేములవాడ ఆర్టీసీ డిపో సమీపంలోని నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇండ్లను ప్రభుత్వ విప్, ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మిస్తున్నారు? ఎప్పటి వరకు పూర్తి చేస్తారో ఆరా తీశారు. మొత్తం రూ. 5 కోట్ల 61 లక్షల వ్యయంతో 144 ఇండ్లు నిర్మిస్తున్నా మని అధికారులు తెలిపారు.అక్కడి నుంచి నేరుగా మూలవాగుపై నిర్మిస్తున్న నూతన బ్రిడ్జి పనులను, వేములవాడ ప్రధాన ఆలయం నుంచి తిప్పాపూర్ బస్ స్టాండ్ వరకు నిర్మిస్తున్న రోడ్డు, డ్రైనేజ్ పనులను పరిశీలించారు. భీమేశ్వర ఆలయంలో భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. షవర్లు, కళ్యాణకట్ట, క్యూ లైన్లు పరిశీలించి, ఆలయ ఈఓ, ఇంజనీరింగ్ అధికారులకు విప్, ఇంచార్జి కలెక్టర్ సూచనలు చేశారు.

**భీమేశ్వర ఆలయంలో పూజలు**



భీమేశ్వర ఆలయంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా విప్, ఇంచార్జి కలెక్టర్ కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఇంచార్జి కలెక్టర్ ను ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి, ఆశీర్వాదం అందజేశారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, ఆలయ ఈఓ రమాదేవి, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు పాల్గొన్నారు.

# రైతులు ఆయిల్ పామ్ సాగు పై దృష్టి సారించాలి : అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**



రైతులు ఆయిల్ పామ్ పంట సాగు పై దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి తహసీల్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భూ భారతిలో భాగంగా ఎన్ని దరఖాస్తులు వచ్చాయో ఆరా తీశారు. అనంతరం స్తంభంపల్లి, అనంతపల్లి, కోరెం, తడగొండ, బోయినపల్లి, కొదురుపాక, మాన్వాడ, ఇల్లంతకుంట మండలం పొత్తూర్, గాలిపెల్లి, ముస్కానిపేట, అనంతారం, పెద్దలింగాపూర్ లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పరిశీలించి, నిర్వాహకులకు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతులు ఆయిల్ పామ్ పంట సాగు చేయాలని, దానితో ఎన్నో లాభాలు ఉన్నాయని తెలిపారు. సమీపంలోని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

# మన నాగరికత భారతదేశానికి పునాది

## మన మూలాల్లోకి తిరిగి కనెక్ట్ అవుదాం-అయోధ్య ధ్వజ్ ఆరోహణపై పవన్

**అమరావతి,నవంబర్25(సమయజ్యోతి):**

మన సంస్కృతి, నాగరికత భారతదేశానికి పునాదిగా ఉన్నాయని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. సనాతన ధర్మం యొక్క లోతైన జ్ఞానం మనకు సహనం, శాంతి, సామరస్యంతో పాటు.. సృష్టి పట్ల లోతైన గౌరవాన్ని నేర్పిందని తెలిపారు. వలస పాలకులు, తూర్పు భారతదేశ వ్యాపారులు కలిసి మన భౌతిక సంపదను దోచుకోవడమే కాకుండా న్యూనత, తక్కువ ఆత్మగౌరవం వంటి విత్తనాలను కూడా నాటారని అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. మేధో, సాంస్కృతిక విధ్వంసాన్ని థామస్ బాబింగ్టన్ మెకాలే వంటి వ్యక్తులు చాకచక్యంగా ప్రణాళిక చేసి అమలు చేశారని చెప్పారు. వారు ఇంగ్లీషును సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడని, మన సొంత వారసత్వం గురించి సిగ్గుపడటం నేర్పిన మేధో.. సాంస్కృతిక బానిసత్వానికి ఒక బ్లూప్రింట్ వంటి వారని అభివర్ణించారు. వలసవాదులు భౌతికంగా వెళ్లిపోయిన చాలా కాలం తర్వాత కూడా.. ఈ వలస మనస్తత్వానికి సంబంధించిన హ్యాంగోవర్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మన సొంత గుర్తింపును తిరిగి పొందేందుకు.. నిర్ణయాత్మక చొరవ తీసుకున్నందుకు సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. రేస్‌కోర్స్ రోడ్ పేరును లోక్ కళ్యాణ్ మార్గ్‌గా మార్చడం ప్రజల దృష్టిని సంక్షేమం వైపు మారుస్తుందన్నారు. ఈరోజు శ్రీరామ జన్మభూమి ఆలయంలో ధ్వజారోహణం కార్యక్రమం.. సాంస్కృతిక పునరుజ్జీవనం, నాగరికత ధృవీకరణను సూచిస్తుందని చెప్పారు. మనందరిలో భారత్ భవిష్యత్తు ఉందని.. మన మూలాలతో తిరిగి కనెక్ట్ అవుదామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు

# మలక్కా ప్రాంతంలో అల్పపీడనం కేంద్రీకృతం

## మరో వాయుగుండం ఏర్పడే అవకాశం

## రెండు అల్పపీడనాలతో భారీ వర్షాలకు ఛాన్స్

**విశాఖపట్నం,నవంబర్25(సమయజ్యోతి):**

బంగాళాఖాతంలో నెలకొంటున్న పరిస్థితులు వాతావరణ నిపుణులను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఒక అల్పపీడనం కొనసాగుతుండగానే.. మరోటి ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ రెండు అల్పపీడనాలూ మనుగడ కోసం పోటీ పడనున్నాయి. రాబోయే రోజుల్లో రెండూ కలిసిపోయే అవకాశముంది. మలక్కా జలసంధి సమీపంలో ప్రస్తుతం తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ మంగళవారం నాటికి వాయుగుండంగా, గురువారంలోగా తుపానుగా బలపడుతుందని భారత వాతావరణ విభాగం అంచనా వేస్తోంది. ఇది తుపానుగా బలపడేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంపై మరోసారి వరణుడు తన ప్రతాపం చూపనున్నాడు. ఈనెలాఖరున రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది. మలక్కా జలసంధి ప్రాంతంలో తీవ్ర అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని పేర్కొంది. రాగల 6 గంటల్లో ఇది పశ్చిమ - వాయవ్య దిశగా కదులుతూ అదే ప్రాంతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. ఆ తదుపరి 48 గంటల్లో దక్షిణ బంగాళాఖాతంలో తుఫానుగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే ఉపరితల ఆవర్తన ప్రభావంతో కొమోరిన్, నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక పరిసర ప్రాంతాల్లో మరో అల్పపీడనం ఇప్పటికే కేంద్రీకృతమై ఉన్నట్లు చెప్పింది. రాబోయే 24 గంటల్లో అల్పపీడనం బలపడే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో శనివారం నుంచి మంగళవారం వరకు కోస్తాంధ్ర, రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు... పలు చోట్ల భారీ వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని తెలిపింది. గురువారం నుంచి మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే తిరిగి రావాలని అధికారులు సూచించారు. వర్షాల నేపథ్యంలో రైతులకు కూడా వాతావరణ అధికారులు కీలక సూచనలు చేశారు. మరో మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తమై వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరించారు. అయితే తుఫాన్ తదుపరి కదలికలపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. గత గణాంకాల ప్రకారం.. నవంబరులో ఏర్పడే తుపాన్లు చాలావరకు పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ వైపు వెళు తుంటాయి. కొన్ని మాత్రం ఏపీ, తమిళనాడు తీరాలను తాకాయి. సాధారణంగా అల్పపీడనం ఏర్పడ్డాక దాని గమనంపై దాదాపు స్పష్టత వస్తుంది. ఇప్పటివరకు దీనిపై సరైన స్పష్టత లేదని, తుపానుగా బలపడిన తర్వాతే దీని దిశ, గమనం, తీరాన్ని తాకే కేంద్రంపై అంచనాకు రాగలమని నిపుణులు తెలిపారు.కొమొరిన్ ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో మంగళవారం నైరుతి బంగాళాఖాతంలో కొమొరిన్, శ్రీలంక పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని ఐఎండీ తెలిపింది. తర్వాత ఇది మరింత బలపడుతుందని అంచనా వేస్తోంది. వీటి ప్రభావంతో మంగళ, బుధవారాల్లో కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురవొచ్చని ఐఎండీ తెలిపింది. 29న రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు, 30న బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. సముద్రం అలజడిగా మారనున్న నేపథ్యంలో గురు, శుక్రవారాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించింది. ఇప్పటికే వెళ్లిన మత్స్యకారులు గురువారం లోగా ఒడ్డుకు చేరుకోవాలని విజ్ఞప్తి చేసింది. మలక్కా జలసంధి సమీపంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం.. వాయుగుండంగా బలపడుతుందని, ఈ నెల 30 నాటికి బలహీనడపతుందని పలు వాతావరణ నమూనాలు అంచనా వేస్తున్నాయి. కొమొరిన్ ప్రాంతంలో ఏర్పడనున్న అల్పపీడనం తర్వాత బలపడుతుందని, డిసెంబరు 1 నాటికి తమిళనాడు, దక్షిణ కోస్తా మధ్యలో తీరం దాటుతుందని సూచిస్తున్నాయి.

# రైతులు మిశ్రమ పంటలపై దృష్టి పెట్టాలి

**కర్నూలు,నవంబర్25(సమయజ్యోతి):**

ప్రకృతి వ్యవసాయంపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టి, అధిక దిగుబడులు పొందాలని పత్తికొండ ఏ డి ఏ మోహన్ విజయ్ కుమార్ అన్నారు. పత్తికొండ మండల పరిధిలోని హోసూరు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్న మీకోసం అనే కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటరాముడు రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాన్ని లబ్ధి గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్, రబీ సీజన్ లో కొర్ర, సజ్జ, మినుములు, చిరుధాన్యాలు మిశ్రమ పంటలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రైతులకు తెలియజేశారు. రైతులు సాగుచేసిన పంటలపై సూచనలు సలహాలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి రియాజ్ భాష, శ్రీనాథ్, రైతు సేవా సిబ్బంది మాబు, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మంగళగిరి ఎయిమ్స్‌కు చెవిరెడ్డి తరలింపు

**విజయవాడ,నవంబర్25(సమయజ్యోతి):**

మద్యం కుంభకోణం కేసులో ఏ38గా ఉన్న వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని జైలు అధికారులు చికిత్స కోసం ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం బాగాలేదని చెప్పడంతో ముందుగా ఆయనను విజయవాడ ఆస్పత్రికి తరలించారు. అయితే రెండు రోజులుగా తన కాళ్లు వాపు వస్తున్నాయని, వెరికోస్ వీయిన్స్ ఉందని జైలు అధికారులతో చెవిరెడ్డి చెప్పారు. వాస్కులర్ సర్జన్‌కు చూపించాలని కోరడంతో సాధారణ పరీక్షల నిమిత్తం ఆయన్ను నిన్న విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్య పరీక్షల అనంతరం.. మంగళగిరిలోని ఎయిమ్స్‌కు రిఫర్ చేస్తూ సూపరింటెండెంట్ ఎయిమ్స్‌కు లేఖ రాశారు. ఎయిమ్స్ నుంచి అధికారిక అనుమతి రావడంతో ఇవాళ ఉదయం విజయవాడ జైలు నుంచి చెవిరెడ్డిని ఎయిమ్స్‌కు తరలించారు. అక్కడ పరీక్షల అనంతరం తదుపరి నిర్ణయం తీసుకునే వీలుంది.

# 16 నెలల్లోనే 3 లక్షలకు పైగా ఇళ్ళు పూర్తి

## ఉగాదిలోగా మరో అయిదు లక్షల ఇళ్లు పూర్తి చేస్తాం

## మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడి

**అమరావతి,నవంబర్25(సమయజ్యోతి):**



16 నెలల్లోనే 3 లక్షలకు పైగా ఇళ్ళు పూర్తి చేసినట్లు మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. మరో అయిదు లక్షల ఇళ్లు ఉగాదిలోగా పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇంత వరకు ప్రారంభం కాని ఇళ్లు 3 లక్షల 30 వేల ఇళ్లు ఉన్నాయని వివరించారు. 15.59 లక్షల ఇళు ఈ అయిదేళ్ళలో ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వమనే స్ఫూర్తితో సీఎం, మంత్రులు పనిచేస్తున్నామని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టెక్నాలజీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో ముందుంటున్నామన్నారు.గృహనిర్మాణ శాఖ విషయంలో మూడు లక్షల ఇళ్లు పూర్తి చేసిన సందర్భంగా కీ హ్యాండోవర్ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఆ కార్యక్రమాన్ని కూడా వైసీపీ వివాదం చేసిందని మండిపడ్డారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 8 లక్షల 627 ఇళ్లు పూర్తయ్యాయని గుర్తుచేశారు. అలాగే జగన్ సీఎంగా ఉన్నప్పుడు కేవలం 6 లక్షలు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. హౌసింగ్ ఫర్ ఆల్ అని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రివ్యూలో ముఖ్యమంత్రి చెప్పారన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి గృహప్రవేశం చేయిస్తామని చెప్పారు. ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహించేందుకు కామన్ వాల్‌తో కలిపి కట్టుకోవడానికి జీవో ఇస్తామన్నారు.8 లక్షల ఇళు శాంక్షన్ అయితే 30 శాతం మాత్రమే పూర్తి చేశారని గత ప్రభుత్వంపై మండిపడ్డారు. గత వైసీపీ హయాంలో ఆప్షన్ 3 కింద ప్రభుత్వమే ఇళ్లు నిర్మించే స్కీంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కాంట్రాక్ట్ తీసుకున్న రాక్రీట్ నిర్మాణ సంస్థ.. స్కీంకు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. 47 వేల 850 ఇళ్లు తీసుకుని నిర్మిస్తామని చెప్పి ఎక్కడా పూర్తి చేయలేదన్నారు. 80 కోట్ల రూపాయలు అవకతవకలు చేశారని విజిలెన్స్ విచారణలో తేలిందన్నారు. రాక్రీట్ సంస్థపై క్రిమినల్, సివిల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ఇప్పటికైనా ఆప్షన్ 3లో పేమెంట్ కింద చివరి దశలో ఉన్న నిర్మాణాలు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.

# ఎపిలో కొత్తగా మరో మూడు జిల్లాలు

## మార్కాపురం, మదనపల్లె, పోలవరం ఏర్పాటు

## కేబినేట్ సబ్ కమిటీ ప్రతిపాదనలకు సిఎం అంగీకారం

**అమరావతి,నవంబర్25(సమయజ్యోతి):**

ఎపిలో కొత్తగా మూడు జిల్లాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్కాపురం, మదనపల్లె, రంపచోడవరం కేంద్రంగా ఈ జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జిల్లాల పునర్విభజన, డివిజన్లు, మండలాల మార్పు చేర్పులపై సచివాలయంలో కీలక సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా మూడు జిల్లాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముందు నుంచి చెబుతున్నట్టుగా మార్కాపురం, మదనపల్లి జిల్లాల ఏర్పాటుకు మంత్రివర్గం ఓకే చెప్పింది. అలాగే రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు అంగీకరించారు. మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై సమీక్ష నిర్వహించిన అనంతరం మార్పులు చేర్పులకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేసేందుకు కూడా అంగీకరించారు. అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, ప్రకాశం జిల్లాలో అద్దంకి, కొత్తగా ఏర్పాటయ్యే మదనపల్లి జిల్లాలో పీలేరు, నంద్యాల జిల్లాలో బనగానపల్లె, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర రెవెన్యూ డివిజన్లు ఏర్పాటుకు నిర్ణయించారు. కర్నూలు జిల్లా పెద్ద హరివనాన్ని కొత్త మండలంగా ఏర్పాటుకు నిర్ణయం తీసుకోగా.. ఆదోని మండలాన్ని విభజించి కొత్త మండలం ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి ఓకే చెప్పారు. ఇక కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది.

# రాయలసీమలో ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

## రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు

## అధికారులతో సమీక్షలో చంద్రబాబు నిర్ణయం

**అమరావతి,నవంబర్25(సమయజ్యోతి):**



ఉద్యానవన పంటల ద్వారా రాయలసీమ రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాయలసీమలో హార్టికల్చర్ పంటల సాగుకు సబ్సిడీలు, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్‌తో చేయూతను ఇచ్చే అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఉద్యానవన పంటల ద్వారా రాయలసీమ రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళిక అమలుపై మంత్రులు, అధికారులతో సీఎం సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన పూర్వోదయ పథకంలో భాగంగా రాయలసీమలో ఉద్యాన పంటల అభివృద్ధిపై సమావేశంలో చర్చించారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో 92 క్లస్టర్ల ద్వారా హార్టికల్చర్ సాగును ప్రోత్సహించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. 5.98 లక్షల మంది ఉద్యాన రైతులకు మరింత లబ్ది కలిగేలా ప్రణాళికను సిద్ధం చేస్తోంది. డ్రిప్, సాగునీరు, రవాణా, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పంచాయతీ రాజ్ రోడ్లు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, గోడౌన్లు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించం ద్వారా హార్టికల్చర్ రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు చేపట్టింది. మారుతున్న ఆహారపు అలవాట్లు, డిమాండ్ ఉన్న పంటల సాగు, టెక్నాలజీ వాడకం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని హార్టికల్చర్ పంటలకు ప్రోత్సాహం కల్పించే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ సమావేశానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఏపీ లాజిస్టిక్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటు

## రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**అమరావతి,నవంబర్25(సమయజ్యోతి):**

లాజిస్టిక్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా ప్రభుత్వం కృషి మొదలు పెట్టింది. ఇందుకోసం ప్రత్యేకంగా కార్పోరేషన్ ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు సిఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు. ఏపీ లాజిస్టిక్స్ ఇన్ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏపీ-లింక్ ద్వారా లాజిస్టిక్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా చూడాలని సీఎం చంద్రబాబు సూచించారు. మొత్తంగా ఐదు రంగాలను ఈ కార్పొరేషన్ అనుసంధానించనుంది. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రోడ్లు, అంతర్గత జలరవాణా, గిడ్డంగులను అనుసంధానిస్తూ లాజిస్టిక్స్ వ్యయం తగ్గించడంపై ఈ ఏపీ-లింక్ దృష్టి పెట్టబోతోంది. రాష్ట్రంలోని లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలు, సమన్వయం, పర్యవేక్షణకు ఏపీ లింక్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. ఈ కార్పొరేషనుకు ఒక ఎండీతో పాటు, వివిధ అనుబంధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు సేవలిందిస్తారు. అలాగే సలహా కమిటీని, క్షేత్రస్థాయిలో ప్రాజెక్టులను అమలు చేయడానికి జిల్లా స్థాయి సెల్స్ ఏర్పాటు చేయనున్నారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేసే హోల్డింగ్ కంపెనీ తరహాలో ఏపీ-లింక్ వ్యవహరించనుంది. ఏపీ లింక్ ద్వారా లాజిస్టిక్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా చూడాలని, అలాగే క్షేత్ర స్థాయిలో వివిధ రంగాలకు అవసరమైన లాజిస్టిక్స్ అందించే విషయంలో సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

# ఉద్భవ్-2025' పేరుతో డిసెంబర్‌లో జాతీయ స్థాయి

**అమరావతి,నవంబర్25(సమయజ్యోతి):**

'ఉద్భవ్-2025' పేరుతో డిసెంబర్‌లో ఏపీలో జాతీయ స్థాయి ఉత్సవాలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్, లోగోను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో తొలిసారి జాతీయ స్థాయి ఉద్భవ్-2025 పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిసెంబర్ 3, 4, 5 తేదీల్లో పోటీలు వైభవంగా నిర్వహిస్తున్నాం. 22 రాష్ట్రాల నుంచి 1800 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నాం. కేఎల్ యూనివర్సిటీలో 12 వేదికలు ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తాం అని సంధ్యారాణి తెలిపారు.

# హోంగార్డు అశ్లీల నృత్యాలు

## విధుల నుంచి తప్పించిన ఎస్పీ

**విజయవాడ,నవంబర్25(సమయజ్యోతి):**

హోంగార్డు అశ్లీల నృత్యాలు వైరల్ కావడంతో అతడిని
విధుల నుంచి తప్పించి ఎస్పీ తప్పించారు. కంకిపాడు రూరల్ సీఐ జీప్ డ్రైవర్ అజయ్ కుమార్ చిన్నారుల ఎదుట అశ్లీల నృత్యాలు చేయడంపై జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. హోంగార్డు అజయ్ కుమార్ అసభ్యకర నృత్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అతన్ని విధుల నుంచి తప్పించారు. పోలీస్ శాఖ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరించడంపై జిల్లా ఎస్పీ మండిపడ్డారు. హోంగార్డు నృత్యాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని స్థానిక పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. పోలీస్ సిబ్బంది ప్రవర్తన పోలీస్ శాఖ ప్రతిష్ఠను పెంచేలా ఉంచాలని, అప్రతిష్ఠకు గురి చేసేలా ఎవరు వ్యవహరించినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పోలీస్ కస్టడీకి జోగి రమేశ్

## నేటి నుంచి నాలుగురోజులు విచారణ

**విజయవాడ,నవంబర్25(సమయజ్యోతి):**

నకిలీ మద్యం కేసులో వైసీపీ నేత జోగి రమేష్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. కోర్టు అనుమతితో ఆయనను విచారించనున్నారు. ఈ మేరకు నేటి నుంచి 4 రోజుల పాటు కస్టడీకి ఇస్తూ ఎక్సైజ్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ కేసులో జోగి రమేష్‌ను పోలీసులు ప్రశ్నించనున్నారు. ఈ కేసులో ఏ1గా ఉన్న అద్దేపల్లి జనార్దన్ రావు, ఏ2గా ఉన్న అద్దేపల్లి జగన్‌మోహన్ రావు కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు నిర్ధారించారు. అయితే మొదటి నుంచి ఈ వ్యవహారం వెనుక జోగి రమేష్ ఉన్నారని, ఆయన సమక్షంలో లక్షల రూపాయల లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. దీనిపై అధికారులు ఇప్పటికే అద్దేపల్లి బ్రదర్స్‌ను రెండు సార్లు విచారించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఈ స్కామ్‌లో జోగి రమేష్ పాత్రపై జనార్దన్ రావు, జగన్‌మోహన్ రావు ఇచ్చిన వాంగ్మూలాలను రికార్డ్ చేశారు. ఈ పరిణామల నేపథ్యంలో జోగి రమేష్‌ను 10 రోజుల పాటు కస్టడీ కోరుతూ ఎక్సైజ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. విచారించిన న్యాయస్థానం 4 రోజుల పాటు విచారించేందుకు అనుమతి ఇచ్చింది. ఏపీ లిక్కర్ స్కామ్‌లో జోగి రమేష్ కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. ఏపీ ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు జోగి రమేష్ నకిలీ మద్యం గురించి వార్తలను లీక్ చేసినట్లు తేలింది. దీంతో పోలీసులు దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేశారు. జోగి రమేష్ నకిలీ మద్యం తయారీకి ఆదేశించారని, ఆ సమాచారాన్ని వైసీపీ మీడియాకు లీక్ చేశారని అధికారులు నిర్ధారించారు. జోగి రమేష్ సూచనల మేరకే తాము నకిలీ మద్యం తయారు చేసినట్లు జనార్దన్ రావు పోలీసుల ముందు అంగీకరించిన విషయం తెలిసిందే.

# టీ20 ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల

## ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం

## మార్చి 8 వరకు కొనసాగింపు

## బ్రాండ్ అంబాసిడర్‌గా రోహిత్ శర్మ

భారత్, శ్రీలంక ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచకప్ వేదికలు ఖరారయ్యాయి. 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8వ తేదీ వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. అహ్మదాబాద్?లో మార్చి 8న ఫైనల్ మ్యాచ్? నిర్వహించనున్నారు. ఒకవేళ పాకిస్థాన్ ఫైనల్ చేరితే మ్యాచ్ వేదికను మార్చే అవకాశం ఉంది. ఇందుకోసం భారత్‌లో ఐదు, శ్రీలంకలో మూడు వేదికలను ఎంపిక చేశారు. ఈ టీ20 ప్రపంచ కప్? బ్రాండ్ అంబాసిడర్?గా రోహిత్? శర్మను ఎంపిక చేసినట్లు జై షా తెలిపారు.

## రోహిత్, కోహ్లీ 2027 వరల్డ్ కప్ ఆడాలి

### సౌతాఫ్రికా లెజెండరీ ఫీల్డర్ జాంటీ రోడ్స్

టీమిండియా సీనియర్ స్టార్స్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల భవిష్యత్తుపై ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో పెద్ద చర్చ జరుగుతోంది. 2027 వన్డే వరల్డ్?కప్ నాటికి వీరిద్దరూ జట్టులో ఉంటారా? లేక మేనేజ్?మెంట్ తప్పిస్తుందా? అనే సందేహాలు అందరిలోనూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో సౌతాఫ్రికా లెజెండరీ ఫీల్డర్ జాంటీ రోడ్స్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. రోహిత్, కోహ్లీ ఇద్దరూ 2027 వరల్డ్ కప్ ఆడాలని, వారి అవసరం టీమ్‌ఇండియాకు చాలా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో మాజీ క్రికెటర్లు సచిన్, ధోనీ పేర్లను ప్రస్తావించారు. రోహిత్, కోహ్లీకు ఉన్న అనుభవం, మానసిక దృఢత్వం వెలకట్టలేనివని జాంటీ అన్నారు. "వరల్డ్?కప్ లాంటి మెగా టోర్నీల్లో కేవలం టాలెంట్ ఉంటే సరిపోదు, ఒత్తిడిని తట్టుకునే మానసిక శక్తి కావాలి. అది వీరిద్దరి దగ్గర పుష్కలంగా ఉంది. అందుకే 2027 వరల్డ్ కప్‌లో వీరు ఆడాలని నేను కోరుకుంటున్నాను" అని రోడ్స్ చెప్పుకొచ్చారు. యువ ఆటగాళ్లు ఎంతమంది ఉన్నా, ఇటువంటి భారీ ఈవెంట్లలో సీనియర్ల పాత్రే కీలకమని ఆయన విశ్లేషించారు.రిటైర్మెంట్ ఎప్పుడు తీసుకోవాలి అనే ప్రశ్నపై స్పందిస్తూ రోడ్స్ ఆసక్తికరమైన ఉదాహరణలు ఇచ్చారు. "గతంలో సచిన్ తెందూల్కర్, ఎంఎస్ ధోనీ విషయంలోనూ ఇలాంటి ప్రశ్నలే వచ్చాయి. ఎప్పుడు రిటైర్ అవ్వాలి? ఎప్పుడు ఆడాలి? అనేది పూర్తిగా వాళ్ల ఇష్టం.



# కోహ్లీ టెస్ట్ క్రికెట్‌లో కొనసాగాలని మాజీ క్రికెటర్ సూచన



టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌లో కొనసాగాలని మాజీ క్రికెటర్ శ్రీవాత్స్ గోస్వామి సూచించాడు. అవసరమైతే వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించి టెస్ట్ ఫార్మాట్ ఆడాలని రిక్వెస్ట్ చేశాడు. ప్రస్తుతం కోహ్లీని టెస్ట్ క్రికెట్ మిస్సవుతుందని, ముఖ్యంగా టీమిండియాకు అతని అవసరం ఉందని అభిప్రాయపడ్డాడు.అంతర్జాతీయ టీ20లతో పాటు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ.. కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్న విరాట్ కోహ్లీ.. అందుకోసం తనకిష్టమైన టెస్ట్ ఫార్మాట్‌కు కూడా గుడ్‌బై చెప్పాడు. కోహ్లీ రిటైర్మెంట్ వెనుక చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో పాటు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఉన్నాడని ప్రచారం జరిగింది.అయితే కోహ్లీ, రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత టెస్ట్‌ల్లో టీమిండియా ప్రదర్శన మరీ దారుణంగా తయారైంది. ఇంగ్లండ్ పర్యటనలో ఐదు టెస్ట్‌లను డ్రా చేసుకున్న టీమిండియా.. సొంతగడ్డపై వెస్టిండీస్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను గెలుచుకుంది. కానీ సౌతాఫ్రికాతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ దిశగా సాగుతోంది.ముఖ్యంగా కోల్‌కతా వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో టీమిండియా 124 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక 30 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. గింగిరాలు తిరిగిన స్పిన్ వికెట్‌పై చేతులెత్తేసింది. గౌహతి వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్‌లోనూ అదే పేలవ ప్రదర్శనను కొనసాగించింది. ఇదే పిచ్‌పై సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 489 పరుగుల భారీ స్కోర్ చేస్తే.. భారత్ మాత్రం 201 పరుగులకే ఆలౌటైంది. రోడ్డులాంటి పిచ్‌పై భారత బ్యాటర్లు బోల్తా పడటంతో అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ క్రమంలోనే విరాట్ కోహ్లీ తిరిగి టెస్ట్ టీమ్‌లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని శ్రీవాత్స్ గోస్వామి ఎక్స్ వేదికగా పేర్కొన్నాడు. 'విరాట్ కోహ్లీ వన్డేలకు వీడ్కోలు పలికి టెస్ట్ క్రికెట్‌లో కొనసాగాలి. ఇక తన వల్ల కాదు అనే రోజు వరకు టెస్ట్‌లు ఆడాలి. టెస్ట్ క్రికెట్ కోహ్లీని ఎంతో మిస్సవుతుంది. కేవలం ఆటగాడిగానే కాదు.. మైదానంలో అతను తీసుకొచ్చే శక్తి, జట్టుపై అతనికి ఉండే ప్రేమ, ఆట పట్ల అతనికి ఉన్న అభిరుచి, ఎలాంటి పరిస్థితుల్లోనైనా గెలవగలమని అతను ఇచ్చే నమ్మకాన్ని జట్టు కోల్పోతుంది.'అని శ్రీవాత్స్ గోస్వామి తన ట్వీట్‌లో పేర్కొన్నాడు. శ్రీవాత్స్ గోస్వామి ట్వీట్‌తో ఏకీభవిస్తున్న నెటిజన్లు.. విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ ఆడాలని రిక్వెస్ట్ చేస్తున్నారు.

# పంత్‌పై రవిచంద్రన్ అశ్విన్ విమర్శలు



టీమిండియా తాత్కలిక టెస్ట్ కెప్టెన్ రిషభ్ పంత్‌పై మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ విమర్శలు గుప్పించాడు. సౌతాఫ్రికాతో రెండో టెస్ట్‌లో ఆటగాళ్ల కన్నా ముందే రిషభ్ పంత్ చేతులెత్తేసాడని తెలిపాడు. నాలుగో రోజు సౌతాఫ్రికా బ్యాటింగ్‌ను ఉద్దేశించి అశ్విన్ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టాడు.'రెండో ఇన్నింగ్స్‌లో పుంజుకుంటామనే ఆశ నాకు ఉంది. కానీ మైదానంలో ఆటగాళ్ల బాడీ లాంగ్వేజ్ తీవ్ర బాధకు గురి చేస్తోంది.'అని గుండె పగిలే ఎమోజీతో కెప్టెన్ రిషభ్ పంత్ ఫొటో పెట్టాడు. ముందుండి నడిపించాల్సిన కెప్టెన్ రిషభ్ పంతే భుజాలు దిగేసాడనే విషయాన్ని అశ్విన్ తెలియజేశాడు. ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమి ముంగిట నిలిచింది. 549 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 15.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 27 పరుగులు చేసింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్(13), కేఎల్ రాహుల్(6) దారుణంగా విఫలమయ్యారు. నైట్‌వాచ్‌మన్‌గా కుల్దీప్ యాదవ్(2 బ్యాటింగ్) బ్యాటింగ్‌కు రాగా.. సాయి సుదర్శన్(2 నాటౌట్)మరో వికెట్ పడకుండా ఆటను ముగించాడు. ప్రస్తుతం భారత్ 522 పరుగుల వెనుకంజలో ఉంది. ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమిని తప్పించుకోవాలంటే ఆఖరి రోజైన బుధవారం మొత్తం బ్యాటింగ్ చేయాలి. లేదంటే టీమిండియా ఘోర పరాజయం తప్పదు. సౌతాఫ్రికా విజయానికి 8 వికెట్లు కావాలి. ప్రస్తుతం సౌతాఫ్రికా బౌలర్లు ఉన్న ఫామ్ నేపథ్యంలో భారత ఓటమి పెద్ద కష్టమేం కాదనిపిస్తోంది. ఇప్పటికే పిచ్‌పై పగుళ్లు ఏర్పడి స్పిన్నర్లకు అడ్వాంటేజ్‌గా మారింది. ఆఖరి రోజు పిచ్ స్పిన్నర్లకు మరింత అనుకూలంగా మారనుంది. అంతకుముందు 26/0 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన సౌతాఫ్రికా 78.3 ఓవర్లలో 260/5 స్కోర్ వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. దాంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 288 పరుగులు కలుపుకొని మొత్తం 548 పరుగుల ఆధిక్యం సాధించింది.

# జాసన్ రాయ్ సత్తా చాటాడు



ప్రపంచంలోనే రిచ్చెస్ట్ క్రికెట్ లీగ్ అంటేనే ఠక్కున మైండ్‌లోకి వచ్చేది ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్). ఈ లీగ్‌లో ఆడాలని ప్రతీ విదేశీ ప్లేయర్ ఉవ్విళ్ళూరుతుంటారు. అయితే ఇంగ్లాండ్ ప్లేయర్స్ మాత్రం కొంచెం డిఫెరెంట్. తమ దేశానికే ప్రాతినిధ్యం ఇస్తామని.. అదే మా ఫస్ట్ ప్రయారిటీ అంటూ వేలంలో అమ్ముడుపోయినా లీగ్ నుంచి అర్ధంగా వైదోలుగుతుంటారు. ఆ కోవకు చెందిన ప్లేయర్ ఇంగ్లాండ్ మాజీ ఓపెనర్ జాసన్ రాయ్. ప్రస్తుతం ఐపీఎల్‌లో జాసన్ రాయ్‌పై రెండేళ్ల బ్యాన్ ఉంది. అయితే మనోడు విదేశీ లీగ్స్‌లో మాత్రం తన సత్తా చాటుతున్నాడు. ప్రస్తుతం అబుదాబీ వేదికగా టీ10 లీగ్ జరుగుతోంది. ఇందులో జాసన్ రాయ్ రాయల్ చాంప్స్ తరపున బరిలోకి దిగాడు. అంతేకాదు ఆ జట్టుకు సారథ్య బాధ్యతలు కూడా చేపట్టాడు. పలు మ్యాచ్‌లలో కెప్టెన్ ఇన్నింగ్స్‌లు ఆడాడు గానీ.. తన జట్టుకు విజయాలు అందించడంలో విఫలమయ్యాడు. మొత్తంగా ఇప్పటివరకు ఆడిన 4 మ్యాచ్‌లలో 9 ఫోర్లు, 5 సిక్సర్లతో 96 పరుగులు చేశాడు. ఈ సమయంలో అతడి స్ట్రైక్ రేటు 162.71గా ఉంది. ఈ విధ్వంసకర ఓపెనర్ బ్యాట్‌తో తన ప్రతాపం చూపించినా.. కెప్టెన్‌గా విఫలమయ్యాడు. రాయల్ చాంప్స్ ఆడిన 4 మ్యాచ్‌లలో అన్నింటా ఓడిపోయి.. పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచింది. కాగా, జాసన్ రాయ్ గతంలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన సంగతి తెలిసిందే.



# నిఖిల్ చౌదరి అద్భుతమైన సెంచరీ

ఏ దేశంలోనైనా పలువురు క్రికెటర్లు.. ఆ దేశ క్రికెట్ బోర్డు తమకు ఛాన్స్‌లు ఇవ్వకపోతే.. విదేశీ జట్ల తరపున బరిలోకి దిగుతుంటారు. మన భారత ఆటగాళ్లు అయితే కోకొల్లలు. గతంలో టీమిండియా దిగ్గజ ఆటగాళ్లు పలువురు విదేశీ టోర్నమెంట్లలో తమ సత్తా చాటిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా డొమెస్టిక్ క్రికెట్ టోర్నీలలో చాలామంది భారత ఆటగాళ్లు అద్భుతంగా రాణించారు. ఆ కోవకు చెందిన ఓ ప్లేయర్ గురించి ఇప్పుడు మాట్లాడుకుందామా.. అనుకోకుండా విదేశాలకు వెళ్లిన అతడు అక్కడే చిక్కుకుని స్థిరపడిపోయాడు. మరి అతడెవరో కాదు.. నిఖిల్ చౌదరి. 2016–17 మధ్య పంజాబ్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించిన ఈ రైట్ హ్యాండ్ బ్యాట్స్‌మెన్.. ఇప్పుడు ఆస్ట్రేలియాలో డొమెస్టిక్ టోర్నమెంట్లు ఆడుతున్నాడు. అక్కడ అతడు అటు బంతితో.. ఇటు బ్యాట్‌తో ప్రత్యర్థులను ఊచకోత కోశాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియా డొమెస్టిక్ టోర్నమెంట్ షెఫ్ఫీల్డ్ షీల్డ్ ట్రోఫీ 2025–26 జరుగుతోంది. ఈ టోర్నీ 13వ మ్యాచ్‌లో న్యూసౌత్ వేల్స్, టాస్మానియా జట్లు తలపడుతున్నాయి. ఇందులో టాస్మానియా జట్టు తరపున బరిలోకి దిగిన నిఖిల్ చౌదరి అద్భుతమైన సెంచరీ సాధించడమే కాకుండా.. మొత్తంగా 163(9 ఫోర్లు, 5 సిక్సర్లు) పరుగుల భారీ స్కోర్ సాధించి.. ఆ టోర్నీలో సెంచరీ సాధించిన భారత బ్యాటర్‌గా రికార్డుల్లోకి ఎక్కాడు. నిఖిల్ విధ్వంసంతో టాస్మానియా జట్టు 8 వికెట్ల నష్టానికి 623 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఆ జట్టులో టిమ్ వార్డ్(119), జెవెల్(102) రాణించారు. అటు బ్యాట్‌తోనే కాదు.. ఇటు బంతితోనూ అదరగొట్టాడు నిఖిల్ చౌదరీ. ఇక్కడ ఆసక్తికర విషయమేమిటంటే.. కోవిడ్ సమయంలో టూరిస్ట్ విసా మీద ఆస్ట్రేలియా వెళ్లిన నిఖిల్ చౌదరీ.. తిరిగి రాలేక అక్కడే చిక్కుకుపోయాడు. బ్రతుకుతెరువు కోసం అక్కడే పనులు చేస్తూ.. అలాగే క్లబ్ క్రికెట్ ఆడుతూ ఉండిపోయాడు. ఇక అతడి ఆటతీరు చూసిన ఓ కోచ్.. ఆపై హబర్ట్ హర్రికేన్స్ జట్టులో చేరాడు.

## స్మృతి మంధాన పెళ్లి వాయిదాపై రూమర్స్


స్మృతి మంధాన, పలాశ్‌ముచ్చల్ ల వివాహంలో ట్విస్ట్ ల మీద ట్విస్ట్ లు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా వీరి పెళ్లి వాయిదాపై అనేక రూమర్స్ నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. ముందుగా అనుకున్నట్లు నవంబర్ 23న వీరి పెళ్లి మహారాష్ట్రలోకి సాంగ్లీలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రీవెడ్డింగ్ షూట్ లో స్మృతి మంధాన, పలాశ్‌ముచ్చల్ ఫుల్ జోష్ గా డ్యాన్స్ లు చేశారు. ఒకరి మెడలో మరొకరు పూల మాలలు కూడా వేసుకున్నారు. మరికొన్ని గంటల్లో పెళ్లి వేడుక జరగనుంది. ఇంతలో స్మృతి మంధాన తండ్రి శ్రీనివాస్ కు గుండెపోటు రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత పెళ్లిని వాయిదా వేస్తున్నట్లు స్మృతి మంధాన కుటుంబ సభ్యులు ప్రకటించారు. మరుసటి రోజు పలాష్ ముచ్చల్ అస్వస్థతకు గురయ్యి వెంటనే కోలుకున్నాడు. ఆ తర్వాత స్మృతి మంధాన తన ఇన్‌స్టాలోని వెడ్డింగ్, నిశ్చితార్థంకు సంబంధించిన అన్నిఫోటోలు, వీడియోలను డిలీట్ చేసింది. ఈ క్రమంలో అసలు వీరి మధ్య ఏంజరుగుతుందో అని నెట్టింట అనేక రూమర్స్ వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. స్మృతి మంధాన ను.. పలాష్ చీటింగ్ కూడా చేశాడని వార్తలు తెరమీదకు వచ్చాయి. ఈ నేపథ్యంలో పలాశ్ ముచ్చల్ సోదరి, సింగర్ పలాక్ ముచ్చల్ తన ఇన్ స్టా వేదికగా వివరణ ఇచ్చారు.స్మృతి మంధాన తండ్రి శ్రీనివాస్ మంధాన అనారోగ్యానికి గురవడంతో ప్రస్తుతానికి స్మృతి, పలాశ్ ల వివాహం నిలిచిపోయిందని తెలిపారు. ప్రస్తుతం రెండు కుటుంబాలుకూడా ఒత్తిడిలో ఉన్నాయని.. ఈ సున్నితమైన పరిస్థితిలో ఇరు కుటుంబాల గోప్యతను గౌరవించాలంటూ, తొందరలోనే అన్ని సమస్యలు పరిష్కరం అవుతాయని ఇన్‌స్టాలో పోస్టు పెట్టారు. మరోవైపు వీరి పెళ్లిపై ప్రస్తుతం బిగ్ సస్పెన్స్ నెలకొంది. మొత్తంగా స్మృతి మంధాన, పలాశ్‌ముచ్చల్ ల ఎపిసోడ్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ గా మారింది.



# భాగ్యశ్రీతో డేటింగ్ అంతా ఉత్తిదే
## కొట్టిపడేసిన హీరో రామ్

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా భాగ్యశ్రీ హీరోయిన్ జంటగా వస్తున్న మూవీ ఆంధ్రాకింగ్ తాలూకా నవంబర్ 27న రిలీజ్ కాబోతోంది. అయితే ఈ సినిమా మొదలైనప్పటి నుంచి రామ్, భాగ్య శ్రీ డేటింగ్ లో ఉన్నారంటూ ఓ రేంజ్ లో రూమర్లు వస్తున్నాయి. ఇద్దరూ ప్రైవేట్ గా కలుసుకుంటున్నారని.. విదేశాలకు టూర్లకు వెళ్తున్నారంటూ రకరకాల రూమర్లు వస్తూనే ఉన్నాయి. ఇక మూవీ రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటం తో వరుస ప్రమోషన్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రామ్.. దీనిపై క్లారిటీ ఇచ్చారు. డేటింగ్ రూమర్లు అన్నీ ఫేక్ అంటూ కొట్టి పారేశాడు. భాగ్య శ్రీ తనకు మంచి ఫ్రెండ్ అని క్లారిటీ ఇచ్చాడు. ఈ సినిమా కోసం నేను స్వయంగా ఓ లవ్ సాంగ్ రాశాను. అప్పటి నుంచి మా ఇద్దరి మధ్య ఏదో ఉందని అంతా అనుకుంటున్నారు. భాగ్య శ్రీపై ఇంట్రెస్ట్ లేకుండా ఇంత మంచి సాంగ్ రాయడు కదా అని అంతా అనుకుంటున్నారు. కానీ భాగ్యశ్రీని మా సినిమా కోసం తీసుకోక ముందే ఆ పాట రాశాను. సినిమాలోని హీరో, హీరోయిన్ పాత్రల మధ్య అంత మంచి బాండింగ్ ఉంటుంది కాబట్టే ఆ పాట బాగా వచ్చింది. అంతకు మించి మా మధ్య ఏమీ లేదు. భాగ్య శ్రీ మంచి యాక్టర్ అంటూ చెప్పాడు రామ్. భాగ్య శ్రీ కూడా ఇదే విషయంపై స్పందిస్తూ.. రామ్ తనకు మంచి ఫ్రెండ్ మాత్రమే అని తెలిపింది. రజనీకాంత్ అంటే నాకు చాలా ఇష్టం. చిన్నప్పటి నుంచి చెన్నైలో పెరిగాను. ఆయన సినిమాలన్నీ చూసేవాడిని. 'బాషా' సినిమా అనుభవాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఆ సినిమాకు 100వ రోజు కూడా టికెట్స్ దొరకలేదు. చివరి నిమిషంలో రెండు టికెట్స్ దొరికాయి. దీంతో నేను మా ఫ్రెండ్ వెళ్లాం. ఆరోజు థియేటర్‌లో అభిమానులు ఆ సినిమాను సెలబ్రేట్ చేసుకోవడం చూసి ఆశ్చర్యపోయాను. అప్పటికే వాళ్లు ఆ సినిమాను ఎన్నోసార్లు చూసి ఉంటారు. డైలాగులు కూడా తెలిసిపోయి ఉంటాయి. అయినా అందరూ ఆసక్తిగా చూడడం చూసి నేను షాకయ్యానని రామ్ తెలిపాడు. ఎవరైనా సక్సెస్ కావాలంటే వారికి రెండు ప్రధాన కారణాలు ఉంటాయి. ఎవరికి వారు తాము చేసే పని మీద శ్రద్ధ కలిగిఉండాలి. అలాగే దానికోసమే పుట్టాం అనిపించేలా చాలా కష్టపడాలి. నాకు ఆ రెండు లక్షణాలు ఉన్నాయి. అందుకే ఎప్పటికైనా విజయం సాధిస్తాననే నమ్మకం ఉందన్నాడు.





## వారణాసి లెవల్లో ఎన్టీఆర్-నీల్ మూవీ ప్రమోషన్ ?

వారణాసి మూవీ టైటిల్‌ను భారీ ఈవెంట్ ద్వారా ప్రకటించిన విషయం తెలిసిందే. భారతీయ సినిమా ప్రమోషన్స్‌కు ఇది కొత్త నిర్వచనంగా మారింది. ఈ వినూత్న ప్రయత్నం దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, హాలీవుడ్ మీడియా దృష్టిని కూడా ఆకర్షించి గ్లోబల్ లెవెల్‌లో పెద్ద చర్చగా మారింది. సాధారణంగా టైటిల్స్‌ను పోస్టర్, గ్లింప్స్ లేదా సోషల్ మీడియా పోస్టుల ద్వారా ప్రకటిస్తారు. కానీ వారణాసి యూనిట్ మాత్రం పాత్రలు, కథ, థీమ్ వివరించే క్రమంలో స్టేజ్ ఈవెంట్ ఏర్పాటు చేసి ప్రమోషన్‌లో కొత్త మైలురాయి సృష్టించింది. దీనికి మంచి రెస్పాన్స్ రావడంతో ఇప్పుడు ఇదే స్ట్రాటజీని ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబోలో రూపొందుతున్న సినిమాకి ఉపయోగించనున్నట్టు తెలుస్తోంది. ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ మూవీ టైటిల్‌పై భారీ ఆసక్తి నెలకొనగా, మూవీకి డ్రాగన్ అనే పేరు ఖరారు చేసినట్టు టాక్ వినిపిస్తుంది. అయితే డ్రాగన్' పేరు ఇంకా నిర్ధారణ కాలేదని మైత్రి మూవీ మేకర్స్ ప్రొడ్యూసర్ రవి శంకర్ స్పష్టం చేశారు. 'డ్రాగన్ కూడా ఓ ఆప్షన్ మాత్రమే. అధికారికంగా ఏ టైటిల్ ఫైనల్ కాలేదు. ఇది పూర్తిగా అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్. ప్రశాంత్ నీల్ విజన్‌లో ఎన్టీఆర్ కొత్త అవతరం చూపించ బోతున్నాడు. టైటిల్, ఫస్ట్ గ్లింప్స్ వారణాసి మాదిరిగానే ప్రాజెక్ట్‌కి తగ్గ స్థాయిలో గ్రాండ్‌గా రిలీజ్ చేస్తామని తెలిపారు. ఫిల్మ్ ప్రమోషన్‌లో భారీ ఈవెంట్ మోడల్ ఎన్నో ప్రయోజనాలను కలిగిస్తోంది. సినిమా థీమ్‌ను స్పష్టంగా ప్రేక్షకులకు చెప్పే అవకాశం కలుగుతుంది. ఇలా చేస్తే గ్లోబల్ ఆడియన్స్‌ను చేరుకునే అవకాశం ఉంటుంది. హాలీవుడ్ మీడియా సహా విదేశీ ప్రెస్ అటెన్షన్, తక్కువ సమయంలో భారీ బజ్ క్రియేట్ చేయగలగడం, కంటెంట్‌పై తప్పుదారులు వెళ్లకుండా క్లారిటీ ఇవ్వడం కొత్త ట్రెండ్‌ను ఆమోదించేలా చేశాయి. వారణాసి ఈవెంట్ తర్వాత భారతీయ సినీ పరిశ్రమలో 'టైటిల్ రివీల్ ఈవెంట్' అనే కొత్త ప్రమోషనల్ ట్రెండ్ ప్రారంభమైంది. అదే మోడ్‌లో ఎన్టీఆర్ -నీల్ ప్రాజెక్ట్ కూడా అడుగులు వేస్తుండటం అభిమానుల్లో భారీ అంచనాలను పెంచింది.

## 28న అఖండ-2 ప్రీరిలీజ్ ఈవెంట్
### ముఖ్య అతిథింగా రానున్న సిఎం రేవంత్

నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబోలో అఖండకు సీక్వెల్ గా వస్తున్న చిత్రం 'అఖండ-2. ఇప్పటికే రిలీజ్ చేసిన అఖండ 2 ఫస్ట్ గ్లిమ్స్ సంచలనం సృష్టించింది. ఇటీవల వచ్చిన ఈ సినిమా ఫస్ట్ సింగిల్ జాజికాయ జాజికాయ భారీ వ్యూస్ రాబట్టిన ఈ సెన్సేషన్ సినిమాకు థమన్ సంగీతం అందిస్తున్నాడు. డిసెంబర్ 5న అఖండ 2 వరల్డ్ వైడ్ గా రిలీజ్ కు రెడీ అయింది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ లో జోరు పెంచింది టీమ్. అందులో భాగంగానే అఖండ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 28న నిర్వహించబోయే అఖండ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిధిగా రాబోతున్నారు. ఇందుకు సంబంధించి అనౌన్స్ మెంట్ కూడా రాబోతుంది. అలాగే ఈ వేడుకకు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ని కూడా మరో అతిథిగా పిలిచేందుకు ప్లాన్ చేశారట మేకర్స్. కానీ బన్నీ ప్రస్తుతం అట్లీ సినిమా షూటింగ్ లో బిజీగా ఉండడం వల్ల రావడం కుదరడం లేదట. సినిమా రిలీజ్ అయ్యాక సక్సెస్ మీట్ కి బన్నీ వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు డిసెంబరు 4న రాత్రి నుంచే ప్రీమియర్లు ప్రదర్శించాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. అందుకు తగ్గ అనుమతుల కోసం నిర్మాతలు ఎదురు చూస్తున్నారు.








## హరిణ్యారెడ్డితో 27న రాహుల్ పెళ్లి
### సంగీత్ వేడుకల్లో క్రికెటర్ యజ్వేంద్ర చాహల్ రాక

స్టార్ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ తనకి కాబోయే భార్య హరిణ్యా రెడ్డికు ఇచ్చిన స్పెషల్ గిఫ్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. నవంబర్ 27న జరగనున్న వారి వివాహం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. సంగీత్ వేడుకలు అట్టహాసంగా జరుగుతున్న ఈ సమయంలో రాహుల్ ఇచ్చిన సర్‌ప్రైజ్‌కి హరిణ్య తెగ ఫిదా అయింది. టీమ్‌ఇండియా స్టార్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌ని స్వయంగా సంగీత్ వేడుకకు ఆహ్వానించి, తన కాబోయే భార్యకు రాహుల్ స్పెషల్ ట్రీట్ ఇచ్చాడు. చాహల్‌ను చూసి హరిణ్య ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. హరిణ్య తన సోషల్ మీడియాలో .. ఇంత పెద్ద గిఫ్ట్ నా జీవితంలో మర్చిపోలేను. థ్యాంక్ యూ రాహుల్! అంటూ చాహల్‌తో దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇవి నెట్టింట వైరల్ అవుతున్నాయి. హరిణ్యా రెడ్డి చాహల్‌కు వీరాభిమాని. ఆమె తన పోస్ట్‌లో మా సంగీత్‌కు వచ్చి మా వేడుకను ప్రత్యేకం చేసినందుకు చాహల్ గారికి ధన్యవాదాలు అని రాసింది. ప్రస్తుతం రాహుల్ సిప్లిగంజ్, హరిణ్య రెడ్డి, క్రికెటర్ చాహల్ కలిసి దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుండగా, వీటిని చూసిన అభిమానులు, నెటిజన్లు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. ఇటీవల రాహుల్, హరిణ్యా కలిసి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించిన విషయం తెలిసిందే. హరిణ్యా రెడ్డి నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి సోదరుడి కుమార్తె. నిశ్చితార్థం సమయంలో కూడా రాహుల్ ఆమెకు ఖరీదైన హ్యాండ్‌బ్యాగ్ గిఫ్ట్ చేసి అందరినీ ఆకట్టుకున్నాడు.

## హేమ డెలివరీ కోసం ఆస్పత్రిని బుక్ చేసిన ధర్మేంద్ర



బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్ర, ఆరు దశాబ్దాలపాటు బాలీవుడ్‌కు ఎన్నో చిరస్మరణీయ చిత్రాలను అందించారు. ఆయన మరణవార్తతో సినీలోకం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.డ్రీమ్ గర్ల్ హేమమాలిని తో ప్రేమ, పెళ్లి వ్యవహారం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశమవుతోంది. 19 ఏళ్ల వయసులోనే ధర్మేంద్ర.. ప్రకాష్ కౌర్ అనే మహిళను వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ దంపతులకు నలుగురు పిల్లలు ఉన్నారు. ఇక 1970లో 'డ్రీమ్ గర్ల్' హేమమాలినితో కలిసి చేసిన సినిమాల సమయంలో వీరిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగి ప్రేమగా మారింది. 1980లో వీరు వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ధర్మేంద్ర ఇస్లాం మతం స్వీకరించి, దిలావర్ ఖాన్ పేరుతో హేమ మాలినిని వివాహం చేసుకున్నట్లు పెద్ద ఎత్తున పుకార్లు వచ్చాయి. హేమమాలిని అంటే ధర్మేంద్రకు అంతగా పిచ్చి. ఇక 1981లో హేమ మాలిని తొలి బిడ్డకు జన్మనిచ్చింది. ఆ సమయంలో ధర్మేంద్ర చేసిన ఓ పనికి అందరూ షాక్ అయ్యారు. హేమమాలిని డెలివరీ టైమ్ దగ్గరపడుతున్న సమయంలో.. ఆమె కోసం ఏదైనా సమ్‌థింగ్ స్పెషల్‌గా చేయాలని భావించారు ఈ దిగ్గజ నటుడు. బిడ్డను కనే సమయంలో హేమ మాలినికి సౌకర్యంగా, గోప్యతకు భంగం కలగకుండా ఉండేందుకు మొత్తం నర్సింగ్ హోమ్‌నే బుక్ చేశాడు. నర్సింగ్ హోమ్‌లో ఉన్న 100 రూమ్‌లను బుక్ చేసినట్లు హేమ సన్నిహితురాలు నీతు ద్వారా వెలుగులోకి వచ్చింది. 'హేమ గర్భవతి అని ఎవరికీ తెలియదు. ఆ సమయంలో ఆమె గోప్యతకు భంగం కలగకుండా ఉండేందుకు ధరమ్ జీ ఆసుపత్రిలోని అన్ని గదులను బుక్ చేశాడు' అని నీతు ఓ సందర్భంలో గుర్తు చేసుకుంది. హేమ-ధర్మేంద్ర జంటకు ఇద్దరు కుమార్తెలు. తొలుత ఇషా డియోల్ జన్మించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆహాన డియోల్ జన్మించారు. ప్రకాశ్ కౌర్-ధర్మేంద్ర జంటకు ఇద్దరు కుమారులు సన్నీ డియోల్, బాబీ డియోల్ ఉండగా, వారితో పాటు కుమార్తెలు విజేత, అజిత ఉన్నారు. ఇలా మొత్తం ఆరుగురు పిల్లలకు ధర్మేంద్ర తండ్రి అయ్యారు.



## 28న నెట్‌ఫ్లిక్స్‌లో మాస్ జాతర రిలీజ్

మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన 75వ చిత్రం 'మాస్ జాతర'. యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా కనిపించిన ఈ సినిమాకు భాను భోగవరపు దర్శకత్వం వహించాడు. అక్టోబరు 31న ప్రీమియర్స్ తో వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయింది. కానీ ప్రీమియర్ షో నుండే ఈ సినిమా ఫ్లాప్ టాక్ తెచ్చుకుంది. రొటీన్ రెగ్యులర్ కథ, బోరింగ్ స్క్రీన్ ప్లేతో ఆడియెన్స్ కు విసుగుతెప్పించాడు దర్శకుడు. రాజేంద్ర ప్రసాద్ క్రింజ్ కామెడి నవ్వుతెప్పించకపోగా విసిగించింది. కనీసం మినిమం వసూళ్లు కూడా రాబట్టలేక రవితేజ కెరీర్ లో మరో డిజాస్టర్ గా మిగిలింది. రిలీజ్ కు ముందే మాస్ జాతర డిజిటల్ రైట్స్ ను నెట్ ఫ్లిక్స్ భారీ ధరకు కొనుగోలు చేసింది. థియేటర్ లో ఫ్లాప్ అయినా ఈ సినిమా ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకుంది. ఈ నెల 28 నుండి నెట్ ఫ్లిక్స్ ఈ సినిమాను స్ట్రీమింగ్ కు తీసుకురాబోతుంది. తెలుగు, తమిళ్, మలయాళం, కన్నడ భాషలలో ఈ సినిమాను స్ట్రీమింగ్ తీసుకువస్తుంది నెట్ ఫ్లిక్స్. థియేటర్ లో రిలిజ్ అయిన 28 రోజుల తర్వాత మాస్ జాతర ను స్ట్రీమింగ్ చేస్తుంది నెట్ ఫ్లిక్స్.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685